అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 12-1-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 322 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

- 18న నామినేషన్లు, 29న పోలింగ్, ఫలితాలు
- రెండు ఎమ్మెల్సీల స్థానాల భర్తీకి కసరత్తు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కోటా కింద రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. శుక్రవారం నుంచి ఈ నెల 18 వరకు నామినేషన్లు దాఖలకు గడువుంది. 19న నామినేషన్ల పరిశీలన, 22న ఉపసంహరణ ఉంటుంది. ఈనెల 29న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ...2లో

ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం

సీఎంను కలిసిన గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చంద్రశేఖర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చంద్రశేఖర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలో పెట్టుబడులు, రహదారి భద్రతపై వారు చర్చించారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేసారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తుందనీ, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో తెలంగాణ ...11లో

మా తండాల అభివృద్ధిని అడ్డుకున్నారు..

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌పై మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ వర్గీయుల ఆగ్రహం

- మహబూబాబాద్ ఎంపీ స్థానంపై సమీక్షలో వాగ్వాదం
- మరోసారి ఛాన్స్ ఇవ్వండి : ఎంపీ మాలోత్ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ హయాంలో తమ తమ తండాలను పంచాయతీలు కాకుండా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అడ్డుపడ్డారంటూ ఆ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఆయా తండాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని వారు వాపోయారు. బీఆర్ఎస్ పార్లమెంటు సన్నాహక సమావేశాల్లో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ ఎంపీ స్థానంపై సమీక్ష ...11లో

31 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు ముందు చివరిసారిగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 9 వరకూ జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 31న బడ్జెట్ ...11లో

వణికిన ఢిల్లీ | ఢిల్లీ-ఎన్సీఆర్‌లో భూప్రకంపనలు..

- రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.2 గా నమోదు
- భయంతో పరుగులు తీసిన జనం

న్యూఢిల్లీ : ఢిల్లీ-ఎన్సీఆర్‌లో భూకంపం వచ్చింది. ఈ ప్రాంతాల్లో భూప్రకంపనలు చాలా సేపు కనిపించాయి. భూకంపం వచ్చిన వెంటనే అక్కడి ప్రజలు ఇండ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రస్తుతం ప్రాణ, ఆస్తి ...11లో



రామా కనవేమిరా..!


అభివృద్ధి పేరుతో విధ్వంసం

- గూడు కోల్పోయి రోడ్డున పడ్డ అయోధ్య వాసులు
- మూతపడిన వ్యాపారాలు...దినదిన గండంగా బతుకులు
- ప్రజల పాలిట శాపంగా మారిన రోడ్ల విస్తరణ, సుందరీకరణ

ఆధునిక పౌరాణిక కథతో ఓ భారీ బాలీవుడ్ చిత్రాన్ని నిర్మిస్తే అందు లోని సెట్టింగులు ఎలా ఉంటాయో తెలుసా? ఇప్పుడు అయోధ్యలో కూడా ఎక్కడ చూసినా అలాంటివే దర్శనమిస్తున్నాయి. రామ మందిర ప్రాణ ప్రతిష్టకు ముహూర్తం సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలో ఏ మూలన చూసినా బుల్డోజర్లు, ఎక్సవేటర్లు, డ్రిల్లింగ్ మిషన్లు రాత్రింబవళ్లూ అవిశ్రాంతంగా పని చూసుకుంటూ పోతున్నాయి. వేలాది మంది కార్మికులు అలుపూ సొలుపూ లేకుండా సుందరీకరణ పనులకు తుది మెరుగులు దిద్దుతున్నారు.

లక్నో : మూడు ప్రధాన రహదారులలో ఉన్న భవనాలకు రామ్‌పథ్, భక్తిపథ్, రామ జన్మభూమిపథ్ అని పేర్లు పెట్టి సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. 30 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన యానిమేషన్ లే-అవుట్ ఆనాటి అయోధ్య రాజ్యాన్ని గుర్తుకు తెస్తోంది. ఈ నెల 22న ప్రధాని నరేంద్ర మోడీ రామ మందిరాన్ని ప్రారంభించి, రాబోయే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సమర శంఖం పూరించబోతున్నారు.

అయితే అయోధ్యలో ఇప్పుడు ఎక్కడ చూసినా అంతా హడావిడే కనిపిస్తుంది. అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మిస్తామని బీజేపీ ఇచ్చిన హామీ నెరవేరిందన్న ఉత్సాహంతో వేలాది మంది భక్తులు అయోధ్యకు తరలి వస్తున్నారు. రామ జన్మభూమి సమీపంలో నివసిస్తున్న ప్రజలు గత ఏడు దశాబ్దాలుగా జరుగుతున్న ఈ తతంగాన్ని, రాజకీయాలను చూస్తూనే ఉన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి వారికి పెద్దగా ఆనందం కలిగించడం లేదు. పైగా అది వారి పాలిట శాపంగా మారింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి పేరుతో రహదారుల విస్తరణ, సుందరీకరణ పనుల



కోసం తమ నివాస గృహాలను నేలమట్టం చేయడం, జీవనోపాధిని దెబ్బతీయడం వారిని కుంగదీస్తోంది. వాస్తవానికి ప్రధాన ఆలయ నిర్మాణం 2025 నాటికి కానీ పూర్తి కాదు. ఐదు సంవత్సరాల బాల రాముడి నూతన విగ్రహ ప్రతిష్టాపన కోసం అక్కడ ఇప్పుడు ప్రాణ ప్రతిష్ట జరుగుతోంది.

ఇంకేం మిగిలింది?

పాక్షికంగా ధ్వంసమైన తన ఇంటిలో మట్టి నేలపై కూర్చుని దిక్కులు చూస్తున్న మంజు మొదన్వాల్ అనే మహిళను పలకరిస్తే 'అతి పెద్ద సమస్య తీరిపోయింది. ఇంకా ఏం మిగిలింది?' అని నిర్వేదంతో ...3లో

ఎలా బతకాలి?

ఒక్క మాటలో చెప్పాలంటే ఆలయం పరిసరాలలోని నివాసాలను, దుకాణాలను పూర్తిగా తొలగించారు.ఆలయానికి దూరంగా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని కూడా వదలలేదు. నగరంలో ఎవరికీ జానెడు స్థలం అనేదే లేకుండా పోయింది. అంతా ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంది. నామమాత్రపు పరిహారం చెల్లించింది. ఇక ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలి? ఎలా బతకాలి? అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఒకప్పుడు అయోధ్య అందరిదీ

చారిత్రకంగా చూస్తే అయోధ్య కేవలం హిందువులకే కాదు...ఇస్లాం, జైన, బౌద్ధ, సిక్కు మతాల ప్రాభవానికి కూడా అది కేంద్రంగా ఉంది. అక్కడ హిందూ దేవాలయాలతో పాటు మసీదులు, జైన దేవాలయాలు, గురుద్వారాలు, బౌద్ధ ప్రదేశాలు కూడా ఉన్నాయి. అయితే ఇప్పుడు అయోధ్య బహుళ సాంస్కృతిక వారసత్వాన్ని కోల్పోయింది. ఈ నగరం బహుళ జాతి సంస్థలకు డబ్బు సంపాదించడానికి, పార్టీలకు ఓట్లు రాల్చడానికి కేంద్రంగా మారింది. ఇక ఈ నెల 22న అట్టహాసంగా జరుగుతున్న ఆలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో భాగస్వాములయ్యే అవకాశం స్థానికులకు మాత్రం లేదు. వారెవ్వరికీ ఆహ్వానాలు లేవు. 'నగరంలో రామ మందిరాన్ని నిర్మిస్తున్నారు. కానీ రాముడిపై స్థానికులకు ఉన్న హక్కును నిరాకరిస్తున్నారు. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి నగర వాసులు హాజరు కావడం వారికి ఇష్టం లేదు. మమ్మల్ని ఇండ్లలోనే ఉండమని చెబుతున్నారు' అని స్థానికులు వాపోతున్నారు.

కలహాల కాపురంలో ఇమడలేకే..!

బీజేపీకి విక్రమ్‌గౌడ్ గుడ్‌బై | ఆ పార్టీలో అంటరానితనం ఉందంటూ తీవ్ర వ్యాఖ్యలు

- నేతల తొత్తులకే పదవుల్లో ప్రాధాన్యమంటూ ఆరోపణ
- ఆయన బాటలోనే రాజేందర్, జయసుధ, బండా కార్తీకరెడ్డి !
- మరికొంత మందీ పార్టీని వీడే అవకాశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


లోక్‌సభ ఎన్నికల వేళ రాష్ట్రంలో బీజేపీకి బిగ్‌షాక్ తగిలింది. మాజీ మంత్రి ముఖేశ్ గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ రాజీనామా చేశారు. పార్టీలో కొత్తగా చేరిన నేతలకు, పాతకాపులకు మధ్య జరుగుతున్న ఆధిపత్యపోరు మరోమారు తెరపైకి వచ్చింది. పార్టీలో ప్రజాబలం లేని నేతలు పదవుల పేరుతో పెత్తనం చెలాయిస్తున్నారంటూ, అంటరానితన ముందంటూ తన లేఖలో బాంబు పేల్చటం చర్చనీయాంశమవుతున్నది. క్రమశిక్షణకు బీజేపీ పెట్టింది పేరు అంటూ ఉపన్యాసాలు దంచుతూ పెద్దపెద్ద నాయకులే బహిరంగంగా కొట్టుకుంటున్నా పార్టీ నాయకత్వం ప్రేక్షక పాత్ర వహిస్తున్న తీరును ఆయన ఎండగట్టడం ఆ పార్టీ డొల్లతనానికి అద్దం పడుతున్నది. లోక్‌సభ ఎన్నికల ముందు ఈ రాజీనామాల పర్వం శాంపిల్ మాత్రమేననీ, రానున్న కాలంలో మరింత మంది కీలక నేతలు పార్టీని వీడబోతున్నారనే చర్చ నడుస్తున్నది. విక్రమ్‌గౌడ్ బాటలోనే సినీనటి మాజీ ఎమ్మెల్యే జయసుధ, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, హైదరాబాద్ మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి కూడా బీజేపీకి రాజీనామా చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఆ నలుగురు కూడా తమ సొంతగూటి(కాంగ్రెస్ పార్టీ)లోకి వెళ్లబోతున్నారని తెలిసింది. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా ఆ పార్టీకి రాజీనామా చేస్తారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అన్ని పార్టీలూ పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న వేళ బీజేపీ నేతల కలహాల కాపురం ఎటువైపు దారితీస్తుందో చూడాలి.

విక్రమ్‌గౌడ్ పార్టీని వీడుతూ కిషన్‌రెడ్డికి రాసిన లేఖనే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. 'పార్టీ నియమావళికి, సిద్ధాంతానికి కట్టుబడి పార్టీ అప్పగించిన ప్రతి పనిని క్రమశిక్షణతో విజయవవంతంగా పూర్తిచేయడానికి చిత్తశుద్ధితో వ్యవహరించాను. కానీ, పార్టీ నన్ను ఏ స్థితిలోనూ గుర్తించలేదు....పార్టీ సిద్ధాంతాన్ని కాకుండా కేవలం కొంత మంది నాయకుల వెంట చేరి తొత్తులుగా వ్యవహరిస్తున్న వారికే ఇక్కడ న్యాయం జరిగింది..' అంటూ ...11లో



నౌకాదళంలో అదానీ డ్రోన్లు

మోడీ దోస్తులకు రక్షణ రంగం నజరానా



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం వచ్చాక..దేశ భద్రతను కూడా పణంగా పెట్టడానికి రెడీ అయిపోతోంది. రక్షణ రంగానికి చెందిన రాఫెల్ డీల్‌లో మధ్యవర్తిగా అనిల్ అంబానీకి అవకాశం కల్పిస్తే..ఇపుడు అదానీ గ్రూపులోని డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ విభాగం తయారు చేసిన డ్రోన్లు భారత నౌకాదళంలో చేరాయి. భారత శాస్త్రవేత్తలకు కొదవలేదనే అనే ప్రధాని మోడీ. ప్రభుత్వరంగంలో ఉన్న సంస్థల కన్నా..తన దోస్తులకు నజరానాగా ఇవ్వటానికి రెడీ అయిపోతున్న తీరుపట్ల ...11లో

మా గోస పట్టదా..!

ఇండ్ల స్థలాల కోసం భారీ ర్యాలీ

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మానుకోటలో మహాధర్నా
- ఇండ్ల స్థలాలిచ్చే వరకు పోరాటం
- గుడిసెవాసులపై అక్రమ కేసులు ఎత్తేయాలి : సీపీఐ(ఎం) నేతలు జి.నాగయ్య , ఎస్.వీరయ్య



నవతెలంగాణ-మహబూబాబాద్

ఇండ్ల స్థలాలకు పట్టాల కోసం పేదలు కదం తొక్కారు. సీపీఐ(ఎం) అండగా మహబూబాబాద్ జిల్లా మానుకోటలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం మహాధర్నా చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం వెనక పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చేవరకు సీపీఐ(ఎం) పోరాడుతుందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుంకరి వీరయ్య స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కుమ్మక్కైన అధికారులు ఆ భూములను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని, తక్షణమే పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలని, గుడిసె వాసులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్ ...3లో

గుడిసెలపై అధికారుల జులుం

- హనుమకొండలో అర్ధరాత్రి బుల్డోజర్లతో కూల్చివేత
- ఇండ్లు, ఇంటి జాగాలపై కాంగ్రెస్ ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి : రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

వివరాలు 3లో..





ధరణి రిపేరు షురూ!

సచివాలయంలో కమిటీ తొలి భేటీ

- సమస్యల శాశ్వత పరిష్కారంపై ఫోకస్
- సమాచార సేకరణ తర్వాత నివేదిక
- పెండింగ్‌లో 2.31 లక్షల దరఖాస్తులు
- డిజిటల్ సంతకం కోసం 1.8 లక్షల ఎకరాల భూములు
- 130 రకాలకుపైగా రెవెన్యూ సమస్యలు

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

ధరణితో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వ్యవస్థలోని లోటుపాట్లను సవరిస్తూ, భూ సమస్యలకు తక్షణ, శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల నిపుణుల కమిటీ తొలి సమావేశం గురువారం సచివాలయంలో జరిగింది.

చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) మెంబర్ కమిషనర్ నవీన్ మిట్టల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రేమండ్ పీటర్, ప్రముఖ న్యాయవాది సునిల్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌లతో కూడిన కమిటీ ధరణి అమలవుతున్న తీరు, విధి విధానాలను అధికారులను అడిగి తెలుసుకుంది. ఏ మాడ్యూల్‌లో ఎన్ని దరఖాస్తులొచ్చాయని ఆరా తీసింది. కోర్టు పరిధిలో ఉన్న భూములు, పీవోబీ జాబితాలో ఉన్న భూముల వివరాలను గ్రామం, మండలాల వారీగా సేకరించనున్నారు. ధరణికి ముందు, తరువాత ఉన్న అసైన్డ్ భూమి, భూదాన్, ఎండోమెంట్, వక్ఫ్ భూములు, పీవోబీ, ప్రభుత్వ భూములు, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలపై సమావేశంలో చర్చించారు.

పెండింగ్‌లో 2.31 లక్షలు దరఖాస్తులు

రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం 1 నుంచి 33 వరకు టెక్నికల్ మ్యాడ్యూల్స్ (టీఎం) ఉన్నాయి. ఈ మాడ్యూళ్లలో పరిష్కారం కోసం చేసుకున్న 2.31 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 1.8 లక్షల ఎకరాల భూములకు సంబంధించి డిజిటల్ సంతకాల (డీఎస్) కోసం భూ యాజమానులు ఎదురు చూస్తున్నారు. ధరణి పోర్టల్ అమల్లోకి రాకముందు 75 రకాల భూ సమస్యలుంటే, ధరణి వచ్చాక ఆ సమస్యల సంఖ్య 130కి పెరిగాయనే విమర్శలున్నాయి. సాదా బైనామా కోసం 9.5 లక్షల దరఖాస్తులు రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం అవకాశం లేదు.

అమల్లోకి తెచ్చిన ఆర్వోఆర్-2020 చట్టంలో చిన్నపాటి సవరణ చేస్తే సాదాబైనామా కోసం నిరీక్షిస్తున్న లక్షలాది మందికి ఊరట లభిస్తుంది. ప్రస్తుతం ధరణి ఆన్‌లైన్‌లో నమోదైన భూముల వివరాలు, యాజమానుల పేర్లు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలకు సంబంధించిన సమాచారానికి పూర్తి స్థాయి బాధ్యులు ఎవరన్న ప్రశ్న తలెత్తున్నది. వీటికి సంబంధించిన మాన్యువల్ రికార్డులు లేకపోవడంతో ఎప్పుడైనా ఈ సమస్యలు రావచ్చని నిపుణులు అంటున్నారు. ఒకరి భూమి మరో వ్యక్తిపై నమోదై పట్టాదారు పాస్ పుస్తకం పొందితే.. ఆ పాస్‌పుస్తకాన్ని రద్దు చేసే అధికారం ఏ అధికారికీ లేదు. బాధితుడు కేవలం కోర్టుకెళ్లి తేల్చుకోవాల్సి ఉంటుంది.

చిన్న సమస్యకూ ఇబ్బందులే

భూమికి సంబంధించిన సర్వే నెంబరు మిస్సింగ్, ఎక్స్‌టెన్షన్ కరెక్షన్ తదితర చిన్న సమస్యలకు కూడా ఫైలు సీసీఎల్ఏ వరకు వెళ్లాల్సి వస్తోంది. డిజిటల్ పాస్‌బుక్ మొదటి పేజీలో తప్పులు సరిచేయించుకోవాలంటే కలెక్టర్‌ను ఆశ్రయించాలి. ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లను సరిచేయించుకునేందుకు యజమానులు నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అంతేకాకుండా ప్రతి సమస్య పరిష్కారానికీ దరఖాస్తు చేసేటప్పుడు చార్జీలు చెల్లించాల్సి వస్తోంది.రెవెన్యూ రికార్డులను కంప్యూటర్‌లో అప్‌డేట్ చేసేటప్పుడు ప్రభుత్వం చేసిన తప్పులను వారే సరిదిద్దాలే తప్ప తామెందుకు రుసుము చెల్లించాలని యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఉన్న ఇబ్బందులకు తోడు ఈ ఫీజులతో తమపై ఆర్థిక భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరణి వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారు

కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి



గత ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారని కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి విమర్శించారు. గురువారం సచివాలయంలో కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ధరణి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిందనీ, ఆ క్రమంలోనే అధికారం చేపట్టిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి సమస్యలపై దృష్టి సారించారని తెలిపారు. రికార్డులు తప్పుల తడకగా ఉండటం వల్ల రుణాలు తీసుకోవడంతో పాటు రైతులు తమ భూములను అమ్ముకునేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన గుర్తు చేశారు. కేంద్రం భూసర్వే కోసం రూ.83 కోట్లు మంజూరు చేసినా రాష్ట్ర సర్కార్ ఎలాంటి సర్వే చేపట్టలేదని అన్నారు. పక్కనున్న ఏపీ సైతం భూసర్వే, డిజిటలైజేషన్, టైటిల్ గ్యారంటీలను చేపట్టిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు.తాము రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రైతులతో పాటు అన్ని పక్షాల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. సాధ్యమైనంత తొందరగా కమిటీ నివేదిక అందిస్తుందనీ, ఆలస్యం అయితే రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకునేందుకు వీలుగా మధ్యంతర నివేదికను అందిస్తామని వెల్లడించారు. ధరణి పోర్టల్ నిర్వహణపై కూడా సమీక్షించనున్నట్టు ఆయన తెలిపారు. కమిటీ కోసం సీసీఎల్ఏలో కార్యాలయం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెండో సమావేశం ఈ నెల 17న జరగనుందని చెప్పారు.

బిజినెస్

గూగుల్‌లో మళ్లీ ఉద్వాసనలు..

- అమెజాన్ సిబ్బందిలోనూ ఆందోళన



న్యూయార్క్ : సెర్చింజన్ దిగ్గజం గూగుల్‌లో మళ్లీ ఉద్యోగులపై వేటు పడనుంది. ఏఐ డివిజన్‌లో ఉద్యోగులను ఇంటికి పంపించడానికి కసరత్తును ప్రారంభించింది. 2023లో టెక్ కంపెనీల్లో భారీగా ఉద్యోగాలు ఊడగా .. 2024 లోనూ గూగుల్, అమెజాన్ మరోమారు వేటు వేయనుందనే రిపోర్టులు టెకీలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా అల్ఫాబెట్ యాజమాన్యంలోని ఫిట్‌బిట్ సహ వ్యవస్థాపకుడు జేమ్స్ పార్క్, ఎరిక్ ఫ్రైడ్‌మాన్ సహా వందలాది ఉద్యోగులను గూగుల్ తొలగిస్తోంది. అదే విధంగా అగ్మెంటెడ్ రియాలిటీలో కూడా వందలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించడానికి కసరత్తు ప్రారంభించింది. కంపెనీ పునర్‌వ్యవస్థీకరణ, వ్యయ నియంత్రణ వ్యూహంలో భాగంగా తొలగింపులు చేపడుతుంది. హార్డ్‌వేర్ డివిజన్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ బృందాల్లోని ఉద్యోగుల సంఖ్యలో కోత పెట్టనుంది. వాయిస్ ఆధారిత గూగుల్ అసిస్టెంట్, ఎఆర్ హార్డ్‌వేర్ టీం, కంపెనీ సెంట్రల్ ఇంజనీరింగ్ ఆర్గనైజేషన్‌లో పనిచేసే వారిపై ప్రభావం పడనుందని తెలుస్తోంది. ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లోనూ ఎంజిఎం స్టూడియో విభాగంలోని ఉద్యోగులు ఆందోళనలో పడ్డారు. ఇందులోని వందలాది మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో, ఎంజిఎం స్టూడియో విభాగం నుంచి వందల మంది ఉద్యోగులను తొలగించడానికి కసరత్తు జరుగుతోంది.

ఫిబ్రవరిలో బయోఏషియా సదస్సు

హైదరాబాద్ : ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు బయోఏషియా సదస్సు జరగనుంది. బయోఏషియా-2024 సదస్సు 21వ ఎడిషన్‌ను హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటుచేస్తున్నారు. దీనికి హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొనే ఈ సదస్సు సన్నాహాలను తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం సమీక్షించారు. బయో ఏషియా సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

మార్కెట్లలో ఒడిదుడుకులు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో గురువారం ఒడిదొడుకులు చోటు చేసుకున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పవనాలతో తొలుత సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఉదయం సెన్సెక్స్ 71,907.75 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమై.. ఓ దశలో 71,543 కనిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. మరో దశలో 71,999.47 పాయింట్ల గరిష్టానికి చేరింది. తుదకు 63.47 పాయింట్లు లాభంతో 71,721 వద్ద ముగిసింది. నిఫ్టీ 28.50 పాయింట్లు పెరిగి 21,647కు చేరింది.

2,022 స్టాక్స్ రాణించగా.. 1,251 షేర్లు ప్రతికూలతను ఎదుర్కొనగా.. మరో 63 స్టాక్స్ యథాతథంగా నమోద య్యాయి. నిఫ్టీలో హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, బీపీసీఎల్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉండగా.. ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌యుఎల్, విప్రో షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో హెచ్‌యూఎల్, విప్రో అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.7 శాతం చొప్పున పెరిగాయి.

హైకోర్టును తరలించొద్దు | హైకోర్టు పరిరక్షణ సమితి

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

హైకోర్టు తరలించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైకోర్టు పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో హైకోర్టు పరిరక్షణ సమితి ప్రతినిధులు, న్యాయవాదులు మల్లేశ్ యాదవ్, శారద గౌడ్, పొలాస శంకర్, నరేష్ తదితరుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ హైకోర్టు తరలింపు అంశం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమని అభ్యంతరం వ్యక్తం చేశారు. బార్ కౌన్సిల్ జనరల్ బాడీ మీటింగ్‌లో తరలింపునకు ఆమోదం లభించలేదని తెలిపారు. పేద న్యాయవాదులకు ఈ తరలింపుతో ఇబ్బందులున్నాయని చెప్పారు. అక్కడ జీవన వ్యయం కూడా ఎక్కువనీ, దాన్ని భరించలేరని తెలిపారు. దీనికి తోడు వ్యవసాయ విశ్వవిద్యాలయ పర్యావరణం విధ్వంసం చేయడం తగదని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని లోయర్ కోర్టుల పరిస్థితి ఏంటని? ప్రశ్నించారు. అందరితో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పరిశోధనకు అనువైన భూమిని హైకోర్టు కోసం ఉపయోగించుకోవడం తగదని హితవు పలికారు. హైకోర్టు పరిరక్షణ కోసం తరలించేందుకిచ్చిన జీవో 55ను వెనక్కి తీసుకునేంత వరకు ప్రజాస్వామ్యయుతంగా తమ పోరాటాన్ని కొనసాగించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో వ్యవసాయ విశ్వ విద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ వాసుదేవ రావు, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, బార్ కౌన్సిల్ సభ్యులు భార్గవ్, మేధావులు, ప్రొఫెసర్లు, పర్యావరణవేత్తలు, న్యాయవాదులు, విద్యార్థి, ప్రజా, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకివ్వొద్దు

55 జీవోను వెంటనే రద్దు చేయాలి

- యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట విద్యార్థుల ఆందోళన
- వరంగల్‌లోనూ నిరసన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని, 55 జీవోను వెంటనే రద్దు చేయాలంటూ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట విద్యార్థుల ఆందోలన కొనసాగుతోంది. గురువారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన హైకోర్టు భవన నిర్మాణానికి కేటాయిస్తూ 55 జీవో విడుదల చేశారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు నాలుగు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. గురువారం పరిపాలన భవనం ఎదుట వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ప్రభుత్వం కేటాయించడం దారుణమన్నారు. ఈ యూనివర్సిటీలో 300కు పైగా పక్షి జాతులు, 90కి పైగా వివిధ రకాల ఔషధ మొక్కలు ఉన్నాయని, ఇప్పుడు ఈ స్థలం హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తే వాటి ఉనికికే ప్రమాదం అన్నారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే ఈ యూనివర్సిటీ భవిష్యత్‌లో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే 55 జీవోను వెనక్కి తీసుకొని, హైకోర్టుకి మరో చోట భూమి కేటాయించాని డిమాండ్ చేశారు. జీవోను రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల నిరసనకు యూనివర్సిటీ ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

వరంగల్‌లోనూ ఆందోళన

హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన వంద ఎకరాలను రాష్ట్ర హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించడాన్ని వ్యవసాయ కళాశాల విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జీవో 55ను రద్దు చేయాలని వరంగల్ ఆరేపల్లిలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. వ్యవసాయ పరిశోధనలకు విఘాతం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. వారిద్దరి పదవీ కాలం 2027 నవంబర్ 30వ వరకు ఉంది. ప్రస్తుతం శాసనసభ్యుల బలాబలాలను బట్టి చూస్తే కాంగ్రెస్‌కు మెజార్టీ ఉంది. రెండు స్థానాలకు విడివిడిగా ఎన్నికలు జరుగుతుండటంతో అవి కాంగ్రెస్‌కే దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంతో అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించింది. ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటా, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీ ఫోకస్ పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లేటప్పటికి కొన్ని నామినేటెడ్ పదవులకు నేతలను ఎంపిక చేసే అవకాకశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం పార్టీలో పోటీ తీవ్రంగా నెలకొంది. మొత్తంగా ఆరుగురు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించాల్సి ఉన్నది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులకు మంత్రి పదవులు దక్కుతాయన్న ప్రచారంతో ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. పార్టీ సీనియర్ నేతలు జి చిన్నారెడ్డి, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి, అద్దంకిదయాకర్, బెల్లయ్యనాయక్, సంపత్‌కుమార్, పటేల్ రమేష్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్, ఫిరోజ్‌ఖాన్, వేం నరేందర్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా జరగనున్న ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించనున్నట్టు తెలిసింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు ఏదో ఒక రంగంలో సేవ చేసే వారికి ఇవ్వాల్సి ఉన్నది. అందులో టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం, విద్యావేత్త జాఫర్ జావిద్, మస్కతి, అజరుద్దీన్ తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

మంచిర్యాల మున్సిపాలిటీ 'హస్త'గతం

- అవిశ్వాస తీర్మానంలో నెగ్గిన కాంగ్రెస్



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల మున్సిపాలిటీని కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై ఇటీవల కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందించిన నేపథ్యంలో గురువారం బల నిరూపణ చేపట్టారు. కాంగ్రెస్ వైపు 27 మంది కౌన్సిలర్లు నిలిచారు. మెజారిటీ కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు ఉండటంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో మంచిర్యాల మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించుకుంది. కాగా బుధవారం చైర్మెన్ పెంట రాజయ్య పదవికి రాజీనామా చేశారు. రెండ్రోజుల కిందట వైస్ చైర్మెన్ ముఖేష్ గౌడ్ కూడా రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం అవిశ్వాసానికి మూడ్రోజుల ముందు రాజీనామా చేస్తేనే బలనిరూపణ అవసరం ఉండదు. ఒక రోజు ముందు రాజీనామా చేస్తే బల నిరూపణ అవసరం కాగా, 27 మంది కౌన్సిలర్ల క్యాంప్‌లకు వెళ్లి నేరుగా గురువారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని చైర్మెన్, వైస్ చైర్మెన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. 36 కౌన్సిల్ స్థానాలు ఉన్న మంచిర్యాలలో 26 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. చైర్మెన్‌గా 29వ వార్డు కౌన్సిలర్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మెన్‌గా 2వ వార్డు సల్ల మహేష్ ఎన్నిక లాంఛనమే. అయితే, కలెక్టర్ ఆదేశాలు వచ్చే వరకు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. గత కౌన్సిల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి 17 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరి.. బీఆర్ఎస్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు.

వరద బాధితులకు ఎక్స్‌గ్రేషియా అందించాలి

- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్




నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో 2020లో వచ్చిన వరదల్లో చిక్కుకుని మృతిచెందిన 19 మందికి సంబంధించి తక్షణమే ఆ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని సీపీఐ (ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి ఈమెయిల్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు. 2020 అక్టోబర్ నెలలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాలు, వరదలకు పలువురు మృతిచెందారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.5లక్షలు చెలిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు ఎక్స్‌గ్రేషియా అందించలేదన్నారు. బాధిత కుటుంబాలు రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం, సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పనిచేస్తూ గగన్‌పహాడ్ వద్ద వరదల్లో కొట్టుకునిపోయి మృతిచెందిన నల్లమోతు మాధవరావు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని అనేక సార్లు తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ఐదు లక్షలున్న ఎక్స్‌గ్రేషియాను రూ. నాలుగు లక్షలు తగ్గించిన ప్రభుత్వం.. బాధితులకు ఇప్పటి వరకు సహాయం చేయలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా బాధితులకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందించాలని ఎం.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

ఏసీబీకి చిక్కిన డీఎంహెచ్ఓ జూనియర్ అసిస్టెంట్

- ఫార్మసిస్టు ఉద్యోగానికి రూ.50 వేల లంచం



నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

జనగామ జిల్లా కేంద్రంలో డీఎంహెచ్ఓ జూనియర్ అసిస్టెంట్ లంచం తీసు కుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఫార్మసిస్టు నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. పట్టణానికి చెందిన స్రవంతి గతంలో జనగామ మండలం ఓబుల్ కేశపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒప్పంద ప్రాతిపదికన ఫార్మసిస్టుగా పనిచేశారు. అనంతరం రెగ్యులర్ సిబ్బంది వచ్చారని 2023 అక్టోబర్‌లో ఆమెను తొలగించారు. ఈ క్రమంలో రెగ్యులర్ పోస్టు కోసం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అజ్జర్‌కు స్రవంతి రూ.50,000 ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారి ప్రశాంత్ సమాచారంతో అధికారులు నిఘాపెట్టారు. ఇద్దరినీ అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు. ఈ దాడుల్లో అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ సాంబయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫరూక్ అబ్దుల్లాకు ఈడీ నోటీసులు

- మనీలాండరింగ్ కేసులో విచారణకు సమన్లు

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాకు నోటీసులు జారీ అయ్యాయి. ఆయనను విచారించేందుకు ఈడీ సమన్లు పంపింది. జమ్మూ అండ్ కాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ)లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ గతంలోనూ ఆయనను విచారించింది. ఈ కేసులో ఈడీ 2022లో అభియోగాలు మోపింది. కాగా, ఫరూక్ అబ్దుల్లా ప్రస్తుతం శ్రీనగర్ ఎంపీగా ఉన్నారు.

జర్మనీలో రైతులు, రైల్వే కార్మికుల నిరసల హోరు



బెర్లిన్ : జర్మనీలో రైల్వే డ్రైవర్లు పెద్ద ఎత్తున సమ్మెకు దిగటంతో దేశ వ్యాప్తంగా రవాణా వ్యవస్థ అతలాకుతలమవుతున్నది. ఇది చాలా రోజులు కొనసాగేలా ఉందని భావిస్తున్నారు. ఈ పరిస్థితి డిసెంబరు నుంచి రైతులు చేస్తున్న నిరసన ప్రదర్శనలతో మరింతగా క్షీణించింది. అక్కడ రైతులు సైతం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రోడ్లను దిగ్బంధం చేస్తూ తమ నిరసన తెలుపుతున్నారు. జీడీఎల్ కార్మిక సంఘం సమ్మె చేయటంవల్ల చాలా రైళ్లు రద్దయ్యాయని, అందువలన ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని డీబీ రైలు సంస్థ ఒక ప్రకటనలో కోరింది. ఈ సమ్మె పర్యవసానంగా 80శాతం రైలు ప్రయాణ సేవలు రద్దయ్యాయి. ఎల్లవేళలా ప్రయాణికులతో కళకళలాడే బెర్లిన్, హామ్ బర్గ్‌తో సహా జర్మన్ నగరాల్లోని రైల్వే స్టేషన్లు ప్రయాణికులులేక వెలవెలబోయాయి.

కార్మికుల న్యాయమైన కోర్కెలను డిబి కంపెనీ పట్టించుకోకపోవటం వల్లనే సమ్మెకు పిలుపునివ్వవలసి వచ్చిందని జీడీఎల్ కార్మిక సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. పని గంటలను 38 నుంచి 35కు తగ్గించాలని, ద్రవ్యోల్బణంవల్ల పరిహారంగా ఇవ్వనున్న 3000 యూరోలకు అదనంగా 555 యూరోలను ఇవ్వాలని జీడీఎల్ డిమాండ్ చేస్తోంది.

ఒకవైపు రైలు సమ్మె కొనసాగుతుండగా అక్కడి రైతాంగం వారం రోజులపాటు నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. జర్మన్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇస్తున్న డీజిల్ సబ్సిడీ, పన్ను రాయితీలను తగ్గించాలని చేసిన నిర్ణయంవల్ల తాము తీవ్రంగా నష్టపోతామని రైతాంగం భావిస్తోంది. వ్యవసాయ రంగానికి ఇస్తున్న రాయితీలను తగ్గించటానికి కారణం జర్మనీ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున నిధులను అందజేయటమే. ఉక్రెయిన్ రష్యాపైన గెలవటం కోసం పశ్చిమ దేశాలు 100ల కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను సరఫరా చేస్తున్నాయి. ఉక్రెయిన్‌కు అంత మొత్తంలో నిధులను సరఫరా చేస్తున్న దేశాల్లో అమెరికా తరువాత స్థానం జర్మనీదే. యూరోపియన్ యూనియన్ దేశాలు ఉక్రెయిన్‌కు అందిస్తున్న సహాయంలో సగ భాగం ఒక్క జర్మనీ నుంచే వస్తోందని గత వారం జర్మన్ ఆర్థిక మంత్రి క్రిస్టియన్ లిండ్ నర్ ఇటీవల వ్యాఖ్యానించారు. అలా ఉక్రెయిన్‌కు జర్మనీ చేసిన సహాయం 23బిల్లియన్ డాలర్ల దాకా ఉందని కియల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద వరల్డ్ ఎకానమీ(ఐఎఫ్‌డబ్ల్యూ) అంచనా వేసింది. పర్యవసానంగా ఆ దేశ చాన్సలర్ స్కోల్జ్ ప్రజామోదం రేటు ఘోరంగా పడిపోయింది. జర్మనీ లో 64శాతం ప్రజలు స్కోల్జ్‌ని తన పదవి నుంచి వైదొలగాలని కోరుతున్నారు.

ఎర్ర సముద్రంలో రవాణా నౌకలపై హౌతీ మిలిటెంట్ల దాడి



న్యూయార్క్ : యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్లు ఎర్ర సముద్రంలోని నౌకా మార్గాలపైన పెద్ద ఎత్తున మిసైళ్లను, డ్రోన్లను ప్రయోగించారు. ఇది చాలా సంక్లిష్టమైన దాడి అని, అయినప్పటికీ తాము తిప్పికొట్టామని అమెరికా రక్షణ మంత్రిత్వ శాఖ పెంటగన్ ప్రకటించింది. మధ్యప్రాచ్యం, మధ్య ఆసియాల్లో అమెరికా కార్యకలాపాలను నిర్వహించే యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) వివరించినట్టు మంగళవారంనాడు అనేక యాంటీ షిప్ మిసైళ్లను, డ్రోన్లను దక్షిణ ఎర్ర సముద్రంలోకి యెమెన్‌లోని హౌతీ నియంత్రిత ప్రాంతం నుంచి ప్రయోగించారు.

18 డ్రోన్లను, రెండు క్రూయిజ్ మిసైళ్లను, ఒక బాల్లిస్టిక్ మిసైల్ ను అమెరికన్ ఎఫ్-18 యుద్ధ విమానాలు, అమెరికా, బ్రిటీష్ యుద్ధ నౌకలు కూల్చివేశాయని అమెరికన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. నవంబర్ 19వ తేదీ నుంచి ఎర్ర సముద్రంలోని వాణిజ్య నౌకలపైన హౌతీ మిలిటెంట్లు 26సార్లు దాడి చేశారు.

గాజాలో పాలస్తీనా వాసులపైన ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండను ఆపేవరకు తాము ఇజ్రాయిల్ వాణిజ్య నౌకలపైన దాడులు చేస్తూనే ఉంటామని హౌతీ మిలిటెంట్లు ప్రకటించారు. ప్రపంచ వాణిజ్యంలో ఎర్ర సముద్రానికి వ్యూహాత్మక ప్రాధాన్య ముంది. ప్రపంచంలో 10శాతం చమురు ఎగుమతులు, 1ట్రిల్లియన్ డాలర్ల విలువైన సరుకులు ఇరుకైన బాబ్ ఎల్-మన్డేబ్ జలసంధి గుండా నౌకల ద్వారా రవాణా అవుతాయి. ఈ సంక్షోభం కారణంగా ప్రపంచంలోని 10అత్యంత పెద్దవైన నౌకా రవాణా కంపెనీలలో 7కంపెనీలు సూయజ్ కాలువ, ఎర్ర సముద్రం మార్గం గుండా తమ నౌకలను నడపటాన్ని నిలిపివేశాయి. ఇలా నిలిపివేయటం వల్ల నౌకా రవాణా దక్షిణ ఆఫ్రికాను చుట్టి రావటం జరుతుంది. దానితో నౌకలు గమ్యం చేరటానికి మరో వారం, పది రోజులు అదనంగా పయనించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇలా జరగటం వలన రవాణా చార్జీలు మూడు రెట్లు పెరుగుతాయి.

గాజాలోకి మానవతా సహాయాన్ని అనుమతించనంతకాలం, ఇజ్రాయిల్ గాజాపైన దాడులను ఆపనంత కాలం అమెరికా ఎంతగా బలప్రయోగం చేసినా తాము ఎర్ర సముద్రం గుండా పయనించే రవాణా నౌకల పైన దాడులను చేస్తూనే ఉంటామని హౌతీలు బహిరంగంగా ప్రకటించారు.



గుడిసెలపై అధికారుల జులుం

హనుమకొండలో అర్ధరాత్రి బుల్డోజర్లతో కూల్చివేత

- అడ్డుకోబోయిన నేతలు, పేదల ఈడ్చివేత
- కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) ధర్నా
- ఇండ్లు, స్థలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి
- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

నవతెలంగాణ-హనుమకొండ

హనుమకొండ జిల్లాలోని గోపాలపురం చెరువుశిఖంలో రెండేండ్లుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలను గత అర్ధరాత్రి (జనవరి 10) ఒంటిగంటకు 500మంది పోలీసులతో కలిసి అధికారులు చుట్టుముట్టారు. బుల్డోజర్లు, ప్రొక్లైనర్లతో గుడిసెలను కూల్చివేస్తూ పేదలను భయాభ్రాంతులకు గురిచేశారు. విధ్వంసం సృష్టించారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) నేతలు ఘటనా స్థలికి చేరుకునే ప్రయత్నం చేయగా, వారిని అడ్డుకున్నారు. అప్పటికే గుడిసెలను నేలమట్టం చేశారు. దీన్ని నిరసిస్తూ గురువారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. గుడిసెవాసులపై అధికారుల దమనకాండను ప్రతిఒక్కరూ అందరూ ఖండించాలని కోరారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో పక్కా ఇండ్లు ఇవ్వలేదన్నారు. ఇంటి స్థలం లేక వేలాదిమంది పేదలు ఎదురుచూసి.. విసిగిపోయి నగరంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. రెండేండ్ల నుంచి అక్కడే నివాసముంటున్నారని తెలిపారు.

గత ప్రభుత్వం ఆదుకోకపోవడంతో ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని చెప్పారు. ఇండ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పక్కా ఇండ్లు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీని నమ్మి ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. నెల రోజులు తిరగకుండానే గుడిసెవాసులపై దౌర్జన్యం చేయడమేంటని ప్రశ్నించారు. గోపాలపురం చెరువులో 22 ఎకరాల భూమి ఉండగా.. అందులో 12 ఎకరాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు యథేచ్ఛగా అమ్ముకున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం నిలువ నీడలేని పేదలు గుడిసెలు వేసుకొంటే ప్రతాపం చూపడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన వాగ్దానం మేరకు ఇండ్లు లేని పేదలకు స్థలం పట్టాతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన ఉండి పోరాడతామన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. అర్ధరాత్రి గుడిసెలను కూలుస్తుంటే అడ్డుకోబోయిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.ఉప్పలయ్య తదితర నాయకులను, గుడిసెవాసులను, మహిళలను ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. అనంతరం సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. గుడిసెల కూల్చివేతపై కలెక్టర్‌తో చర్చించారు. కలెక్టర్ స్పందించి.. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చుక్కయ్య, నాయకులు వాంకుడోతు వీరన్న, గొడుగు వెంకట్, జి రాములు, డి.తిరుపతి, మంద సంపత్, నోముల కిషోర్, జయశ్రీ, ఓ.సాంబయ్య, వల్లెపు రాజు, కె.కుమార్, అశోక్, యాకయ్య, వెంకటయ్య, లింగమూర్తి, మల్లయ్య, కొమురెల్లి, ఎం.రమ, ఉమ, జగన్ పాల్గొన్నారు.

మా గోస పట్టదా..!



(మొదటి పేజీ తరువాయి)

చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని సర్వేనెంబర్ 255/1, 287, 551లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టి తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం అధ్యక్షత నిర్వహించిన ధర్నాలో జి.నాగయ్య, ఎస్.వీరయ్య ప్రసంగించారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు మానుకోటలో 5000 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, అందులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 400, 500 ఎకరాల్లో పేదలకు భూములు పంచి ఇచ్చారన్నారు. మిగిలిన భూములను ఈ పదేండ్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూమాఫియాదారులు అధికారులతో కుమ్మక్కై ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ పేదలకు ఇండ్లు, స్థలాలకు పట్టాలిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కుర్చీలు సర్దుకోకముందే బీఆర్ఎస్ నాయకులు మహబూబాబాద్ పట్టణంలో అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భవనాన్ని ఆక్రమించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆలస్యమైన కొద్దీ మానుకోటలో ప్రభుత్వ భూములు మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కబ్జాలోకి పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కలెక్టరేట్ కార్యాలయం వెనుక సర్వేనెంబర్ 287/1లో ఏడాది నుంచి 3000 మంది పేదలు గుడిసెలు వేసుకుని అక్కడే నివాసం ఉంటున్నారని చెప్పారు. అధికార యంత్రాంగం మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో కుమ్మక్కై పేదలపై 18సార్లు దాడులు చేశారని చెప్పారు. పదిమంది మహిళలపై క్రిమినల్ కేసులు, 150మందిపై బైండోవర్ కేసులు పెట్టి వేధించారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మానుకోటలో కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, ఇంజినీరింగ్ కాలేజీల చుట్టూ ఉన్న భూమి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. గతంలో తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆధ్వర్యంలో పేదలు పట్టాల కోసం ధర్నా నిర్వహించారని, శంకర్‌నాయక్ వచ్చి పేదలకు భూములు పంచుతానని, పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి మోసగించాడని అన్నారు.

పేదలకు భూములు దక్కాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని తమ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించి అప్పటి మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శశాంకతో మాట్లాడారని చెప్పారు. తక్షణమే ఆ భూముల సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు, ఇండ్లు ఇవ్వాలని, సంక్రాంతి పండుగ తర్వాత పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించినట్టు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రస్తుత కలెక్టర్ ఆ భూమిలో సర్వే చేసి పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

భూ పోరాటంలో పేదలపై పోలీసులు పెట్టిన కేసులన్నింటినీ ఎత్తేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే ఆ దిశగా పోలీసు యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కలెక్టరేట్ వెనుక పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని అటవీ శాఖకు కేటాయించినట్టు కలెక్టర్ చెబుతున్నారని, ఆ భూమి ప్రభుత్వ భూమి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సుర్లపు సోమయ్య, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి, కుర్ర మహేష్, దుడ్డుల రామ్మూర్తి, కుంట ఉపేందర్, నక్క సైదులు, చీపిరి యాకయ్య రావుల రాజు, చాగంటి భాగ్యమ్మ, కుమ్మరి కుంట నాగన్న, తోట శ్రీనివాసు, ఎర్ర శ్రీనివాస్, బానోతు వెంకన్న, బూర్గుల లక్ష్మణ, యమగాని వెంకన్న, శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.

ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తేవాలి

ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి టీఎన్జీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వాటి ప్రతులను ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాల్లోనూ అందజేశారు.

ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలంటూ రామకృష్ణారావు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారనీ, త్వరలో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు,



హైదరాబాద్ సిటీ అధ్యక్షులు కె శ్రీకాంత్, కార్యదర్శి పి హరికృష్ణ, ఉపాధ్యక్షులు మహేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లాక్కున్న పోడు భూములను తిరిగివ్వాలి

సీపీఐ(ఎం) కార్యాలయంపై దాడి చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- రైతులపై పెట్టిన కేసులను ఎత్తేయాలి: సీపీఐ(ఎం) జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి ఎర్రా శ్రీకాంత్



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం జిల్లా మాణిక్యారం ఎర్రబోడు రైతుల నుంచి బలవంతంగా లాక్కున్న పోడు భూములను తిరిగి వారికి ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి ఎర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) కార్యాలయంపై దాడి చేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఖమ్మం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రంతో కలిసి శ్రీకాంత్ మాట్లాడారు. కారేపల్లి మండలం మాణిక్యారం, ఎర్రబోడు గ్రామాల గిరిజన పేద రైతులు ఏడు దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. కానీ, 2020లో హరితహారం పేరుతో అటవీశాఖ అధికారులు దాదాపు 200 ఎకరాలను బలవంతంగా తీసుకున్నారన్నారు. ప్రత్యామ్నాయంగా మరోచోట భూములు చూపుతామని మభ్యపెట్టి.. తిరిగి గిరిజన పోడు రైతులపైనే అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలోనే స్థానిక మండల అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు అటవీశాఖ అధికారులతో మూడు దఫాలుగా చర్చలు జరిపారన్నారు. ఆ భూములు గతం నుంచి పోడు రైతుల సాగులోనే ఉన్నాయని కలెక్టర్‌కు రిపోర్టు పంపించారని గుర్తు చేశారు. "మా భూములు మాకే ఇవ్వాలని.. భూమిపై హక్కులు కల్పించాలని" అనేకసార్లు ఆందోళనలు, పోరాటాలు చేశారని చెప్పారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్సీ గ్రామసభలో పోడు రైతుల దరఖాస్తుల స్వీకరించి ఆమోదించిందని తెలిపారు. భూములను సాగు చేసుకుంటే.. అటవీ శాఖ అధికారులు అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. సీపీఐ(ఎం) బృందం కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారిని కలిసి కేసులు లేకుండా చూడాలని కోరామని, అరెస్టులు అవసరం లేదని అధికారి చెప్పినా ఎఫ్ఆర్ఓ అతి ఉత్సాహం ప్రదర్శించారన్నారు. నాయకులను ఫారెస్ట్ కార్యాలయంలో ఉంచి.. తన సిబ్బందితో వెళ్లి సీపీఐ(ఎం) కారేపల్లి కార్యాలయంపై దాడి చేయడం సరికాదన్నారు. అలాంటి అధికారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి మాణిక్యారం, ఎర్రబోడు భూ సమస్యను పరిష్కరించి పోడు రైతులకు న్యాయం చేయాలని కోరారు. మళ్లీ పోడు రైతుల జోలికి వస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మాచర్ల భారతి, బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు ఉన్నారు.

ప్రజా ప్రణాళికలతో అభివృద్ధిలో కేరళ

కేరళ కర్షక తుల్లాలి(వ్యవసాయ కార్మిక సేన) సభలో బి.వెంకట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజల అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం కేరళ వామపక్ష ప్రభుత్వం పనిచేస్తుంటే, దేశంలో మతోన్మాదం పెంచి, కార్పొరేట్ వర్గాలకు ఉపయోగపడేలా దేశాన్ని అస్థిత్వ పరిచేలా మోడీ పని చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అందిస్తూ ప్రతిరోజు రూ.800 - 900 వేతనాలు ఇచ్చే కృషిని కేరళలో ప్రజా ప్రభుత్వం చేస్తున్నదని, వ్యవసాయ కార్మికులకు, రైతులకు, ఇతర పనుల వారికి ఉపయోగ పడేలా "(కర్షక తుల్లాలి)" వ్యవసాయకార్మిక, కర్షక "సేన" ను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేక యూనిఫాంతో ఈ సేన ఉంటుందన్నారు. లక్షలాది మంది సభ్యులుగా ఉన్నారని అన్నారు. కేరళలోని పాలక్కడ్‌లో కార్మిక, కర్షక సేన సభకు ముఖ్య అతిథిగా హాజరైన బి.వెంకట్ మాట్లడుతూ గతంలో గ్రామీణాభివృద్ధి కోసం సహకార వ్యవస్థను ఏర్పాటుచేసిన కేరళ ప్రభుత్వం, నేడు వ్యవసాయ కార్మికుల కోసం వారి వేతనాల కోసం కార్మికులు, కర్షకులు మధ్య వారధిగా నిలిచేందుకు కర్షక తుల్లాలి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కేరళ ప్రజా ప్రణాళికలు రూపొందించుకొని, ప్రజల



సంక్షేమం, అభివృద్ధి కోసం, మత సామరస్యంతో దూసుకుపోతుంటే, దేశంలో మోడీ ప్రభుత్వం మత విభజన, మతోన్మాదం, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగం అమ్మకంతో దేశాన్ని, ప్రజలను అస్థిత్వ పరిచే కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. అందుకే వ్యవసాయ కార్మిక సంఘం కేరళ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి నెలంతా తమ ప్రభుత్వాన్ని తాము కాపాడుకుంటామంటూ క్షేత్ర స్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రతి కుటుంబాన్ని కలిసి వామపక్ష ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని నిర్ణయించిందన్నారు. కార్మిక కర్షక మైత్రితో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం జరుగుతుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమ
- సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-మియాపూర్

మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి(హైదరాబాద్) ఆధ్వర్యంలో ముగ్గులు, మ్యూజికల్ చైర్ ఆటల పోటీలు నిర్వహించారు. పి.మంజుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమ మాట్లాడారు. మహిళలు ప్రతి రంగంలోనూ రాణించాలని సూచించారు. మహిళ అంటే ఆదిశక్తి అని, వంటింటి కుందేలుగా ఉండొద్దని అన్నారు. పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా లేకుండా అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంస్కృతి గొప్పతనమన్నారు. సాంఘిక కార్యకర్త ఎ.రాణి మాట్లాడుతూ.. ఎస్‌వీకే ఇలాంటి కార్యక్రమం నిర్వహిచడం.. మహిళలను ప్రోత్సహిచడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు ఎం.సుజాత, 80 మంది మహిళలు పాల్గొన్నారు.

రామా కనవేమిరా..!

(మొదటి పేజీ తరువాయి)



చెప్పారు. ఏమైతేనేం ? మందిరం-మసీదు వివాదం ముగిసింది. ఇన్ని రోజులూ మతపరమైన ఉద్రిక్తతలు, కర్ఫ్యూలు, పోలీసుల పహారాల నడుమ బతుకులు భారంగా గడిపిన నగరవాసులు ఇప్పుడు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇది నాణానికి ఓ వైపు కన్పిస్తున్న దృశ్యం మాత్రమే. మరి రెండో వైపు...రోడ్ల విస్తరణ పేరుతో అనేక మంది ఇండ్లను పూర్తిగానో లేదా పాక్షికంగానో కూల్చేశారు. దీంతో వారు జీవనోపాధి కోల్పోయి వీధిన పడ్డారు. ఉదాహరణకు ఫైజాబాద్‌లోని షహదత్‌గంజ్‌ని నయా ఘాట్‌తో కలపడానికి 13 కిలోమీటర్ల రోడ్డును వెడల్పు చేశారు. ఈ క్రమంలో అనేక పురాతన దేవాలయాలు, మసీదులు సహా నాలుగు వేలకు పైగా నివాస, వాణిజ్య నిర్మాణాలు ధ్వంసమయ్యాయి.

నామమాత్రపు నష్టపరిహారంతో సరి

నగరంలో జరిగిన అభివృద్ధిపై కొందరు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ఓ కలగా ఉన్నదని అంటూనే జరిగిన విధ్వంసాన్ని కూడా కాదనలేమని చెప్పారు. నివాస గృహాలు కోల్పోయిన వారికి అధికారులు నామమాత్రంగా నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు. ఇచ్చిన ఆ కొద్దిపాటి సొమ్ము ఇంటి పునర్నిర్మాణానికి ఏ మూలకు చాలలేదు. రోడ్ల విస్తరణ ప్రాజెక్టు కోసం చిన్న చిన్న దుకాణాలను తొలగించారు. దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. స్థానికుల ప్రయోజనాలు, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఓ ప్రణాళిక ప్రకారం పనులు చేసి ఉంటే బాగుండేదని, దానికి బదులు తమను వేధించి బెదిరించారని, ఇండ్లను కూల్చేసి చాలీచాలని సొమ్ము చేతిలో పెట్టారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యాటకుల కోసమేనా అభివృద్ధి?

2019కి ముందు అయోధ్య వ్యాపారులు ఎక్కువగా పరిసర ప్రాంతాల నుండి వచ్చే యాత్రికుల పైనే ఆధారపడే వారు. ముఖ్యమైన పండుగలు, ఆధ్యాత్మిక వేడుకలు వచ్చినప్పుడు మాత్రమే అయోధ్య భక్తులతో కళకళలాడుతుండేది. వారు పెట్టే ఖర్చు కూడా పరిమితంగానే ఉండేది. ఉచిత సత్రాలలో బస చేస్తూ, ప్రసాదాలతో కడుపు నింపుకునే వారు. 2019 తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సుప్రీంకోర్టు తీర్పుతో ఆలయ నిర్మాణానికి అవరోధాలు తొలగిపోవడంతో అయోధ్యలో మార్పులు కొట్టొచ్చినట్లు కన్పించాయి. భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం వేగవంతంగా వృద్ధి చెందింది. పెద్ద పెద్ద హోటళ్లు వెలిశాయి. యాత్రికుల రద్దీ పెరగడంతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. రాబోయే కాలంలో రోజుకు మూడు లక్షల మంది పర్యాటకులు అయోధ్యకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ సంఖ్య నగర జనాభా కంటే ఎక్కువే. పర్యాటకుల అవసరాలు తీర్చేందుకు నగరంలో మౌలిక సదుపాయాలను వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నారు. అయితే ఇదంతా పర్యాటకుల కోసమే. రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా ఇళ్లు, జీవనోపాధి కోల్పోయిన స్థానికుల కోసం చర్యలు తీసుకుంటున్న దాఖలాలు మాత్రం కన్పించడం లేదు. ఆలయానికి సమీపంలో ఉన్న పూజా సామగ్రి దుకాణాలను తొలగించి కిలోమీటరు దూరంలో ఏర్పాటు చేసిన నూతన వాణిజ్య సముదాయానికి తరలించారు. అయితే అంతదూరం వచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పైగా దుకాణాల లీజుకు లక్షల్లో రేటు నిర్ణయించారు. దీంతో కొందరు వ్యాపారాలు మూసేసుకోవాల్సి వచ్చింది.

రోడ్ల విస్తరణ, భారీ విగ్రహాలు, సుందరీకరణ...ఇవేవీ స్థానికులు కోరుకుంటున్నవి కావు. ఈ పనులన్నీ పర్యాటకులు, సందర్శకుల ప్రయోజనాల కోసం చేస్తున్నవే. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరంలోని కొన్ని ప్రాంతాలకు నెలల తరబడి మంచినీటి సరఫరా జరగడం లేదు. నగరంలో నిపుణులైన వైద్యుల కొరత అధికంగా ఉంది. బైపాస్ వంటి శస్త్రచికిత్సల కోసం రాజధాని లక్నోకు వెళ్లాల్సి వస్తోంది.

గొంతు విప్పలేక...

ఇండ్ల కూల్చివేతలను నిరసిస్తూ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఓ నాయకుడు ఆందోళన నిర్వహిస్తే ఆయన ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దుకాణం నుంచి బలవంతంగా సామాను తీసుకొని వెళ్లిపోయారు. ప్రజల్లో ఆవేదన ఉన్నప్పటికీ బహిరంగంగా గొంతు విప్పేందుకు ఎవరూ సాహసించడం లేదు. అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న కారణంతో కేసులు పెడతారని, తమ ఇంటి పైకి బుల్‌డోజర్లను పంపుతారని వారు భయపడ్డారు.

భయం గుప్పెట్లో మైనారిటీలు

అయోధ్యలో నివసిస్తున్న ముస్లింలు క్షణమొక యుగంగా ప్రాణాలు అరచేత పట్టుకొని జీవిస్తున్నారు. వారిలో మసీదు కూల్చివేత మిగిల్చిన గాయాలు ఇప్పటికీ మానలేదు. 1992 నాటి భయానక ఘటనలు పునరావృతమవుతాయేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే రాబోయే రోజులలో హిందువులు లక్షలాదిగా అయోధ్యకు తరలివస్తారు. వారిలో ఎవరైనా మతోన్మాదులు ఉంటే పరిస్థితి ఏమిటి? ఊహించుకోవడానికే భయమేస్తోందని మైనారిటీలు తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం జరిగిన విధ్వంసకాండలో అనేక మంది ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. మైనారిటీల నివాస గృహాలు, ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఎలాగో కోలుకొని ఇండ్లను తిరిగి నిర్మించుకున్నామని, జీవితాలు గాడిలో పడ్డాయని అనుకుంటుంటే ఇప్పుడు మరోసారి నగర సుందరీకరణ పేరిట తమ ఆస్తులను ధ్వంసం చేశారని మైనారిటీలు వాపోయారు. పైగా అయోధ్యలో మైనారిటీల దుకాణాలు పరిమిత సంఖ్యలో ఉన్నాయి. వారి వ్యాపారాలు కూడా అంతంత మాత్రమే. ఉద్రిక్తతలను నివారిండానికి అనేక మంది ముస్లింలు హిందూ సమూహంతో రాజీ పడి జీవిస్తున్నారు. అయితే కొందరు హిందూ ఛాందసవాదులు మాత్రం మైనారిటీలే లక్ష్యంగా అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు ల్యాండ్ మాఫియా ఆగడాలు మితిమీరాయి. మైనారిటీల ఆస్తులను సొంతం చేసుకునేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోంది.

సంపాదకీయం

మనకు దూరంగా మాల్దీవులు!

మాల్దీవులు ప్రపంచంలోని అతి చిన్న దేశాలలో ఒకటే కావచ్చు. కానీ అది ఉన్న ప్రాంతం కీలకమైనదిగా మారడంతో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. మన దేశంలో అది పెద్ద చర్చనీయాంశంగా మారిందంటే గతంలో దానికి ప్రాముఖ్యతలేదని, ఇప్పుడే కొత్తగా వచ్చిందని కాదు. మన దేశాన్ని, ప్రధాని నరేంద్రమోడీని అవమానించినందుకుగాను దానికి తగిన బుద్ధి చెప్పాలని, అందుకు మన విహారయాత్రీకులు అక్కడికి వెళ్లటం మానుకోవాలని పిలుపునిస్తున్నారు. ఒక విమానయాన సంస్థ ఇప్పటికే నిరవధికంగా విమాన ప్రయాణాలను నిలిపివేసినట్లు ప్రకటించింది, హోటల్ బుకింగులను కూడా మన వారు రద్దు చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. కొందరు క్రీడాకారులు, సినీతారలు కూడా స్పందించారు. గరిష్టంగా విహార యాత్రీకులను పంపుతున్న మన దేశాన్ని, ప్రధానిని కూడా అలా కించపరుస్తారా అని మండిపడ్డారు. ఇంత చేస్తే మౌనంగా ఉండాలా

రద్దీగా ఉండే తూర్పు-పశ్చిమ దేశాల నౌకా రవాణా మార్గంలో మాల్దీవులు కీలకమైన ప్రాంతంలో ఉంది. అమెరికా విశాల మిలిటరీ వ్యూహంలో హిందూ మహాసముద్రం ఎంతో ముఖ్యమైనది. బంగాళాఖాతం,హిందూ మహాసముద్రం, అరేబియా సముద్ర ప్రాంతంలోని కొన్ని దేశాలు అమెరికా పట్టునుంచి విడివడటం, అవి క్రమంగా చైనాకు సన్నిహితం కావటం పశ్చిమ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఆ వరుసలో మాల్దీవులు కూడా చేరితే ఏమిటన్నదే వారి ఆందోళన.

అన్నది సహజంగానే తలెత్తే ప్రశ్న. ఇంతకూ చేసిన విమర్శలేమిటి ?

మల్షా షరీఫ్, మరియం షిహునా, అబ్దుల్లా మఝూన్ మజీద్ అనే ముగ్గురు ఉప మంత్రులను అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు సస్పెండ్ చేశారు. మోడీని వారు హాస్యగాడు, ఉగ్రవాది, ఇజ్రాయిల్ తొత్తు అని పేర్కొన్నారు. మన దేశానికి చెందిన లక్షద్వీప్‌లో విహార యాత్రలను ప్రోత్సహించేందుకు గాను మోడీ ఒక బీచ్‌లో కూర్చున్న వీడియోను పోస్టు చేసిన తరువాత ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.తమ దేశా నికి యాత్రీకులు రాకుండా చేసేందుకే ఇలా చేశారని అక్కడి కొందరు భావించారు. ప్రధానిని కించపరచటం గురించి మాలేలోని మన రాయబారి అక్కడి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. మాల్దీవుల ప్రతిపక్ష నేతలు అధ్యక్షుడి మీద అవిశ్వాస తీర్మానం పెడతామనేవరకు వెళ్లారు. సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలను తాము గమనించామని, అవి వారి వ్యక్తిగతం తప్ప ప్రభుత్వ వైఖరి కాదని అక్కడి ప్రభుత్వం ఒక ప్రకటన కూడా చేసింది. జరిగిన దాని మీద అధ్యక్షుడు ముయిజ్జు విచారణకు ఆదేశించారని రాయిటర్స్ పేర్కొన్నది. సామాజిక మాధ్యమాల్లో ఒక దేశం, దాని నేతల గురించి మరొకదేశంలో పౌరులు ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానించటం తెలిసిందే. మా ల్దీవుల పౌరులు ఎవరైనా అలా చేసి ఉంటే అసలు



సమస్యే తలెత్తేది కాదు, మంత్రులు గనుక రచ్చ జరిగింది. అనుచిత వ్యాఖ్యలను ఖండించాల్సిందే.

లడక్ సరిహద్దు ఘర్షణల తరువాత చైనా వస్తువులను బహిష్కరించాలని, అక్కడి నుంచి దిగుమతులు నిలిపివేస్తే డ్రాగన్ దేశం మన కాళ్లదగ్గరకు వస్తుందంటూ సామాజిక మాధ్యమాలన్నింటా విపరీతంగా ప్రచారం జరిగింది. అది అధికారిక వైఖరి కాకపోవటంతో ఎలాంటి సమస్యా తలెత్తలేదు. అలాంటి పోస్టు పెట్టిన వారిని ఖాతరు చేయకుండా నరేంద్ర మోడీ సర్కార్ రికార్డులను బద్దలుకొడుతూ దిగుమతులు చేసుకుంటున్నది, రూ.వందల కోట్ల మేర విదేశీ మారక ద్రవ్యాన్ని చైనాకు చెల్లిస్తున్నది. రామాయణంలో ఉడత సాయం గురించి చెప్పుకొనే మనం ఒక చిన్న దేశం, అదీ మన విదేశీ పర్యాటకులు చెల్లించే సొమ్ము మీద ఆధార పడుతున్న దేశం మన మాట వినదా అనే దురహంకారానికి లోనైతే ప్రయోజనం లేదు.అక్కడికి వచ్చే యాత్రీకుల్లో ప్రస్తుతం మన వాటా పదకొండు శాతమే. ఉడత రాముడికి సాయం చేస్తే మరోవైపు రావణుడికి హాని చేసినట్లే. అలాంటి పరిస్థితిని తెచ్చుకోవద్దని చెప్పాల్సి వస్తోంది. మాల్దీవుల్లో ఎవరు అధికారానికి వచ్చినా గతంలో తొలి విదేశీ పర్యటన భారత్‌తోనే ప్రారంభమయ్యేది. అలాంటిది ముయిజ్జు తొలుత టర్కీ, తరువాత యుఏయి, ఈ నెల 8 నుంచి 12వరకు చైనాలో పర్యటించారు. బహుశా ఈ పరి ణామం మన కేంద్ర ప్రభుత్వానికి అవమానకరంగా తోచిందా?

రద్దీగా ఉండే తూర్పు-పశ్చిమ దేశాల నౌకా రవాణా మార్గంలో మాల్దీవులు కీలకమైన ప్రాంతంలో ఉంది. అమెరికా విశాల మిలిటరీ వ్యూహంలో హిందూ మహాసముద్రం ఎంతో ముఖ్యమైనది. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం, అరేబియా సముద్ర ప్రాంతంలోని కొన్ని దేశాలు అమెరికా పట్టునుంచి విడివడటం, అవి క్రమంగా చైనాకు సన్నిహితం కావటం పశ్చిమ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఆ వరుసలో మాల్దీవులు కూడా చేరితే ఏమిటన్నదే వారి ఆందోళన. 2019లో మనదేశంతో కుదుర్చుకున్న జలవాతావరణ(హైడ్రాలజీ) పరిశీలన పథకం నుంచి తాము వైదొలుగుతున్న మాల్దీవుల అధికారులు 2023 డిసెంబరు 14న తెలిపారు.తమ విదేశాంగ విధానంలో వచ్చిన మార్పు తప్ప చైనాకు దగ్గరవుతున్నందున ఈ నిర్ణయం తీసుకోలేదని అన్నారు. అక్కడ ఉన్న కొద్దిమంది మన సైనికులు కూడా వెనక్కు వెళ్లిపోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో హిందూ మహాసముద్రంలో అట్టడుగు జలాల్లో పరిశోధనలు చేసేందుకు తమ యువాన్ వాంగ్ నౌక లంగరు వేసేందుకు అనుమతించాలని మాల్దీవులను కోరటం గమనించాల్సిన అంశం. మాల్దీవుల మొగ్గు ఎటువైపు అన్నది ఆసక్తికరంగా మారింది.

తెలుగు సాహిత్యంలో తొలి మానవవాది 'కవిరాజు'

మల మల మాడుపొట్ట, తెగ మాసిన బట్ట
కలంత పెట్టగా విలవిల ఏడ్చుచున్న నిరుపేదకు జాలిని
జూపకుండా నుత్తల పడిపోయి, జీవ రహితంబగు బొమ్మకు
నిండ్లు, వాకిళల్ పొలమును బొట్ర నిచ్చెడి ప్రబుద్ధుల
నిచ్చమెచ్చెదన్.

తిండి, గుడ్డ, నీడ లేని నిరుపేదలను అశ్రద్ధ చేసి, జీవం లేని బొమ్మలకు ఇళ్లు, వాకిళ్లు, పొలమూ, పుట్రా సమకూర్చి, పెండ్లీ, గిండ్లీ చేసే ప్రబుద్ధులను కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి (15 జనవరి 1887-16 జనవరి 1943) తీవ్రంగా నిరసించారు. తమిళులకు పెరియార్ రామసామి నాయకర్ ఉన్నట్టే, మన తెలుగువారికీ ఒక రామస్వామి ఉన్నారు. ఆయన నాయకర్‌ను వదిలేసినట్టే, ఈయన చౌదరిని వదిలేశారు. ఇద్దరూ ఉన్నత శ్రేణి హేతువాదులు. మానవీయ విలువల్ని నిలుపడానికి ఈ ఇద్దరూ జీవితాంతం కృషి చేశారు. త్రిపురనేని రామస్వామి జయంతి, వర్ధంతులు ప్రతి సంవత్సరం ఒక్కరోజు తేడాతో వస్తాయి. ఆయనను స్మరించుకుని, ఆయన ఆశయాల్ని నిలబెట్టడానికి మనం నిరంతరం కృషి చేయాలి. మన ముందు తరాల వారిని అందుకు సిద్ధం చేయాలి!



డాక్టర్ దేవరాజు మహారాజు

తెలుగు సాహిత్య రంగంలో కవిరాజుది, ఆయన కుమారుడైన గోపీచంద్‌ది గణనీయమైన స్థానం. 1987లో కవిరాజు శత జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం తపాల బిళ్ల విడుదల చేయగా 24 ఏండ్ల తరువాత ఆయన కుమారుడు గోపీచంద్ శతజయంతి సందర్భంగా 2011లో మరో తపాలా బిళ్ల విడుదల చేసింది. భారత ప్రభుత్వం ఇలా ఉన్నత శ్రేణి రచయితలైన తండ్రీ కొడుకుల స్మృతిలో తపాలాబిళ్లలు విడుదల చేయడం చాలా అరుదైన విషయం. ఈ తండ్రీ కొడుకులిద్దరూ హేతువాదులే! హైదరాబాద్ టాంక్‌బండ్ మీదున్న తెలుగు వెలుగుల విగ్రహాలలో కవిరాజు రామస్వామి విగ్రహమూ ఉంది. నేటి యువతీ యువకులు అటు వెళ్లినప్పుడు తప్పకుండా,చూడాలి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం త్రిపురనేని రామస్వామి స్మారకార్థం ప్రతి ఏటా ఒక పురస్కారం అందిస్తోంది.

ఒకరుడు 'వేదమే' భగవదుక్తమటంచు నుపన్యసించు
నింకొకరుడు 'బైబిలే' భగవదుక్తమటంచును వక్కణించు
వేరొకండు మా 'ఖొరాన్' భగవదుక్తమటంచును వాదులాడు,
నీ తికమకలేల పెట్టెదవు తెల్పగ రాదె నిజంబు నీశ్వరా!


నిజము తెల్పుమని ఇక్కడ ఈశ్వరుణ్ణి కవి అడుగుతున్నాడంటే - ఆయన ఉనికిని గుర్తిస్తున్నట్టు కాదు. ఇది ఒక వ్యంగ్య వ్యాఖ్య. లేని దేవుణ్ణి జనం మీద రుద్ది ఏ మహిమా లేని పవిత్ర గ్రంథాల ప్రసక్తి తెచ్చి పబ్బం గడుపుకుంటున్న వారిని హేళన చేయడం ఇందులో ఉంది. ఇతర రంగాలలో ప్రముఖులయినా సరే, కొందరు దేవుడి విషయానికి వచ్చే సరికి గోడ మీది పిల్లి వాటంగా వ్యవహరిస్తుంటారు. అలాంటి చర్యకు రామస్వామి స్వస్తి చెప్పారు. ధైర్యంగా తన హేతువాద దృక్పథాన్ని తన జీవితంలో పాటించి చూపారు. అదే, తన సాహిత్యంలోనూ నమోదు చేశారు. అందుకే తెలుగు సమాజానికి ఓ సూత పురాణం, ఓ శంభుక వధ, ఓ ఖూనీ, ఓ ధూర్త మానవా శతకం, కొన్ని సూతాశ్రమ గీతాలు. దక్కాయి. ఈ పుస్తకాల్ని నేటి యువతీ యువకులు వెతుక్కుని చదవాలి. వాటి స్ఫూర్తితో సమకాలీన సమాజాన్ని హేతువాత, మానవవాద ఆలోచనా ధోరణిలోకి నడిపించాలి.

త్రిపురనేని రామస్వామి 15 జనవరి 1887న కృష్ణా జిల్లా అంగలూరు గ్రామంలో ఒక సంపన్న రైతు కుటుంబంలో పుట్టారు. తల్లిదండ్రులు రామమాంబ - చలమయ్య అప్పట్లో బాల్య వివాహాలు జరిగేవి కాబట్టి 1898లో పున్నమ్మ అనే బాలికతో పెద్దలు వివాహం జరిపించారు. అప్పటికి ఆయన వయసు పదకొండు. 1910లో ఆయనకు 23 యేట కుమారుడు గోపీచంద్ పుట్టాడు. మరోవైపు ఆయన మెట్రిక్యులేషన్ కూడా పాసయ్యాడు. ఆ రోజుల్లో చదువులు అలా ఆలస్యంగానే జరిగేవి. మెట్రిక్ తర్వాత అదే 23వ యేట యవ్వన దశలో ఎన్నో రచనలు సమాజం మీదికి సంధించారు. పల్నాటి యుద్ధం ఆధారంగా 'కారెంపూడి కదనం' రాశారు. మహాభారత యుద్ధం ఆధారంగా 'కురుక్షేత్ర సంగ్రామం' రాశారు. అయితే, చిత్రమేమంటే ఈ రచనలో ఆయన పాండవులకు రాజ్యాధికారం లేదని నిరూపించి ఒప్పించారు. కారెంపూడి కదనం. కురుక్షేత్ర సంగ్రామం రెండూ నాటికలే -

ఇక కవిరాజు ఇతర రచనలు :

పల్నాటి పౌరుషం, గోపాలరాయ శతకం, కొండవీటి పతనం, రాణా ప్రతాప్, భగవద్గీత - మొదలైనవి. భగవద్గీత రచన భగవద్గీతను సమర్థిస్తూ రాసింది కాదు. విమర్శిస్తూ వెలువరించిన ఒక వ్యంగ్యరచన. అలాగే, రాణా ప్రతాప్ రచన విషయంలో ఒక విచిత్రం జరిగింది. అది అచ్చులో ఉండగానే అందులోని విషయం ఎలా బయటికి చేరిందో, అది నాటి ప్రభుత్వ దృష్టికి ఎలా వెళ్లిందో తెలియదు. కానీ, ఆ రచన అచ్చవుతూ ఉండగా ప్రెస్‌లోనే నాటి బ్రిటీష్ ప్రభుత్వ నిషేధానికి గురైంది. 1911లో బందరు నోబెల్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. అప్పుడే చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి శిష్యరికం చేసి మొదట అష్టావధానం,

1914లో ఐర్లాండ్‌లోని డబ్లిన్ యూనివర్సిటీకి వెళ్ళి అక్కడ న్యాయశాస్త్రం చదివారు. దానితో పాటు ఆంగ్ల సాహిత్యాన్నీ చదివారు. అయితే అక్కడ కూడా ఆయన పంచె కట్టుతోనే గడిపేవారు. 'ఏ దేశంలో ఉంటే ఆ దుస్తులే వేసుకోవాలిగానీ ఇదేమిటని' - అక్కడ ఒక బ్రిటీష్ మహిళ హేళన చేసింది. అయితే ఆయన ఖాతరు చేయలేదు. తన తెలుగుతనాన్ని, పంచెనూ వదలుకోలేదు, ఇక్కడ చెప్పుకోవాల్సిన విషమేమంటే, ఆయన డబ్లిన్‌లో ఉన్నా - ఆయన మనసు ఇక్కడ తెలుగు నేల మీదే ఉండేది. డబ్లిన్ నుంచి ఇక్కడి కృష్ణా పత్రికకు వ్యాసాలు రాసేవాడు. అంతే కాదు 'శంభుక వధ' అనే ప్రసిద్ధ రచన ఆయన డబ్లిన్‌లో ఉండగా రాసిందే! అనిబిసెంట్ చేస్తున్న హోంరూల్ ఉద్యమానికి మద్దతుగా రాశారు. మద్దతివ్వండని ఇక్కడి ప్రజల్ని ప్రోత్సహించారు. అక్కడి నుండే ఎన్నో దేశభక్తి గీతాలు అందించారు. ఆ రకంగా హేతువాదం, మానవవాదం తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టినవాడిగా కవిరాజు త్రిపురనేనికి గుర్తింపు వచ్చింది.



తర్వాత శతావధానం చేయగలిగారు. ఆ వయసులో అంతటి ధారణా శక్తిని, సాహిత్యం మీద సాధికారతను సాధించడం మామూలు విషయం కాదు. అయితే చదువు పూర్తి చేసి ఏదో వృత్తిలో స్థిరపడాల్సి ఉంది గనుక, అవధానాలు మానేసి న్యాయ శాస్త్రం చదవడానికి 1913లో బొంబాయి వెళ్లారు. ఏదో కారణం వల్ల వెంటనే తిరిగొచ్చారు.

1914లో ఐర్లాండ్‌లోని డబ్లిన్ యూనివర్సిటీకి వెళ్ళి అక్కడ న్యాయశాస్త్రం చదివారు. దానితో పాటు ఆంగ్ల సాహిత్యాన్నీ చదివారు. అయితే అక్కడ కూడా ఆయన పంచె కట్టుతోనే గడిపేవారు. 'ఏ దేశంలో ఉంటే ఆ దుస్తులే వేసుకోవాలిగానీ ఇదేమిటని' - అక్కడ ఒక బ్రిటీష్ మహిళ హేళన చేసింది. అయితే ఆయన ఖాతరు చేయలేదు. తన తెలుగుతనాన్ని, పంచెనూ వదలుకోలేదు, ఇక్కడ చెప్పుకోవాల్సిన విషమేమంటే, ఆయన డబ్లిన్‌లో ఉన్నా - ఆయన మనసు ఇక్కడ తెలుగు నేల మీదే ఉండేది. డబ్లిన్ నుంచి ఇక్కడి కృష్ణా పత్రికకు వ్యాసాలు రాసేవాడు. అంతే కాదు 'శంభుక వధ' అనే ప్రసిద్ధ రచన ఆయన డబ్లిన్‌లో ఉండగా రాసిందే! అనిబిసెంట్ చేస్తున్న హోంరూల్ ఉద్యమానికి మద్దతుగా రాశారు. మద్దతివ్వండని ఇక్కడి ప్రజల్ని ప్రోత్సహించారు. అక్కడి నుండే ఎన్నో దేశభక్తి గీతాలు అందించారు. ఆ రకంగా హేతువాదం, మానవవాదం తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టినవాడిగా కవిరాజు త్రిపురనేనికి గుర్తింపు వచ్చింది.

డబ్లిన్ నుంచి తిరిగి వచ్చి త్రిపురనేని 1917లో తొలుత మచిలీపట్నంలో న్యాయవాదిగా నాలుగైదేళ్లు ప్రాక్టీసు చేశారు. 1922లో అక్కడి నుండి తెనాలికి మారి, న్యాయవాదిగా అక్కడ స్థిరపడ్డారు. వృత్తితో పాటు, సామాజిక అన్యాయాల్ని, మత అరాచకాల్ని ఎదిరించే తన ప్రవృత్తిని మేల్కొల్పారు. రాజరామ్మోహన్ రాయ్, రానడే కందుకూరి, గురజాడ వంటి వారి ఆదర్శాల్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేవారు. ఇలాంటి సంఘ సంస్కరణ కార్యక్రమాల వల్ల ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. ఫలితంగా 1925లో తెనాలి పురపాలక సంఘానికి జస్టిస్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. అయితే ఆయన సంస్కరణ వాదం ఆయన పదవికి ముప్పు తెచ్చింది. పురపాలక సంఘ అధ్యక్షునిగా జంతు బలుల్ని నిషేధిస్తే - అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయనను పదవి నుండి దింపేశారు. త్రిపురనేని వారు కంగారు పడలేదు. ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో మళ్లీ ఘన విజయం సాధించి పదవి చేజిక్కించుకున్నారు. జంతు బలుల్ని నిషేధించారు. అంతే-ప్రత్యర్థులు దిక్కుతోచక తోక ముడిచారు. ఈసంఘటనతో మనకు నిరీశ్వరవాది, బ్రిటీష్ పార్లమెంట్ మెంబర్ ఛార్లెస్ బ్రాడ్లా (1833-1891) విషయం గుర్తుకొస్తుంది. ఆయన దేవుడి మీద ప్రమాణం చేయమని అన్నందుకు, ఆత్మసాక్షిగా మాత్రమే చేస్తానన్నందుకు వేధించి, వేధించి డిస్మిస్ చేశారు. అయినా అయనే మళ్లీఎన్నికై వచ్చారు. చివరకు ఆనాటి బ్రిటీష్ పార్లమెంట్ వ్యవస్థే దిగొచ్చింది. ఎవరి ఇష్ట ప్రకారం వారు ప్రమాణస్వీకారం చెయ్యొచ్చని 1888లో బిల్లు పాస్ చేసుకుంది.

సంఘ సంస్కర్తగా కృషి చెస్తూ వచ్చిన కవిరాజు తను నివాసమున్న ఇంటికి 'సూత్రాశ్రమం' - అని పేరు పెట్టుకున్నారు. వేదాలు, పురాణాలు ఎంత నీతి బాహ్యంగా ఉన్నాయో చెప్పడానికి తన ఆత్మీయమిత్రుడు కుప్పుస్వామి పేరుతో 'కుప్పుస్వామి శతకం' (1930) రాశారు. "పరుల నీ ముందు దిట్టెటి వాడు నిన్ను / నొరిని ముందు దిట్టక యుండబోడు / చదువు రవ్వంత వానికి ఒసంగరాదు / ముప్పు ఒచ్చున్ దప్పక దాన గుప్పుస్వామి" నీ ముందు వేరేవాళ్ళను తిట్టేవాడు. వేరే వాళ్ళ ముందు నిన్ను తిట్టడని నమ్మకమేమిటీ? అలాంటి వాడికి ఏ మాత్రమూ చనువు ఇవ్వగూడదని హెచ్చరిస్తూ చెప్పిన పద్యం ఇది. మరో వైపు అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూ, మంత్రాలు లేని పెళ్లి విధానానికి సరళమైన తెలుగులో ఒప్పందాలు - ప్రమాణాలతో ఒక పెళ్లి విధానం (వివాహ విధి 1930) రూపొందించారు. దాని ప్రకారం ఎన్నో కులాంతర వివాహాలు జరిపించారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆయన పురపాలక సంఘ అధ్యక్షుడిగా నిరాఘాటంగా 13 ఏళ్లు నిలదొక్కుకున్నారు. ప్రజాభిమానం ఎంతగా పెరిగిపోయిందంటే, 1940లో గుడివాడలో ఆయనతో గజారోహణం చేయించి, ఘనంగా సన్మానించుకున్నారు. ఆ రోజుల్లోనే ఆంధ్రమహాసభ 'కవిరాజు' బిరుదునిచ్చి గౌరవించుకుంది. 1941లో ప్రఖ్యాత మానవవాది ఎం.ఎన్.రాయ్ తెనాలిలోని వీరి సూతాశ్రమాన్ని సందర్శించారు. కవిరాజు ఖ్యాతి దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించిందనడానికి ఇదొక మంచి ఉదాహరణ. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మూడు సార్లు సెనెట్ మెంబరయ్యారు.

వీర గంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడీ
పూసి పోదుము మెడనువైతుము పూలదండలు భక్తితో-

అనే ప్రసిద్ధ గీతం అందరికీ తెలిసిందే. అది కవిరాజు త్రిపురనేని రామస్వామి రచనే. ఒక స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన బ్రిటీష్ పాలకులపైకి తన జీవితాంతం అక్షర తూటాలను సంధిస్తూ వచ్చారు. కేవలం 56 ఏళ్లు జీవించిన వీరు, ఎన్ని రంగాలలో ఎంతెంత కృషి చేస్తూ కూడా ఒక హేతువాదిగా, ఒక మానవవాదిగా అజేయంగా నిలబడడం సామాన్యమైన విషయం కాదు. అందువల్ల ఆయన రాసిన ఆ ప్రసిద్ధ గీతంలోని వీరుడెవరో కాదు నిస్సందేహంగా ఆయనే! అందువల్ల కవిరాజా త్రిపురనేని రామస్వామి అందించిన స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ మనం ముందుకు సాగాల్సి ఉంది!

(కవి రాజు జయంతి 15 జనవరి)

- కేంద్ర సాహిత్య అకాదమీ అవార్డు విజేత, జీవశాస్త్ర వేత్త
(మెల్బోర్న్ నుంచి)

డబ్లిన్ నుంచి తిరిగి వచ్చి త్రిపురనేని 1917లో తొలుత మచిలీపట్నంలో న్యాయవాదిగా నాలుగైదేళ్లు ప్రాక్టీసు చేశారు. 1922లో అక్కడి నుండి తెనాలికి మారి, న్యాయవాదిగా అక్కడ స్థిరపడ్డారు. వృత్తితో పాటు, సామాజిక అన్యాయాల్ని, మత అరాచకాల్ని ఎదిరించే తన ప్రవృత్తిని మేల్కొల్పారు. రాజరామ్మోహన్ రాయ్, రానడే కందుకూరి, గురజాడ వంటి వారి ఆదర్శాల్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేవారు. ఇలాంటి సంఘ సంస్కరణ కార్యక్రమాల వల్ల ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. ఫలితంగా 1925లో తెనాలి పురపాలక సంఘానికి జస్టిస్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. అయితే ఆయన సంస్కరణ వాదం ఆయన పదవికి ముప్పు తెచ్చింది. పురపాలక సంఘ అధ్యక్షునిగా జంతు బలుల్ని నిషేధిస్తే - అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయనను పదవి నుండి దింపేశారు. త్రిపురనేని వారు కంగారు పడలేదు. ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో మళ్లీ ఘన విజయం సాధించి పదవి చేజిక్కించుకున్నారు. జంతు బలుల్ని నిషేధించారు. అంతే-ప్రత్యర్థులు దిక్కుతోచక తోక ముడిచారు.



నీవెరుగని నిజం...

వేటగాడా....
నీ ఇనుప కంచెల పైనుండి ఎగురుతున్న
మా రెక్కల చప్పుడు విని
గాబరాపడుతున్నావెందుకు?
మా స్వేచ్ఛా కువకువలు విన్న మనుషులు
ఆకాశానికేయి తలెత్తి చూస్తే
కంగారుపడుతున్నావెందుకు?
ఆ స్వేచ్ఛా కువకువలు వారిలో
ఎగరాలనే కాంక్షను రగిలిస్తాయనే భయమా?

వేటగాడా...
మా రెక్కలిరిసి నీ ఇనుప గోడల మధ్యనే
మము బంధించినావు కదా? అయినా...
నీవు బెరుకుబెరుకుగానే ఉంటున్నావెందుకు?
గాలితో జరుపుతున్న మా కువకువల సంభాషణలను
నీ నిఘాయంత్రం తర్జుమా చేయలేకపోతున్నందుకా?

వేటగాడా....
నీ ఇనుప గోడల మధ్యనే ఉన్న
మా కుదురు నిదురను తలచి
నీవు నిదురలోనే ఉలిక్కిపడుతున్నావెందుకు?
మా నిదురల్లో నీ ఇనుప గోడలను
బద్దలు చేసే ఆలోచనలేవో చేస్తున్నామని
మా కలల్లో నూతన స్వేచ్ఛా ప్రపంచాలనేవో
కలగంటున్నామనే తలపులు నీ బుర్రను
చిందరవందర చేసి
నీ నిదురను చెడగొడుతున్నాయా?


వేటగాడా...
నీ మొరటు దెబ్బలకు తట్టుకుని
నిలబడుతున్న మా ధైర్యమేందో తెలియక
తలను బండకేసి బాదుకుంటున్నావా?
మృత్యువులోనూ...మరో ప్రపంచాన్ని
స్వప్నించడమే మా ధైర్యం

వేటగాడా....
నీవెరుగని ఓ నిజాన్ని నీకు చెప్పనా...
స్వేచ్ఛగా ఎగరడం, స్వేచ్ఛగా కూయడమనే
మా సహజగుణాన్ని నిర్మూలించడం
నీవల్ల కాదు...నీ వల్ల కాదు....

- దిలీప్.వి, 8464030808

విద్యార్థుల 'పార్లమెంట్ మార్చ్' ఎందుకు?

నేడు దేశంలో 16 విద్యార్థి సంఘాలు మొదటిసారి "యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా" అనే పేరుతో మార్చ్ టూ పార్లమెంట్‌కు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యావ్యతిరేక చర్యలకు నిరసనగా దేశంలో వేలాదిమంది విద్యార్థులు ఢిల్లీ వీధుల్లో ఈ ప్రదర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత విద్యపై దాడి ప్రమాదకరమైన స్థాయిలోకి చేరుకున్న విషయం తెలిసిందే. ఆరెస్సెస్ మద్దతుతో దేశ విద్యారంగాన్ని విచ్చిన్నం చేసే కుట్రలు నేటికీ చేస్తూనే ఉన్నారు. భావ వ్యక్తీకరణకు భిన్నంగా దేశ విద్యారంగాన్ని కాషాయీకరణ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. చివరకు పాఠ్యపుస్తకాలు నుండి ఇండియా అనే పేరు తొలగించే ప్రయత్నం ప్రారంభించారు. దేశంలో వంద ఏండ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఫాసిస్టు ఆరెస్సెస్ మనదేశంలో విద్యారంగంలో ప్రజాస్వామ్య, లౌకిక,ప్రగతిశీల విలువలపై సంఘపరివార్ శక్తులు మరింత దాడికి పూనుకునేందుకు ప్రణాళిక రచిస్తున్నారు.



టి.నాగరాజు
9490098292

మనదేశంలో విద్య హక్కును రాజ్యాంగంలోనే పొందుపర్చారు. నూతన విద్యా విధానం (ఎన్ఇపి) అమలు చేస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కును నిర్మూలించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుంది. విద్యాహక్కు చట్టం-2009 లో చేసిన తర్వాత అందరికీ విద్య అందాలని రాజ్యాంగ సవరణ చేసి చట్టం చేస్తే మోడీ ప్రభుత్వం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కనీసం రాష్ట్రాలతో సంప్రదించకుండా పార్లమెంట్‌లో చట్టం చేసింది. రాష్ట్రాల ఫెడరల్ హక్కులను కూడా లేకుండా నియంతృత్వ శాసనాలు చేసింది. ఎన్ఇపి వల్ల పాఠశాలల విలీనం, మూసివేత,దూరప్రాంత హైస్కూల్స్ వెళ్ళాల్సిన పరిస్థితి, డ్రాపౌట్స్ పెరుగుదల పెరిగి విలువలు లేని శ్రామికులుగా బాలలు మారతారు. కేవలం పాఠశాల విద్య మాత్రమే కాదు, కేంద్రం ఆధీనంలోకి సిలబస్ రూపకల్పన, పరీక్షల విధానం, శిక్షణా కార్యక్రమాలను నూతన విద్యావిధానం రూపంలో కేంద్రం రాష్ట్రాల నుండి గుంజుకుంటోంది. ఎన్ఇపి వల్ల ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నతవిద్య వరకు విద్య కేంద్రీకరణ చేసే సంస్కరణల్ని బీజేపీ ఈ విద్యావిధానంతో ముందుకు తెస్తోంది. పాఠశాల విద్యలో 3,4,5 తరగతుల విలీనం, సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశ పెట్టడం, ఎన్‌జీఓ. ధార్మిక సంస్థలను అనుమతించడం, వాలంటీర్లను నియమించడం, హిందీ, సంస్కృతంను బలవంతంగా రుద్దడం, మల్టీఎగ్జిట్స్ పేరుతో పాఠశాల స్థాయి నుండి వత్తివిద్యాకోర్సులు, యూనివర్శిటీల వికేంద్రీకరణ, విదేశీ యూనివర్శిటీల ఆహ్వానం లాంటి సంస్కరణల్ని తీసుకొస్తోంది. దీంతో మన దేశ విద్యారంగం ప్రభుత్వ బాధ్యత నుంచి పరోక్షంగా ప్రయివేటు, కార్పోరేట్ శక్తులకు బదలాయింపు చేసే కుట్రల్ని బీజేపీ వేగంగా అమలు పరుస్తోంది.

రాజ్యాంగ మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం, సాంస్కృతిక భాష వైవిధ్యం లాంటి వాటిని ఎన్ఇపి విస్మరిస్తోంది. విశ్వ విద్యాలయాలలో మహిళలు రక్షణకు జీఎస్ క్యాష్ కమిటీలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, విద్యార్థి సంఘాల ఎన్నికలు, నిధులు కేటాయింపులు గురించి స్పష్టత లేకుండా దేశ విద్యావ్యవస్థను విదేశీ, కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు శరవేగంగా కదులుతోంది. ప్రస్తుతం మాతృభాషతో పాటు ఇంగ్లీష్, హిందీ భాషలు అమలవుతున్నాయి.కానీ ఎన్ఈపీలో సంస్కృతం, హిందీని బలవంతంగా అమలు చేసే ప్రమాదమున్నది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఆధునిక యుగంలో సంస్కృతం, హిందీ భాషలను నేర్చుకుని విద్యార్థులు ప్రపంచంతో పోటీపడతారా? అనే అనుమానాలూ లేకపోలేదు. విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని ప్రోత్సహించకుండా యంత్రాలుగా తయారు చేసే విద్యావిధానాన్ని ఆరెస్సెస్ కనుసన్నల్లో బీజేపీ రూపొందించింది. ఇప్పటికే నూతన విద్యావిధానం అమలు చేస్తున్న రాష్ట్రాల అనుభవాలు కూడా చూస్తున్నాము. మన పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఈ విద్యా సంవత్సరం 3 లక్షల 80 వేల మంది డ్రాపౌట్స్‌గా పాఠశాలకు దూరంగా ఉన్నారంటే ఎంతటి ప్రమాదమో మనం అర్థం చేసుకోవచ్చు.


విద్యారంగంపై కేంద్రం 'బుల్డోజర్'

విద్యారంగంపై కేంద్ర ప్రభుత్వం 'బుల్డోజర్'ను ప్రయోగిస్తున్నది. ఇది పేద విద్యార్థులు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నది. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నుండి చరిత్ర మార్చే చర్యలు ప్రారంభించింది. యూజీసీ, ఏఐసీటీఈతో పాటు ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వారినే చైర్మన్, వీసీలుగా నియమిస్తున్నది. మనువాద భావజాలాన్ని విద్యారంగంలో జొప్పిస్తున్నది. అందుకనుగుణంగా సిలబస్‌ను రూపకల్పన చేస్తున్నది. భగవద్గీతను చదవాలంటూ పాఠ్యాంశాల్లో చేర్పుతున్నది. మహాత్మాగాంధీ, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగిస్తున్నది. ఆర్ఎస్ఎస్ నాయకులైన హెడ్గేవార్, సావర్కర్ వంటి వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు బోధిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నది. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వారు వివక్షకు గురవుతున్నా పట్టించుకోకపోవడం, వివ క్షను రూపుమాపేందుకు చర్యలు లేకపోవడంతో రోహిత్ వేములలాంటి వారు ఉన్నత విద్యసంస్థల్లోనే ఆత్మహత్యలు చేసుకున్న ఘటన ఇంకా మనల్ని కలచివేస్తూనే ఉన్నది. వివక్షకు వ్యతిరేకంగా రోహిత్ యాక్టు తేవాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్రం కనీసం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఐఐటీలు, ఐఐఎంలలో ఆదివాసీ, గిరిజన, దళితులకు చెందాల్సిన పోస్టులను భర్తీచేయకుండా ఖాళీలు ఉంచడం, ఉన్నత విద్యా సంస్థలలో అమ్మాయిలపై జరుగుతున్న లైంగికదాడులకు పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయకుండా బీజేపీ నిర్లక్ష్యం చేస్తోంది.

పెరుగుతున్న నిరుద్యోగం

అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పదేండ్లయినా ఉద్యోగాలు భర్తీ చేయడం లేదు. నేషనల్ శాంపిల్ సర్వే లెక్కల ప్రకారం 17 లక్షల ఉద్యోగాలు నేడు దేశంలో ఖాళీగా ఉన్నాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు 2013-14 లో 4.9శాతం ఉన్న నిరుద్యోగిత రేటు నేడు 7.28 శాతానికి చేరుకుంది. 75 ఏండ్ల అమృతోత్సవాల భారతవనిలో మొదటిసారి నిరుద్యోగిత రేటు ఈ స్థాయిలో పెరిగింది. గ్రామీణ నిరుద్యోగిత రేటు 10.82 శాతం,పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 8.44శాతంగా ఉంది. ఈ ఖాళీలు భర్తీ చేయకుండా బీజేపీ అదానీ,అంబానీ సేవలో తరిస్తున్నది. ప్రధానంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. మొన్న పార్లమెంటు సమావేశాల్లో 'పొగ బాంబు'లు విసిరి మరి తమ నిరసన తెలిసిన యువకులు రాజ్యాంగ రక్షణ, నిరుద్యోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అందుకే దేశంలో ఉపాధిని గ్యారెంటీ చేయాలని విద్యార్థి, యువజనులు నిత్యం ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. దేశంలో జరుగుతున్న సంఘ్ పరివార్ దాడులకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమాలను నిర్మించాలి. లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల వామపక్ష విద్యార్థి సంఘాలు 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా" వేదిక ఆధ్వర్యంలో జనవరి 12న 'సేవ్ ఎడ్యూకేషన్-సేవ్ ఇండియా', 'రిజెక్ట్ ఎన్ఇపి.- రిజెక్ట్ బీజేపీ' పేరుతో మార్చ్ టూ పార్లమెంట్ నిర్వహిస్తున్నారు. భవిష్యత్ భారతదేశాన్ని ఈ ఫాసిస్టు మూకల నుండి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాల్సిన అవసరం ఉన్నది. ఈ ఏడాది జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీని అడ్డుకోవాల్సిన బాధ్యత విద్యార్థి, యువజనులపై ఉన్నదన్న సంగతి మరవకూడదు.

(జనవరి 12 ఐక్య విద్యార్థి సంఘాల చలో పార్లమెంట్)



బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నుండి చరిత్ర మార్చే చర్యలు ప్రారంభించింది. యూజీసీ,ఏఐసీటీఈతో పాటు ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వారినే చైర్మన్, వీసీలుగా నియమిస్తున్నది. మనువాద భావజాలాన్ని విద్యారంగంలో జొప్పిస్తున్నది. అందుకనుగుణంగా సిలబస్‌ను రూపకల్పన చేస్తున్నది. భగవద్గీతను చదవాలంటూ పాఠ్యాంశాల్లో చేర్చుతున్నది. మహాత్మాగాంధీ, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగిస్తున్నది. ఆర్ఎస్ఎస్ నాయకులైన హెడ్గే వార్, సావర్కర్ వంటి వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు బోధిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నది.

నవతెలంగాణ
ఖమ్మం
5
శుక్రవారం | జనవరి 12, 2024 | www.navatelangana.com



జూన్ నాటికి సొరంగమార్గం పూర్తి కావాలి

యాతాలకుంట టన్నెల్‌ను పరిశీలించిన మంత్రి తుమ్మల

నవతెలంగాణ-సత్తుపల్లి

సీతారామ ప్రాజెక్టు ఏర్పాటులో ప్రధాన భూమికగా ఉన్న యాతాలకుంట టన్నెల్‌ను వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణలతో కలిసి గురువారం పరిశీలించారు. టన్నెల్ (సొరంగమార్గం) నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్న నేపథ్యంలో పరిస్థితిని తెలుసుకునేందుకు మంత్రి తుమ్మల టన్నెల్ పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా టన్నెల్ నిర్మాణ కంపెనీ యాజమాన్య బాధ్యులు కేశవరాజు, ఈఈ శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులతో మంత్రి తుమ్మల మాట్లాడారు. టన్నెల్ పనులను రెండుపక్కల నుంచి చేపట్టాలని మంత్రి సూచించారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు గోదావరి నీరు పారాలంటే ఈ టన్నెల్ పూర్తయితేనే సాధ్యపడుతున్న నేపథ్యంలో పనులను త్వరితగతిన పూర్తి చేయించేందుకు మంత్రి ఈ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. హెచ్‌ఈఎస్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ టన్నెల్ నిర్మాణం జరుగుతోంది. నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.150కోట్లు. ఇప్పటి వరకు రూ. 15కోట్ల వరకు సంబంధిత కంపెనీ ఖర్చు పెట్టింది. 1800 మీటర్లు (1.8కిమీ) పొడవున్న ఈ టన్నెల్ ఇప్పటి వరకు 180 మీటర్ల మేర పనులు జరిగి 10శాతానికి చేరుకుంది. ఇంకా 90శాతం వరకు పనులు జరగాల్సి ఉంది. వచ్చే వర్షాకాలాని కల్లా టన్నెల్ పూర్తి చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించిన నేపథ్యంలో టన్నెల్ త్వరితగతిన పూర్తి చేస్తారని ఆశిద్దాం. మంత్రి వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఉన్నారు.

మా పోడు భూములు ఇప్పించండి

తహశీల్దార్‌కు ప్లాంటేషన్ బాధితుల వినతి

నవతెలంగాణ-కారేపల్లి

పోడు సాగు జీవన భృతిగా 75 ఏండ్లుగా జీవిస్తున్న తమను ప్రత్యామ్నాయ పోడు చూపుతామన్నా ఫారెస్టు అధికారులు మొఖం చాటేశారని, తమమీదే దౌర్జన్యం చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని కారేపల్లి మండలం మాణిక్యారం, కోయగుంపు, వడ్డెరగుంపు, ఎర్రబోడు గ్రామాలకు చెందిన పేదలు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్ కు వినతిపత్రం ఇచ్చారు. ఫారెస్టు ఊట్యూర్ బీట్ పరిధిలోని ఊటవాగు వద్ద గిరిజన, గిరిజనేతర పేదలం 200 ఎకరాలు పోడు సాగు చేస్తున్నామని వినతిలో పేర్కొన్నారు. 2020లో ప్రత్యామ్నాయ పోడు చూపుతామని, పారెస్టు వేధింపులు ఉండవని నమ్మబలికి ప్లాంటేషన్ ఏర్పాటు చేశారన్నారు. ప్లాంటేషన్ వేసిన తర్వాత మాకు ప్రత్యామ్నాయ పోడు చూపకపోగా ప్లాంటేషన్‌పై హక్కు లేకుండా చేశారన్నారు. తమతో సాగు చేసిన పోడుకు చాలా మంది హక్కులు పొందారని తమపై వివక్షత చూపి హక్కులు దక్కకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో కలెక్టర్, డీఎఫ్‌వో సైతం హామీ ఇచ్చి ఉన్నారని తెలిపారు. తమ పోడును అప్పగించి మాకు న్యాయం చేయలని విన్నవించారు. ఈకార్యక్రమంలో ఎర్రబోడు సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, సోసైటీ మాజీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి కే.నరేంద్ర, వజ్జా రామారావు, కాంగ్రెస్ నాయకులు మేదరి రాజు, పోడుదారులు కళమ్మ, అరుణకుమారి, కౌసల్య ఎల్లమ్మ సుగుణ, అరుణ, ఉపేంద్ర, సుకన్య, పద్మ, లక్ష్మన్, వీరమ్మ, రాములు తదితరులు ఉన్నారు.

అవినీతిలేని పాలన అందించడమే తమ లక్ష్యం

ఎంఎల్ఏ మట్టా రాగమయి దయానంద్

నవతెలంగాణ-కల్లూరు

సత్తుపల్లి నియోజకవర్గంలో అవినీతికి తావు లేకుండా పరిపాలనందించి పేద ప్రజల సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయ దయానంద్ అన్నారు. బుధవారం రాత్రి మండలం పరిధిలోని పేరువంచ గ్రామంలో ప్రజలందరితో, దైవజనులతో కలిసి యేసు ప్రభువు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కేసర శ్రీనివాస్‌రెడ్డి, పరిమి భరత్, రిటైర్డ్ ఉపాధ్యాయులు, కల్లూరు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దైవజనులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడికి కుర్చీలు వితరణ

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు పరిధిలోని 6వ అంగన్వాడి సెంటర్లో మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు షేక్ అఫ్రోజ్ సహకారంతో సూచన మేరకు హరిచందన బంగారం షాప్ యజమాని అప్పలనాయుడు అంగన్వాడి సెంటర్‌లోని పిల్లల కూర్చోవటానికి కుర్చీలను వితరణ అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సఫియా, హెల్పర్ లీల మరియు పిల్లలు పాల్గొన్నారు.

మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుదాం: ఎంపీడీవో

నవతెలంగాణ -కూసుమంచి

విద్యార్థులు చదువుతో పాటుగా మన సంస్కృతీ సంప్రదాయాల పట్ల కూడా కొంత అవగాహన కలిగి ఉండి సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎంపీడీవో ఆర్.రమాదేవి అన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో గురువారం జరిగిన సంక్రాంతి సంబరాలు భాగంగా భోగిమంటల కార్యక్రమం, పాలు పొంగళ్ళు, రంగోలితో విద్యాలయం సంక్రాంతి పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసిన విద్యార్థులను ఎంపిడివో అభినందించారు. ఎంఈవో రామాచారి మాట్లాడుతూ కేజీబీవీలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ అజిత కుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ముగ్గులు వేసిన విద్యార్థులకు మొదటి నుండి ఐదు బహుమతులు అందజేశారు.



శ్రీచైతన్య ఒలంపియాడ్‌లో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలోని స్థానిక మమత ఆసుపత్రి రోడ్‌లో గల శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలోని విద్యార్థులు కలిసి సంక్రాంతి పండుగ సందర్భంగా ఉత్సాహంగా భోగి మంటలు వేసి, ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డిజియం. చేతన్ మాథూర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్స్ టిఎల్ఎన్. శర్మ రాజ్‌కుమార్ జోషి, ఏడుకొండలు, వైస్ ప్రిన్సిపాల్స్ రామకృష్ణారెడ్డి, సురేష్, ఐ.పి.ఎల్ ఇన్చార్జ్ రాజశేఖర్‌రెడ్డి, డీన్స్ కె.వి.ఆర్, లక్ష్మీనారసింహ, నవీన్, రామారావు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదులకు ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ఖమ్మంలీగల్

ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 30 మంది మహిళా న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలకు జనవరి 26న బహుమతులు ప్రదానం చేస్తామని మహిళా ప్రతినిధి కెవివి లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా న్యాయమూర్తులు ఆశాలత, ఆర్.శాంతిలత, కె.దిపా, పి.నాగశ్రావ్య, వి.మాధవి, బార్స్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దిరిశాల కృష్ణారావు, ఉపాధ్యక్షులు మాదిరాజు లక్ష్మీనారాయణ, కార్యదర్శి చంద్రశేఖర్ గుప్తా, ప్రవీణ్, సింగం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మధు విద్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-వైరాటౌన్



స్థానిక మధు విద్యాలయంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. గురువారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మధు విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగ యొక్క విశిష్టత, బోగి మంటలు, గొబ్బిళ్ళు, సంక్రాంతి, కనుమ యొక్క విశిష్టతను, సంక్రాంతి ఆచార సంప్రదాయాలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో మధు విద్యాసంస్థల ఉపాధ్యక్షులు మల్లెంపాటి ప్రసాదరావు, కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్, కోశాధికారి మల్లెంపాటి నర్మద, కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, సిబిఎస్ఈ ప్రధాన ఉపాధ్యాయులు డివిఆర్ చారి, రాజేంద్రప్రసాద్, సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాణిక్యారం, ఎర్రబోడు రైతుల నుంచి బలవంతంగా తీసుకున్న

పోడు భూములు ఇచ్చేయాలి

- సీపీఐ(ఎం) కార్యాలయంపై దాడికి పాల్పడ్డ అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు రైతులకు హక్కులు కల్పించాలి
- రైతులపై పెట్టిన కేసులను ఎత్తేయాలి
- విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్



నవతెలంగాణ-ఖమ్మం

ఏడు దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేస్తున్న కారేపల్లి మండలం మాణిక్యారం, ఎర్రబోడు గ్రామాలకు చెందిన గిరిజన పేద రైతుల నుంచి 2020 సంవత్సరంలో అటవీశాఖ అధికారులు హరితహారం కింద దాదాపు 200 ఎకరాలు బలవంతంగా తీసుకొని ప్రత్యామ్నాయ భూములు చూపుతామని మభ్యపెట్టి భూములు చూపకుండా కాలయాపన చేస్తూ తిరిగి గిరిజన పేద రైతులపై అక్రమంగా అటవీశాఖ అధికారులు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, విలేకరుల సమావేశంలో తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలోనే తహశీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు, అటవీశాఖ అధికారులు మూడు దఫాలుగా చర్చలు జరిపి అట్టి భూములు గతం నుంచి పోడు రైతుల సాగులో ఉన్నాయని, రిపోర్టు జిల్లా కలెక్టర్‌కు కూడా పంపించడం జరిగిందని అన్నారు. మా భూములు మాకే ఇవ్వాలని భూమిపై హక్కులు కల్పించాలని అనేకసార్లు ఆందోళనలు, పోరాటాలు సాగాయని, గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎఫ్.ఆర్.సి. గ్రామ సభలో పోడు రైతుల దరఖాస్తులు స్వీకరించి గ్రామసభ ఆమోదించిందని తెలిపారు. భూములు సాగు చేస్తూ ఉంటే అటవీశాఖ అధికారులు ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో గిరిజన హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించే ప్రయత్నం సరైంది కాదని, సీపీఐ(ఎం) బృందం కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారిని కలిసి కేసులు లేకుండా చూడాలని, అరెస్టులు అవసరం లేదని తెలిపినప్పటికీ ఎఫ్ఆర్ఓ అత్యుత్సాహంతో నాయకత్వాన్ని ఫారెస్ట్ కార్యాలయంలో ఉంచి తన సిబ్బందితో కారేపల్లి సిపిఎం మండల కార్యాలయంలో జరుగుతున్న గిరిజన సంఘం సమావేశంపై దాడి చేయటం సరైనది కాదని, అలాంటి అధికారిపై మరియు అటవీ సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి మాణిక్యారం, ఎర్రబోడు భూ సమస్య పరిష్కరించి పోడు గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు. పోడు రైతుల జోలికి తిరిగి వెళితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, వై విక్రమ్ పాల్గొన్నారు.

పోడు ప్లాంటేషన్‌ను పరిశీలించిన ఫారెస్టు విజిలెన్స్ అధికారి

పోడుదారుల వినతి స్వీకరణకు నిరాకరణ

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలం మాణిక్యారం-ఎర్రబోడు ఊటవాగు సమీపంలో ఊట్యూర్ ఫారెస్టు బీట్‌లోని వివాదస్పదమైన పోడు ప్లాంటేషన్‌ను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ యేలుసింగ్ మేరుతో కలిసి సీసీఎఫ్ బి.భీమానాయక్, డీఎఫ్ఓ విక్రమ్‌సింగ్ గురువారం పరిశీలించారు. పేదలు సాగు చేస్తున్న 50 హెక్టర్ల పోడును 2020 సంవత్సరంలో ప్రత్యామ్నాయ పోడు చూపుతామని పేదల నుండి తీసుకున్న ఫారెస్టు అధికారులు దానిలో ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. తర్వాత ప్రత్యామ్నాయ భూమిని చూపకపోవటంతో మూడేండ్లుగా ప్లాంటేషన్ పోడు తమదేనంటూ గతంలో సాగు చేసిన పేదలు ఆందోళన బాట పట్టారు. పేదలపై ఇప్పటికి 3 సార్లు కేసులు అయినా పేదలు మాత్రం తమకు ఆ పోడే జీవనాధారమని తమకు ఇప్పించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం పోడు భూములకు హక్కులు కల్పించటానికి ఏర్పాటు చేసిన గ్రామసభలో సైతం ప్లాంటేషన్‌లో పోడు కోల్పోయిన పేదలు 60 మందికి హక్కులు కల్పించాలని తీర్మానం చేశారు. అయినా వారి వినతులు ఫారెస్టు చెవికెక్కలేదు. దీంతో ప్లాంటేషన్ ఆక్రమించి సేద్యం చేయటానికి పేదలు ప్రయత్నిస్తున్నారు. ఈనెల 5వ తేదిన ప్లాంటేషన్‌లో సాగుకు ప్రయత్నించిన ఆరుగురిపై ఫారెస్టు అధికారులు కేసులు నమోదు చేసి వారిని అరెస్టు చేయటానికి చేస్తున్న ప్రయత్నాలు ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తున్నాయి. బుధవారం కేసులో ఉన్న వారు సీపీఎం కార్యాలయంలో ఉన్నారంటూ ఫారెస్టురేంజర్ సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో ఫారెస్టు అధికారులు కార్యాలయంలో ముట్టడి చేశారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో పీసీసీఎఫ్ విజిలెన్స్ అధికారి డాక్టర్ యేలుసింగ్ మేరు ప్లాంటేషన్ సందర్శించారు. ప్లాంటేషన్‌లో ధ్వంసమైన మొక్కలను ఆయన పరిశీంచారు. పీసీసీఎఫ్ వెంట డీఎఫ్‌వో విజిలెన్స్ రాజశేఖర్, ఎఫ్‌డీవోలు బీ.బాబు, నాగభూషణం, కారేపల్లి రేంజ్ ఆఫీసర్ సిద్దార్థరెడ్డి, టాస్కఫోర్స్ ఎఫ్ఆర్వో కవితమాధురి, టాస్కఫోర్స్ డీఆర్వో రవికుమార్, అయేషా, ఎఫ్ఎస్వోలు డి.చక్రవర్తి, కిశోర్ కుమార్ తదితరులు ఉన్నారు.

పోడుదారుల వినతి స్వీకరణకు నిరాకరణ

ఏండ్ల తరబడి పోడు సాగు చేస్తున్న తమను స్థానిక ఫారెస్టు అధికారులు మోసం చేశారని పీసీసీఎఫ్ అధికారికి తమ బాధను వినతి రూపంలో వ్యక్త పర్చటానికి సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు ప్లాంటేషన్ ప్రాంతానికి వచ్చారు. ప్లాంటేషన్ బాధితుల మొర ఆలకించటానికి, వినతి పత్రం స్వీకరించటానికి కూడా ఆయన నిరాకరించి వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, కరపటి సీతారాములు, ఎర్రబోడు సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, రైతు బంధు కన్వీనర్ ఈసాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ మౌలిక విలువలను తుంగలో తొక్కుతున్న కేంద్ర ప్రభుత్వం

- ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమించాలి
- 10,11న ఖమ్మంలో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-ఖమ్మం

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను తీసివేయడానికి కుట్రలు చేస్తుందని, మతోన్మాద బీజేపీని ఓడించేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం మంచికంటి ఫంక్షన్ హాల్‌లో కేవిపిఎస్ జిల్లా స్థాయి సమావేశం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తమల్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ .ప్రజలపై మత విశ్వాసలు బలవంతంగా రుద్దే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు?. పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దు చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు లాభం చేస్తున్నారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని గద్దించడమే దేశభక్తుల కర్తవ్యం అని ఆయన పిలుపునిచ్చారు ఫిబ్రవరి 10, 11 తేదీలలో ఖమ్మం పట్టణంలో కెవిపిఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు ఆ సందర్భంగా రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు మాచర్ల భారతి ప్రసంగించారు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీను పాపిట్ల సత్యనారాయణ బొట్ల సాగర్ మట్టి దుర్గ ప్రసాద్ కుక్కల సైదులు నకిరేకంటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం తొలగింపు

కాంగ్రెస్ నాయకుల చొరవతో సమస్యకు పరిష్కారం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ఏదులాపురం పంచాయతీ వరంగల్ క్రాస్ రోడ్ పరిధిలోని వార్తా కార్యాలయం పక్కన విద్యుత్ స్తంభం కంగిపోవడంతో అధికారులు దానికి మరో స్తంభాన్ని సపోర్టుగా ఉంచారు. సపోర్ట్‌గా ఉంచిన స్తంభం చైతన్య నగర్ కాలనీకి వెళ్లే మార్గానికి అడ్డంగా ఉండటంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీవాసులు పలుమార్లు విద్యుత్ అధికారులు, స్థానిక నాయకుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంలో పలువురు కాలనీవాసులు కాంగ్రెస్ నాయకుల దష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకులు హరినాథ్‌బాబు, పాలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భూక్య సురేష్ నాయక్‌లు విద్యుత్ అధికారులతో మాట్లాడి రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగింపజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు హరినాథ్‌బాబు, సురేష్ నాయక్‌లకు ప్రత్యేకంగా అభినందించారు.

చలానా రాయితీని వినియోగించుకోవాలి : సీఐ

నవతెలంగాణ-కారేపల్లి

వాహనదారులు తమ వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను రాయితీ వినియోగించుకోని వెంటనే చెల్లించాలని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం కారేపల్లిలో ట్రాఫిక్ చలాన్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను ఆపి పెండింగ్ చలాన్లను తనిఖీ చేయటంతో పాటు వాటిని చెల్లించేలా చర్యలు చేపట్టారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కారేపల్లి

తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కారేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అక్తర్ తెలిపారు. కారేపల్లి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు, 7,8,9,10 తరగతులలో విద్యాసంవత్సర చివరికి ఏర్పడే ఖాళీలలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ లో చేసుకోవచ్చాన్నారు. ప్రవేశాలకు ప్రవేశపరీక్షను ఏప్రిల్ 7వ తేదిన నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

ఖమ్మం డివిజన్ ట్రస్మా సలహాదారుగా గీతాంజలి అప్పారావు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం డివిజన్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) గౌరవ సలహాదారుగా ఖమ్మం గీతాంజలి పాఠశాల కరస్పొండెర్ టీవీ.అప్పారావు ఎన్నికయారు. ఈ సందర్భంగా అప్పారావును ఫెమా కన్వీనర్ ముష్వా శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు కేసా వీరన్న, ఏవి.రమణారావు, కాంతారావు, పోలవరపు శ్రీకాంత్ తదితరులు అభినందించారు.

ఎరువులు రైతులకు అందుబాటులో ఉండాలి : డీఏవో

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



అన్నదాతలకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అధికారులను, ఎరువుల విక్రయదారులను ఆదేశించారు. మండల పరిధిలోని పల్లెగూడెం, ఏదులాపురంలో ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ బోర్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడారు. దుకాణాల ఎదుట స్టాక్ బోర్డులను, ధరల పట్టీలను ప్రదర్శించాలన్నారు. పీఓపీ యంత్రాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. దుకాణాల్లో అన్ని రకాల ఎరువులు అన్నదాతలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ- కూసుమంచి



మండల కేంద్రంలో జరిగిన పదవ మండల మహాసభలలో నూతన కమిటీని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకోవడం జరిగిందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మండవ నర్సయ్య తెలిపారు. అధ్యక్షులు దేవరకొండ రవి కిరణ్, ప్రధాన కార్యదర్శి పరుచూరి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా టి.విజయలక్ష్మి, ఎస్.శ్రీనివాసరాజు, కోశాధికారిగా పి.కృష్ణ, కార్యదర్శులుగా బి.బాబురావు, ఎస్.నరసింహారావు, ఈ.విజయలక్ష్మి, ఎల్.వీరబాబు, ఎస్‌కే.జమీల్ పాషా, కే.రమేష్ మరియు మండల ఆడిటర్‌గా ఎం.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ రాబోయే సంవత్సర కాలంలో ప్రభుత్వ విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తారని తెలిపారు. ఎన్నికల అధికారిగా తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు బి.కేశ్య వ్యవహరించారు.

తూతూమంత్రంగా ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక

- మస్టర్లపై సంతకాలు లేకుండానే బిల్లులు చెల్లింపు
- పని ప్రదేశాలకు సంబంధించిన ఫోటోలు నిల్
- తక్కువ పని దినాల వారికి ఎక్కువ
- ఎక్కువ పని దినాల వారి వారికి తక్కువ మస్టర్లు
- జర్నలిస్టులకు సమాచారం ఇవ్వని ఈజీఎస్ అధికారులు



నవతెలంగాణ - బోనకల్

మండల పరిషత్ కార్యాలయం నందు 15వ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం తూతూమంత్రంగా నిర్వహించారు. గత సామాజిక తనిఖీ ప్రజావేదికలో పెద్ద ఎత్తున అవినీతి బయటపడటం ఆ అవినీతి వివిధ పత్రికలలో ప్రచురిత కావడంతో ఈసారి మండల ఈజీఎస్ అధికారులు జర్నలిస్టులకు సమాచారం ఇవ్వకుండానే సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. బోనకల్ మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉన్నాయి 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఈజీఎస్ పనులకు సంబంధించి ఇంతకుముందే గ్రామస్థాయిలో ఈజీఎస్ గ్రామ సభలు నిర్వహించారు. అనంతరం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను జిల్లాస్థాయి అధికారులు నిర్వహించారు. మోటమర్రి, ఆళ్ళపాడు, రాపల్లి, రావినూతల, గార్లపాడు, రామాపురం, చొప్పకట్లపాలెం, నారాయణపురం, చిన్న బీరవల్లి, కలకోట, రావినూతల తదితర గ్రామాలలో ఈజీఎస్ పనులలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు గ్రామస్థాయి తనిఖీ బృందం సభ్యులు సభలో ప్రవేశపెట్టారు. మోటమర్రి, జానకిపురం, ఆళ్లపాడు గ్రామాలలో మస్టర్లపై సంతకాలు లేకుండానే బిల్లులు చెల్లించారు. వర్క్ జరిగిన ప్రదేశానికి సంబంధించి ఫోటోలు లేవన్నారు. ఇన్‌పుట్, డేటా షీట్లు ఇవ్వలేదన్నారు. ఆట స్థలాలకు సంబంధించి ఎక్కడ నాణ్యత ప్రమాణం పాటించలేదని సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. గ్రామ సభలలో అనేకమంది తమకు జాబుకార్డులు కావాలని దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. మరికొన్ని గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో చేసిన పని కొలతలకు, ప్రస్తుతం కొలతలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ముష్టికుంట్ల, లక్ష్మీపురం, గోవిందపురం, ఆళ్ళపాడు, రావినూతల, బోనకల్ తదితర గ్రామాలలో హరితహారం కింద వేసిన మొక్కల లెక్కలకి ప్రస్తుతం ఉన్న లెక్కలకి చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఈ గ్రామాలలో 20 శాతం మొక్కలు కూడా లేవన్నారు. మరికొన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులకు వచ్చిన వారికి తక్కువ రోజులు పని దినాలు వేశారని, తక్కువ రోజులు వస్తే ఎక్కువ రోజులు పని దినాలు వేశారని గ్రామస్థాయి తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. దాదాపు అన్ని గ్రామాలలో మస్టర్లపై సంతకాలు లేకుండానే బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. అనంతరం డిఆర్‌డిఓ అదనపు పీడీ డి.శిరీష మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఎక్కువగా మస్టర్లు లేకుండానే బిల్లులు చెల్లించినట్లు ఈ సామాజిక తనిఖీలు తేలింది అన్నారు. వర్క్ జరిగిన ప్రదేశానికి సంబంధించి ఫోటోలు తప్పనిసరిగా ఉండాలని అలా ఫోటోలు లేని వారుపై రికవరీ రాస్తామన్నారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలితే అందుకు సంబంధించిన వారి నుంచి రికవరీ చేస్తామని తెలిపారు. వివిధ గ్రామాలకు సంబంధించి జరిగిన పొరపాట్లకుగానూ 21వేలు పెనాల్టీ వేస్తున్నట్లు తెలిపారు.అదే విధంగా జరిగిన తప్పులకు 20వేలు వారి నుంచి రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ (డివివో) బోడేపూడి వేణుమాధవ్ ఏపీడి పి.వెంకటరాజు ఎంపీడీవో బయారపు అశోక్ ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ (ఏవీఎం) పవన్ కుమార్, అంబుడ్స్ మెన్ రమేష్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రమేష్ ఆడిటర్ రమేష్ ఏపీవో బసవోజు కృష్ణకుమారి, ఈసి పిల్లుట్ల కిరణ్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైదులు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

- ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలి
- సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ ఇన్‌చార్జీ బండి రమేష్



నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని చేగమ్మ గ్రామంలో మూడు రోజుల క్రితం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో బొల్లం మల్లయ్య అనే రైతు ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు 50 క్వింటాలు పత్తి, ఆరు పుట్ల ధాన్యం, రూ.6 లక్షల రూపాయల నగదు, ఇంటిలో నిత్యవసర సరుకులతోపాటు ఇల్లు మొత్తం పూర్తిగా కాలిపోయింది. కట్టుబట్టలతో బయట ఉన్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతు కుటుంబానికి నూతన ఇంటిని మంజూరు చేసి, నిర్మించి రైతుకు ఆ ఇంటిని అందించి ఆదుకోవాలని సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ ఇన్‌చార్జీ బండి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. రైతు ఇంట్లో జరిగిన విద్యుత్ ప్రమాదాన్ని తెలుసుకున్న ఆయన గురువారం చేగొమ్మ గ్రామానికి చేరుకుని బాధిత రైతుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రైతులకు ధైర్యం చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో మాట్లాడి జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని, రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్లకు మీ తరపున ఇన్నవిస్తామని రైతుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు మల్లెల సన్మంతరావు, బిక్కసాని గంగాధర్ కర్ణబాబు, సీపీఐ(ఎం) గ్రామ కార్యదర్శి డాక్టర్ బాబు, బొల్లం వెంకన్న, నర్రా వెంకన్న పరామర్శించిన వారిలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మంతరావు, ఆ సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతికి సీఐటీయూ సంతాపం

నవతెలంగాణ-వైరా

మిషన్ భగీరథ కార్మికుడు అక్కిశెట్టి శ్రీనివాసరావు అకాల మృతికి ఆర్ డబ్ల్యుఎస్ సీఐటీయూ విభాగం సంతాపం తెలిపింది. మండలంలోని విప్పలమడక గ్రామానికి చెందిన శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. గురువారం ఉదయం అంత్యక్రియలకు హాజరైన మిషన్ భగీరథ కాంటాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు అన్నం వెంకయ్య, ప్రధాన కార్యదర్శి పాపగంటి రాంబాబు వేల్పుల రామయ్య పింగళి శ్రీనివాసరావు, మందా మదు, తదితరులు శ్రీనివాసరావు పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అక్కిశెట్టి శ్రీనివాసరావు కుటుంబంను అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ విభాగం కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా నాయకులు మద్దెల రవి, అర్జునరావు వెర్పుల రాములు, గ్రామ సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చితోటను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో ముదిగొండ గ్రామపంచాయతీ శివారి రాఘవాపురం గ్రామానికి చెందిన తోటకూరి వెంకటేశ్వర్లు అనే రైతు మిర్చితోటను వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా మిర్చితోటను కలయతిరిగి పరిశీలించారు. అనంతరం వారు రైతులతో మాట్లాడి మిర్చితోటల దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు,సలహాలు మేరకు పంటలు సాగు చేయాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ వి. శ్రీనివాస్, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి అబ్దుల్ ఆలీం, రాష్ట్ర ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్,ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్త టి సురేష్,మండల వ్యవసాయ అధికారి మందుల మందుల రాధ, వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ఎ శైలజ,శాస్త్రవేత్త రవి,రమణ,జి నగేష్,కె మీనాక్షి,ఎ వేణు,ఏఈఓ ఎ మౌనిక, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ఉపయోగించుకోండి

-డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ-ఖమ్మం

డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం వరంగల్, నల్గొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఉచితంగా ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేరినట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ తెలిపారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సన్నాహక సమావేశం ఖమ్మం డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కూరపాటి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి ఉచిత నమోదు కార్యక్రమం ఖమ్మం సుందరయ్య భవనంలో ఉంటుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ నమోదు కార్యక్రమానికి ఇన్చార్జిగా డివైఎఫ్ఐ నాయకులు పడిగల నాగేశ్వరావు ఉంటారని, నమోదు చేసుకోవలసిన వాళ్ళు ఆయా సర్టిఫికెట్లు తీసుకొని కార్యాలయం వద్దకు రావాలని , అవకాశం ఉంటే మ్యానువల్ అప్లికేషన్ నింపుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సన్నాక సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పునుగుల సుధాకర్, పడిగల నాగేశ్వరరావు, రమణ ,సాయి,తరున్ ,సునీల్, శభాష్ రెడ్డి, అరుణ్ ,ప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-ఖమ్మం

రేనాటి వీరుడు స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 217వ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఖమ్మం నూతన కలెక్టరేట్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో గురువారం వడ్డె ఓబన్న జయంత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి బి.జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు, కార్యదర్శి కుంచపు వెంకటేశ్వర్లు, రాష్ట్ర న్యాయకులు దేరంగుల బ్రహ్మం, పల్లెపు సోమరాజు మాట్లాడుతూ వడ్డెరలకి చరిత్రలో సముచిత స్థానం కల్పించిన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులకు పత్యేకంగా దన్యవాధములు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేరంగుల బ్రహ్మం, వల్లెపు సోమరాజు, బత్తుల నాగేశ్వరరావు, పిట్ల కృష్ణమూర్తి, ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షులు చింతల జ్యోతిబసు , చల్లా నాగులు , తమ్మిశెట్టి వెంకటనారాయణ, బత్తుల తిరుమల రావు, పల్లపు పు వెంకన్న, పల్లపు రాము, దేరంగుల రామారావు, బండారి సురేష్, కుంచపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో బాణాపురంలో వైఆర్ జికేర్, లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో సుఖవ్యాధులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా లింకు వర్కర్స్ స్కీం డిఆర్పి శివయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకొని, ఆరోగ్య విషయాలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆవుల రమలక్ష్మారెడ్డి, లింక్ వర్కర్స్ స్కీం మండల కో-ఆర్డినేటర్ కట్టెకోల సౌజన్య,ఏఎన్ఎంలు పద్మావతి,నర్సుబాయి,ఆశ వర్కర్లు విజయలక్ష్మి, సుజాత,వెంకటనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు హక్కు నమోదు చేసుకోండి

నవతెలంగాణ-కల్లూరు

త్వరలో జరిగే నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఎన్నికల జరగనున్నాయి. 2020 అక్టోబర్ నాటికి డిగ్రీ, డిప్లమాలో పట్టభద్రులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తాహా సిల్దార్ పులి సాంబశివుడు ఓ ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి ఆరో తేదీ లోపల దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు గారు 18 ఫారం పూర్తిచేసి దానికి డిగ్రీ, ఓటర్ ఐడి కార్డ్, సర్టిఫికెట్లు జిరాక్స్ పెట్టి దరఖాస్తు సమర్పించాలన్నారు. పట్టబద్రుడు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. గతంలో ఓటేసిన వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కల్లూరు



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తుండగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆన్లైన్ చేసేటప్పుడు ఎలాంటి తప్పులు లేకుండా నిదానంగా పరిశీలించి ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 22,000 దరఖాస్తులు ఆన్లైన్ చేయటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోపులో అన్ని దరఖాస్తులు ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పులి సాంబశివుడు, ఎండిఓ రవికుమార్, డిప్యూటీ తాహా సిల్దార్ జంగా బాబ్జి ప్రసాద్ పాల్గొన్నారు.

'సీతారామ'తో ఉమ్మడి ఖమ్మం 'సస్యశ్యామలం'

- 10లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లందుతాయి
- యాతాలకుంట టన్నెల్ పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, దమ్మపేట, అశ్వారావుపేటకు గోదావరి నీళ్లు
- వర్షాకాలాని కల్లా గోదావరి నీళ్లు పారాలి
- విలేకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-సత్తుపల్లి



సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కానుందని, 10లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లు అందుతాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట సమీపంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన అనంతరం మంత్రి తుమ్మల సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణతో కలిసి ప్రాజెక్టు నిర్మాణ కంపెనీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రధానంగా యాతాలకుంట టన్నెల్ పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు గోదావరి జలాలు అందుతాయన్నారు. 1.78 కిలోమీటర్లు పొడవున్నా ఈ టన్నెల్‌లో ఇప్పటికి 180 మీటర్లు మాత్రమే తొలచడం జరిగిందన్నారు. లూజ్ సాయిల్ కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా వేరే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పనులు జరుగుతున్నాయన్నారు. అదే హార్డ్‌రాక్ అయితే తొలచడం వేగంగా జరిగేదన్నారు. ఏది ఏమైనా ఎన్ని ఇబ్బందులొచ్చినా పనులు ఆగకుండా చూసుకోవాలని ఆయా ఏజెన్సీలు, సంబంధిత అధికారులను కోరారు. టన్నెల్‌కు రెండు వైపుల నుంచి పనులు జరగాలని కోరామన్నాని తెలిపారు. వచ్చే వర్షాకాలానికి కల్లా కుడిఎడంగా సత్తుపల్లి నియోజకవర్గం మొత్తానికి గోదావరి నీళ్ల అందుతాయన్నారు. సుమారుగా రూ. 13,517 వ్యయం కాగల ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 7,500 కోట్లు ఖర్చు పెట్టామని తుమ్మల చెప్పారు. ఉన్న నాలుగు పంప్‌హౌజ్‌ల్లో ఇప్పటికే మూడు పంప్‌హౌజ్‌లు పూర్త య్యాయన్నారు. అందులో బూర్గంపాడు, పూసుగూడెం, కమలాపురం పంప్‌హౌజ్‌లు పూర్తికాగా దమ్మపేట మండలం గండుగులపల్లి పంప్‌హౌజ్ నిర్మాణంలో ఉందన్నారు. అది పూర్తయితే దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు గోదావరి జలాలు వెళ్తాయన్నారు. పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారుల నిత్య పర్యవేక్షణ ఉండాలన్నారు. వైరా లింకు కెనాల్ పూర్తి చేయడం ద్వారా వైరాతో పాటు ఎన్నెస్పీకి గోదావరి జలాలు అందుతాయన్నారు. తద్వారా ఎన్నెస్పీ ఆయకట్టుతో పాటు లంకాసాగర్ ఆయకట్టుకు కూడా నీళ్ల పారతాయన్నారు. నాగార్జునసాగర్ జలాల విడుదలలో ఇబ్బందులొచ్చినా మన సీతారామతో నియోజకవర్గం మొత్తం నీళ్లందించవచ్చని తెలిపారు. అంతేగాక సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాలకు సాగునీటి కొరత రాదన్నారు. సీతారామ ప్రాజెక్టుతో అత్యధిక గిరిజన జనసాంద్రత ఉన్న ఉమ్మడి ఖమ్మంలో వాళ్లంతా అభివృద్ధి చెందుతారన్నారు. సీతారామ ప్రాజెక్టు అనేది ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల ఆశ, ఆకాంక్ష అన్నారు. నా కోరిక కూడా అదే అని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తామని ఆ శ్రీరామచంద్రుడిని కోరుకుంటున్నానని తుమ్మల అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈలు సురేశ్‌కుమార్, శ్రీనివాసాచార్యులు, ఆయా ప్రాజెక్టు ప్యాకేజీల నిర్మాణ కంపెనీ బాధ్యులు కేశవరాజు, కృష్ణంరాజు, సుమన్‌రావు, ఎస్వీఎస్ ఆదినారాయణ, ఆర్డీవో అశోకచక్రవర్తి, తహసీల్దారు యోగేశ్వరరావు, ఏసీపీ బొజ్జా రామానుజం, సీఐలు మోహన్‌బాబు, ఏనోస్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, చల్లగుళ్ల నరసింహారావు, ఎండీ కమల్‌పాషా, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 20న మధిర నియోజకవర్గం సదరం క్యాంప్

నవతెలంగాణ-బోనకల్

మధిర నియోజకవర్గంలోని బోనకల్, ఎర్రుపాలెం, చింతకాని, మధిర రూరల్, మధిర పట్టణం ప్రజలకు సంబంధించి ఫిబ్రవరి 20న ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో బయారపు అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 16న ఉదయం 11 గంటలకు స్లాట్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఓటరు నమోదు చేసుకోండి

నవతెలంగాణ-పెనుబల్లి

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్ట భద్రుల శాసనమండలి స్థానానికి జరగబోయే ఉప ఎన్నికల్లో పట్టభద్రులు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవచ్చని పెనుబల్లి తహసీల్దార్ గంట ప్రతాప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జనవరి 1 నాటికి డిగ్రీ పూర్తయిన వారు 2024 ఫిబ్రవరి 6 వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని ఫారం 18 ద్వారా ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. గెజిటెడ్ అధికారి ద్వారా గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్ నియోజకవర్గ ఓటర్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.


విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు



స్మార్ట్ కిడ్జ్‌లో సంక్రాంతి సంబురాలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు ఆనందోత్సవాలతో నిర్వహించారు. పంచె కట్టు, సాంప్రదాయ చీరకట్టులో పాఠశాల చిన్నారులు ఈ వేడుకల్లో నూతన శోభను సంతరించుకున్నారు. విద్యార్థులంతా భోగిమంటలు వేసి ఉత్సాహంగా గడిపారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి, బొమ్మల కొలువు పెట్టారు. పాఠశాల ప్రాంగణమంతా అందమైన రంగవల్లులతో ముస్తాబు, బసవన్నలా ఆటా పాటా, హరిదాసుల కీర్తనలు, కోడిపందాల జోరు, గాలిపటాల సందడి, గొబ్బెమ్మ పాటలతో వేడుకలు హోరెత్తాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడారు. బొమ్మల కొలువులో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హార్వెస్ట్ పాఠశాలలో సంక్రాంతి సంబురాలు..

నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. తొలుత తెలుగువారింట సంక్రాంతి కొత్త సందళ్ళతో భోగి మంటలలో, బొమ్మల కొలువులతో, రంగురంగుల రంగవల్లులతో, గొబ్బెమ్మలతో, హరిదాసు కీర్తనలతో సందళ్ళు నెలకొంది. ప్రతి సంవత్సరం ఆనవాయితీ అదే సంబురాలను కొనసాగిస్తూ హార్వెస్ట్ యాజమాన్యం ఎంతో ఉత్సాహంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఎంతో ఉత్సాహంగా సంబురాలను జరుపుకున్నారు. పాఠశాల ఆవరణను మామిడి తోరణాలతో వివిధరకాల పూలతో అలంకరించారు. పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపల్ పార్వతీరెడ్డి పండుగ వేడుకలను ప్రారంభించగా భోగి మంటలు వేసి పాఠశాల సిబ్బంది సందడి చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి రంగురంగుల ముగ్గులను అలాగే గాలిపటాలను ఎగురవేసి ఆద్యంతం పండుగ వాతావరణంతో కోలాహలంగా గడిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపల్ పార్వతీరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెచ్ఎమ్ అరుణదీప్తి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




త్రివేణి పాఠశాలలో...

నగరంలోని త్రివేణి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠశాల అధ్యాపకులు భోగి పళ్ళను పోసి ఆశీర్వదించారు. విద్యార్థినులు చక్కని రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బిళ్ళను పెట్టి గొబ్బి పాటలు పాడారు. విద్యార్థులు రకరకాల వేషధారణలను ధరించి పండగ సంబరాల్లో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి, పాలు పొంగిచ్చి పొంగళ్లను చేశారు. హరిదాసులు కోడి పందాలు మొదలైన అంశాలను ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సీఆర్ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో...

ఖమ్మం నగరం మమత ఆస్పత్రి రోడ్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో గురువారం సంక్రాతి సంబరాలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల రంగు రంగుల ముగ్గులతో హరిదాసుల హరినామస్మరణతో పల్లెటూరి పండగ నేపథ్యంలో కొత్త బియ్యం కలపోతలు, కోడిపుంజుల కొలహలం, గాలిపటాల రెపరెపలతో పదహారు అణాల ఆడపడుచుల అలంకరణతో నానాటికి కోల్పోతున్న నాగరికతను కళ్ళముందు కట్టినట్లు ఆవిష్కరించి చూపురుల కన్నులకి కట్టిపడేసాలా చేశాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



రెజోనెన్స్‌లో...

నగరంలోని శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్‌లో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. తొలుత చిన్నారుల కేరింతల నడుమ, హరిదాసుల ఆటపాటలతో, భోగిమంటలతో అంబరాన్నంటేలా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పల్లె వాతావరణాన్ని తలపించేలా రంగవల్లులు, గొబ్బెమ్మలు, గాలిపటాలు, బొమ్మల కొలువు, పిండి వంటకాలతో పాటు విద్యార్థుల హరిదాసుల వేషధారణలు, గంగిరెద్దుల ఆటలు మన సంస్కృతి, సాంప్రదాయలతో అందరిని ఆకట్టుకున్నాయి. బంతిపూలు, చెఱుకు గడలు, మామిడి తోరణాలతో రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ సంక్రాంతి వేడుకలకు అద్భుతమైన వేదికగా మారింది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండా కృష్ణవేణి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రసన్నరావు తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్ట్ స్ప్రింగ్లోఫ్ పాఠశాలలో...



నగరంలోని హార్వెస్ట్ స్ప్రింగ్లోఫ్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో తెలుగువారింట సంక్రాంతి కొత్త సందళ్ళతో భోగి మంటలలో, బొమ్మలకొలువులతో, రంగురంగుల రంగవల్లులతో, గొబ్బెమ్మలతో, హరిదాసు కీర్తనలతో సందళ్ళు జరుపుకోవడం ఆనవాయితీ అని ప్రిన్సిపల్ పార్వతీరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం. ఎంపి.రాజన్, ప్రీతీ, బి. చందన, యాకయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ అండ్ కళాశాలలో..

నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ అండ్ కళాశాల లో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు . పాఠశాలను ఎంతో అందంగా అలంకరించారు. అదే విధంగా పాఠశాలలో అనేక సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. అశోక్ రెడ్డి మాట్లాడారు .ఈ కార్యక్రమంలో పాఠశాల పిన్సిపాల్ వి. కిరణ్ కుమార్ , వైస్ పిన్సిపాల్ జి. ప్రసాదరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అరవింద హైస్కూల్‌లో...

నగరంలోని శ్రీనగర్ కాలనీ లోని అరవింద హైస్కూల్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థినులు, మహిళా సిబ్బంది రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి శోభను తెచ్చారు. ఈ కార్యక్రమంలో అరవింద స్కూల్ కరెస్పాండంట్ అంజాద్ ఖాన్, ప్రిన్సిపాల్ , డైరెక్టర్ గౌస్ పాషా మొహమ్మద్, ఇంచార్జ్ కుమారి, ఉపాధ్యాయులు - వినోద, సుశీల, ఇబ్రహీం, నారాయణ, లోకేష్, రాంబాబు, కరుణ, రఫతున్నిసా , మమత, సాలెహ తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి : లక్ష్య, అరుణోదయ, రమేష్ స్కై స్కూల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని లకు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భోగి మంటలు ఏర్పాటు చేసి, ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పెనుబల్లి ప్రభుత్వ హైస్కూల్లో కూడా సంక్రాంతి సంబరాలు విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు జానపద గేయాలతో నృత్యం చేసి ఆహుతులను అలరింపజేశారు. పాఠశాలలో పెద్ద ఎత్తున సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

తల్లాడ : మండలంలోని అన్నారుగూడెం జిల్లా



పరిషత్ ఉన్నత పాఠశాల, తల్లాడ యూనివర్సల్ ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, ముగ్గులు, భోగి మంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



మధిర

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో గురువారం యూపీఎస్ ఖమ్మంపాడు పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుమాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ చిన్నారులు ముగ్గుల పోటీల్లో ఎంతో సంతోషంగా, ఉల్లాసం గా పాల్గొన్నారని అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మదార్ కొమ్ము శ్రీనివాసరావు, బ్రహ్మ రెడ్డి, సునీత, జ్యోతి పాల్గొన్నారు.

భరత్ విద్యాసంస్థలలో సంక్రాంతి సంబరాలు

ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోనే భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా విద్యాసంస్థల కరెస్పాండెంట్, మున్సిపల్ వాయిస్ ఛైర్మెన్ శీలం విద్యాలత హాజరై ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్‌రెడ్డి, స్రవంతి, నాగరాజు, పాషా, అజీమ్, గణేష్, రమేష్, శశికళ, హెప్సిబా, విజయ్ భాస్కర్, పూజిత, రాజేశ్వరి, త్రివేణి, ప్రశాంతి, రాజ్యలక్ష్మి, త్రివేణి, జ్యోతి, సీత, శిల్ప, పద్మ, జ్యోతి, లావణ్య, నారాయణమ్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు : స్థానిక బాలాజీ హైస్కూల్‌లో సంక్రాంతి ప్రాముఖ్యతను చాటుతూ..భోగి మంటలు, రంగవల్లిలు, పిల్లల హరిదాసు వేషధారణలతో విశేషంగా విద్యార్థులు, తెలుగు పండుగల సాంప్రదాయాలను ఆచరిస్తూ సంబరాలు చేసుకున్నారు. ఉపాధ్యాయులు మన తెలుగు పండగల ప్రాముఖ్యత వివరిస్తూ వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మెన్ వలసల బాలాజీ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | జనవరి 12, 2024 | www.navatelangana.com

మార్గదర్శినిలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని మార్గదర్శిని పాఠశాలలో గురువారం ముగ్గుల పోటీలు ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థినీలు అనేక రంగులతో కూడిన ముగ్గులను అందంగా వేసి తమ కళను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరి రాంబాబు మాట్లాడారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు గోపి, వెంకన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలని పరిశీలించిన వ్యవసాయ అధికారులు

- రైతులకు సూచనలు చేసిన ఏఈఓ లక్ష్మణ్ రావు

నవతెలంగాణ-పినపాక

యాసంగి సీజన్‌లో వరి నాటేసే యంత్రంతో సాగుచేసిన పంట పొలాన్ని గురువారం పినపాక మండల వ్యవసాయ విస్తరణాధికారి కొమరం లక్ష్మణ్ రావు స్థానిక రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల ముక్కు సుబ్బారెడ్డి వరి పొలాన్ని పరిశీలించారు. వరిలో నీరు ఎక్కువ ఉండటం వలన నాచు వచ్చిందని ఈ నాచు నివారణకు వరిమలల్లో నీరు లేకుండా ఎండ కడితే నాచు లేకుండా పోతుందని తెలిపారు. నాచు చనిపోయిన అనంతరం నీళ్లు పెట్టినట్లయితే సరిపోతుందని రైతులు సూచించారు. ఈ కార్యక్రమంలో గీదా కొండయ్య, బాబు, అంకిరెడ్డి, తదితర రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ డోర్ డెలివరీ కోసం టెండర్ ఆహ్వానం

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో గ్యాస్ డోర్ డెలివరీ కోసం టెండర్ ఆహ్వానిస్తున్నట్టు జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం మాట్లాడుతూ సింగరేణి సూపర్ బజార్ నుండి ఉద్యోగుల నివాసాలకు రెండేండ్ల పాటు బీపీసీఎల్ అండ్ హెచ్పీసీఎల్ గ్యాస్ సిలిండర్లు డోర్ డెలివరీ కోసం యూనిట్ రేట్ పద్ధతి ప్రతిపాదికన టెండర్లను కోరినట్టు తెలిపారు. ఈ టెండర్ చెల్లింపు నెల వారిగా పంపిణీ చేయబడిన సిలిండర్ల సంఖ్య పై ఆధారపడి ఉంటుందని, ఈ టెండర్ వేయడానికి ఆసక్తి గలవారు ఏదైనా జాతీయ బ్యాంకు నుండి రూ.97 చెల్లించిన టెండర్ ప్రాసెసింగ్ రుసుముతో జీఎం కార్యాలయంలో పని దినాలలో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 04.30 గంటల వరకు పొందవచ్చని తెలిపారు. ధరఖాస్తులు పొందుటకు చివరి తేదీ ఈ నెల 30 సా.04.00 వరకు ఈ నింపిన ధరఖాస్తులు జనవరి నెల 11 నుండి 31 మ.12.00 వరకు స్వీకరించబడునని తెలిపారు. కావున ధరఖాస్తు దారులు తగిన ధృవీకరణ పత్రాలు, ఆధారాలతో సంప్రదించి దరఖాస్తు చెసుకోవాలన్నారు. వివరాలకు పర్చేజ్ విభాగం, జీఎం కార్యాలయం, ఇల్లందు ఏరియా నందు సంప్రదించగలరని తెలియజేశారు.

ఎస్సైను సన్మానించిన ఎంపీటీసీల బృందం

నవతెలంగాణ-ములకలపల్లి



ములకలపల్లి నూతన ఎస్సై రాజమౌళిని మండలంలోని ఎంపీటీసీల బృందం గురువారం శాలువాతో ఘనంగా సత్కరించింది. ఎంపీపీ మట్ల నాగమణి, వైస్ ఎంపీపీ కొదుమూరి పుల్లారావు, కోఆప్షన్ సభ్యులు షేక్ జబ్బార్, ఎంపీటీసీలు శెనగపాటి మెహరామణి, మడకం విజయ, సున్నం సునీత, కొర్రి భద్రం, తాటి తులసి, నూపా సరోజినిలు ఎస్సైను స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు

- రోడ్డు ఆక్రమిత విస్తరణ పనులను పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-పినపాక



మేడారం జాతరను దృష్టిలో ఉంచుకొని పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ప్రమాదాల నివారణలో భాగంగా ముందస్తుగానే చర్యలు చేపట్టామని తహసీల్దార్ వీరప్రసాద్, ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలియజేశారు. గురువారం ఈ బయ్యారం గ్రామపంచాయతీలో ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న రహదారి విస్తరణ పనులను తహసీల్దార్ పరిశీలించారు. రోడ్డు ఇరువైపులా 20 అడుగుల మేర శుభ్రం చేస్తున్నామని ఎంపీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్‌కు తెలియజేశారు. మరో నాలుగు రోజుల పాటు పనులు కొనసాగుతాయని ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలియజేశారు. ప్రమాదంలో పోయిన ఒక్క ప్రాణాన్ని సైతం తీసుకురాలేమని, ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం గొప్ప విషయం అని తహసీల్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు అశోక్, కృష్ణమూర్తి, జైపాల్ రెడ్డి, సాంబశివరావు నాగిని, వివిధ గ్రామ పంచాయతీల సెక్రటరీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం చొరవ చూపాలి

నవతెలంగాణ-మణుగూరు



ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం చొరవ చూపాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్‌కి ఈపీ ఆపరేటర్లు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు నాసర్ పాషా మాట్లాడుతూ యాజమాన్యంతో గుర్తింపు సంఘానికి జరిగే తొలి చర్చలలో ఈపి ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్య పరిష్కరించాలని కోరారు. వన్ టైం సెటిల్మెంట్ కాకుండా దీనికి కాలిక ప్రయోజనాల రీత్యా పర్మినెంట్ సర్క్యులర్ జారీ చేసే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు మేకల ఈశ్వర్, జానకి ప్రసాద్, కోడి రెక్కల శ్రీనివాస్, ఎస్.గట్టయ్య, నయమత్ హుస్సేన్, మల్లికార్జున్, హుస్సేన్ ఖాన్, నరహరి, ప్రతాపరెడ్డి, మాత్యు, కుత్బుద్దీన్, చిలుముల శ్రీనివాస్, ఎస్‌టీఆర్ నాయుడు, ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెంట్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు

నవతెలంగాణ-మణుగూరు



స్థానిక ఎక్సలెంట్ పైలెట్ కాలనీ బ్రాంచ్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మల కొలువు విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి అద్భుతంగా తీర్చిదిద్దారు. సంక్రాంతి అంటే గుర్తుకు వచ్చే రైతు, గాలిపటాలు, చంద్రుడు బొమ్మలతో కూడిన సంక్రాంతి ముగ్గు అందరినీ ఆకర్షించింది. నాటు కోడి పుంజులను ప్రాంగణంలో తిరుగాడేటట్లు చూసి నారు భోగి మంటలను ఆధ్యాత్మిక రీతిలో ఏర్పాటు చేసి విద్యార్థులు కోలాటాలు ఆడినారు. ఈ సందర్భంగా పొంగలిని వండి అందరికీ ఫలహారంగా పంచినారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన రంగోలిలు అందరినీ కనువిందు చేశాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎండి ఖాదర్ మాట్లాడుతూ ప్రతీ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను కొనియాడారు. రైతుల పంట ఇంటికి వచ్చేవేళ ఈ పండుగ వస్తుందని అందుకే ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ పండుగను ప్రముఖంగా జరుపుకుంటారన్నారు. పండుగకు సందర్భంగా ప్రతి అంశాన్ని విద్యార్థులు స్మరించే విధముగా తీర్చిదిద్దుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలు లేని ప్రజా సామాజిక తనిఖీ వేదిక

నవతెలంగాణ-టేకులపల్లి



టేకులపల్లి మండలం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజలు లేని ప్రజావేదిక కార్యక్రమం గురువారం నిర్వహించారు. 2022, 23కు సంబంధించి ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ఆడిట్ కమిటీ సభ్యులు గత సంవత్సరం డిసెంబర్ 26 నుండి జనవరి పదవ తారీకు వరకు పరిశీలన చేశామన్నారు. గ్రామపంచాయతీలలో జరిగిన నివేదికను వివరించారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది రికార్డులు సరిగా లేవని తదితర సమస్యలపై కూలీల నుండి ఫిర్యాదులు అందినట్లు ప్రజా వేదికలో తెలిపారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది నుండి రికవరీ రూ.28577, పెనాల్టీలు రూ.16000, క్వాలిటీ కంట్రోల్‌కి రిఫర్ చేసిన పనుల సంఖ్య 8గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు భూక్యరాధ, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి, రమణారావు, ఏఎంఈ కె.అనుష, నాగ ప్రకాష్, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి, పాల్వంచ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు పట్టభద్రులు దరఖాస్తులు చేసుకోవాలి

- కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంకు జరుగనున్న ఉప ఎన్నికకు సంబంధించి ఓటరు నమోదుకు పట్టభద్రులు దరఖాస్తులు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. గురువారం పట్టభద్రులు ఓటు హక్కు నమోదుపై ఐడీఓసీ కార్యాలయంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజక వర్గానికి సంబందించి ఓటర్ నమోదు దరఖాస్తులు స్వీకరణ, పరిష్కారంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని అన్నారు. ఓటర్ నమోదు గురించి ఓటర్లకు సహాయ రిటర్నింగ్ అధికారులు, డిసిగ్నేటెడ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి వారం నియోజక వర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటర్ జాబితా రూపకల్పన పై వివరించాలని అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజక వర్గానికి సంబందించి అర్హులైన పట్ట భద్రులు ఫారం 18లో ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేయాలని అన్నారు. ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ చేస్తామని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన తదుపరి ఫిబ్రవరి 24వ తేదీ నుండి మార్చి 14వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, మార్చి 29వ తేదీ వరకు వచ్చిన అన్ని క్లెయిమ్స్ పరిష్కరించి, ఏప్రిల్ 4వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని చెప్పారు. నవంబర్ 1, 2023 అర్హత తేదీకి 3 సంవత్సరాల ముందు అనగా నవంబర్ 2, 2020 నాటికి ఓటరుగా నమోదయ్యే వ్యక్తులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. డిగ్రీ ఫలితాలు ప్రకటించిన తేదీ అనగా నవంబర్ 1, 2023 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి పట్టభద్రులై ఉండాలని, అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు డిజిగ్నేటెడ్ అధికారి లేదా గెజిటెడ్ అధికారుల చే ధృవీకరణతో దరఖాస్తు చేయాలని అన్నారు. చిరునామా కోసం ఓటరు నమోదు ఫారంతో పాటు ఎపిక్ కార్డు, ఆదార్ కార్డు జిరాక్స్ ప్రతులు జతపరచాలని చెప్పారు. పట్టభద్రుల నూతన ఓటరు జాబితా తయారు చేస్తున్నందున గతంలో ఓటు హక్కు కలిగిన ఉన్న పట్ట భద్రులు సైతం తిరిగి నూతనంగా దరఖాస్తు చేయాలని చెప్పారు. పట్ట భద్రుల నియోజక వర్గం ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటరు నమోదు చేయాలని అన్నారు. దరఖాస్తులు పటిష్ఠ భద్రపరచాలని సూచించారు. పట్టభద్రులు ఓటు హక్కు నమోదుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలల్లో అవగాహన కల్పించాలని, ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని చెప్పారు. పట్టభద్రుల నియోజక వర్గ ఉప ఎన్నిక ఓటరు జాబితా రూపకల్పన ఎన్నికల సంగం నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ రాంబాబు, డిఆర్వో రవీంద్రనాథ్, అన్ని మండలాల తహసిల్దారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



అరుణోదయ విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-మణుగూరు

తెలుగు రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలతో కూడిన సంక్రాంతి పండుగను పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గురువారం ముందస్తుగా విద్యార్థుల చేత రంగవల్లులు, గాలిపటాలను ఎగరవేశారు. ఆటపాటలతో అలరించారు. అనంతరం కరస్పాండెంట మాదాస్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రకృతి సమ్మేళనంతో కూడుకొని ఉన్నదని అన్నారు. సంక్రాంతి పండుగ విశిష్టత తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలీలను రైతులను చేసింది వంకాయలపాటి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-చంద్రుగొండ



కూలీలను రైతులను చేసింది వంకాయలపాటి శ్రీనివాసరావు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. చంద్రుగొండలో గురువారం వంకాయలపాటి శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి సభ ఆయన స్తూపం వద్ద నిర్వహించారు. జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ లారీ వస్తే కూలికి పోయే కూలీలను రైతులు చేసిన ఘనత వంకాయలపాటి దక్కుతుందన్నారు. మండలంలో పోడు భూముల పోరాటంతో హక్కు పత్రాలు వచ్చాయన్నారు. ఆ భూములు అనేక రకాల పంటలు పండిస్తూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ ఆర్థికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తున్నారు అన్నారు. దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టులుంటారన్నారు. ఆయన సాధన కోసం కార్యకర్తలు ఉద్యమాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామిరెడ్డి, మండల కమిటీ సభ్యులు రామడుగు వెంకటాచారి, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, పెద్దిన్ని వేణు, వీరభద్రరావు, దాసరి సీతారాములు, కంభంపాటి కాంతారావు, చల్లపల్లి రాజా, నాగుల మీరా, అప్పాడి నాగేశ్వరరావు, శేషగిరి, ఉపతల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ వద్దకు చేరిన స్థలం పంచాయతీ

- ఆర్ఐ కేటాయించినా ఆటంక పరుస్తున్న ఆక్రమణ దారులు

నవతెలంగాణ-అశ్వారావుపేట



పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి అవసరం అయిన స్థలం రెవెన్యూ అధికారులు కేటాయించినా ఆక్రమణ దారులు ఆటంక పరచడంతో భవన నిర్మాణం నిలిచిపోయింది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధి హామీ నిధులతో మండలంలోని మద్దికొండ, అశ్వారావుపేట, కన్నాయిగూడెం, పాతల్లి గూడెం, నారంవారిగూడెం కాలనీ, రామన్నగూడెం, నారాయణపురం, వినాయకపురం, మల్లాయిగూడెం, తిరుమలకుంటలో 10 పంచాయతీలకు కార్యాలయ భవనాలను మంజూరు చేసారు. ఈ ఒక్కో భవనానికి రూ.20 లక్షలు అంచనా వ్యయంతో పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం పనులు చేపట్టారు. వీటిలో తిరుమలకుంట పంచాయతీ భవనం తప్ప మిగతా 9 భవనాలు దాదాపుగా పూర్తి కావచ్చింది. తిరుమలకుంటలో తహశీల్దార్ ఆదేశాలు మేరకు ఆర్ఐ పద్మావతి 250 గజాలు స్థలం కేటాయించారు. కానీ ఈ స్థలం ఆక్రమణ దారులు మాత్రం ఆ స్థలంలో పంచాయతీ భవనం నిర్మిస్తే ఊరుకునేది లేదని పట్టుబడుతున్నారు. ఇదే విషయాన్ని గురువారం పీఆర్‌డీ ఈ రామం తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ దృష్టికి తెచ్చారు. ఇదే విషయం తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ ఆర్ఐ పద్మావతిని పిలిచి వివరణ కోరారు. హద్దులుతో సహా స్థలం అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ విషయం పై సర్పంచ్ సున్నం సరస్వతిని వివరణ కోరగా ఆమె భర్త సమాధానం ఇచ్చాడు. ముగ్గురు పేద కుటుంబాల స్వాదీనం ఆ స్థలం ఉన్నదని, ఈ స్థలం తప్ప మాకు వేరే గత్యంతరం లేదని నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తే మరో స్థలం చూడాలని తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు సిఫార్స్ చేసారని తెలిపారు.

డిజిటల్ క్లాసులో విద్యార్థులు చదువు నేర్చుకోవాలి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులుకు డిజిటల్ క్లాసులో విద్య బోధన వచ్చే విధంగా అందరూ కృషి చేయాలని కెనరా బ్యాంక్ ఏజీఎం మాధవి అన్నారు. మండల పరిధిలోని యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆచంట రామారావు రూ.10.5 లక్షలు ఆర్థిక సహకారంతో డిజిటల్ క్లాస్ రూం నిర్మాణం పూర్తి కావడం ఆ గదిలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడంతో గురువారం మండల విద్య శాఖ అధికారి సత్యనారాయణ పాఠశాల హెడ్మాస్టర్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఏజీఎం మాధవి డిజిటల్ క్లాస్ రూంని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డిజిటల్ క్లాస్‌లో చదువుకోవాలని కంప్యూటర్ విద్య అనేది ఎంతో ముఖ్యమైనది అని ప్రతి ఒక్కరూ తమ హక్కుగా కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలని విద్యార్థులకు చూసించారు. సమాజంలో అన్నింటికంటే విద్య ఎంతో విలువైంది అని ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలని అన్నారు. సీఎస్ఆర్ నిధులుతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగింది. అని ప్రతి ఒక్క విద్యార్థి ఈ ల్యాబ్ ద్వారా కంప్యూటర్ విద్య నేర్చుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ అశోక్ కుమార్, డీఎం బాలకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ సురేష్, మార్కెటింగ్ మేనేజర్ అనుదీప్, పాటశాల చైర్మెన్ నాగేశ్వరావు, మాజీ హెడ్మాస్టర్ మోహన్ రావు, పాటశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబురాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-కొత్తగూడెం



జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు ననుసరించి జిల్లాలో చెకుముకి సైన్స్ సంబురాలు (పరీక్షలు) నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం చెకుముకి సైన్స్ సంబురాలకు సంబధించిన పోస్టర్స్‌ని జిల్లా విద్యాశాఖఅధికారి వెంకటేశ్వరాచారి, ప్రయివేట్ స్కూల్స్ మానేజ్మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండి లక్ష్మణ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ పరీక్షలు రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్, రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్తు, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ పరీక్షలు 8,9,10 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులకు, ప్రయివేట్ స్కూళ్లలో ఇంగ్లీష్ మిడియం విద్యార్థులకు నిర్వహించబడతాయని చెప్పారు. ఈ పరీక్షలు నాలుగు స్థాయిలలో ఉంటాయని చెప్పారు. స్కూలు స్థాయిల్లో జనవరి 19 తేదీన, మండల స్తాయిలో27వ తేదీన, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 3న, రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 9,10,11 తేదీలలో నిర్వహించబడతాయని తెలిపారు. ఈ పరీక్షలకు సంభందించి విధివిధానాలు తెలియజేసే పత్రికలు స్కూళ్లకు పంపామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జెవివి ఉపాధ్యక్షురాలు అడపాల కస్తూరి, రాష్ట్ర కమిటీ మెంబరు ఆర్.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, కోశాధికారి ఎం. మోహనరావు, కె.వీరభ ద్రం తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధించడం అందరి బాధ్యత

- సీడీపీవో జ్యోతి

నవతెలంగాణ-ములకలపల్లి



మానవ అక్రమ రవాణాను నిరోధించడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి అన్నారు. గురువారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై మండల పరిధిలోని జగన్నాధపురం రైతువేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణా, దీనికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో జ్యోతి, సంస్థ ప్రతినిధి ప్రమీల మాట్లాడుతూ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే పెద్దనేరంగా ఉందని, ప్రతిరోజూ ఎంతోమంది అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారని ఆవేదన చెందారు. ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని, ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికి దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. నేటికాలంలో యువత మొబైల్ ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్కు గురవుతున్నారని, అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెస్సేజ్, కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండి 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. గ్రామస్థాయిలో మహిళలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్య శృతి, అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ శివ, అనిల్, సూపర్వైజర్లు అరుణ, గంగజాలం, మేరీ మిరియం, హైమావతి, విజయ, మాధవీలత, నాగమణి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సుఖ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ఎయిడ్స్ క్షయ సుఖ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వైఆర్‌జి కేర్ లింక్ వర్కర్స్ సూపర్వైజర్ మధుబాబు అన్నారు. గురువారం తూరుబాక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎయిడ్స్, క్షయ, సుఖవ్యాధులపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సర్పంచ్ భూక్య చందు అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో మధుబాబు, లింక్ వర్కర్ జరీనా మాట్లాడుతూ హెచ్ఐవి అనేది అంటు వ్యాధి కాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎయిడ్స్ అనేది నాలుగు రకాలుగా సోకుతుందని, లైంగిక సంబంధాలు, రక్త మార్పిడి, కలుషిత సూది, ఇంజక్షన్లు, హెచ్ఐవి సోకిన తల్లి నుండి జన్మ నిచ్చిన బిడ్డకు ఎయిడ్స్ సోకుతుందని వారు తెలిపారు. ఎయిడ్స్ మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం రూ.4000 ఫించన్ కూడా ఇస్తుంది అని తెలిపారు. ఈ క్యాక్రమంలో ఏఎన్ఎంలు నాగమణి, పద్మ, ఆశా వర్కర్ బుబ్బులక్ష్మి, అంగన్వాడీ టీచర్లు విజయనిర్మల వనజాక్షి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చివరి వరకూ వేచి ఉండవద్దు

- ప్రయాణికులకు డిపో మేనేజర్ విజ్ఞప్తి

నవతెలంగాణ-మణుగూరు

సంక్రాంతి పండుగను పరిష్కరించుకొని ప్రయాణికులు పండుగ రోజు చివరి వరకూ వేచి ఉండకుండా తమ తమ వీలైన సమయాల్లో ప్రయాణాలు చేయాలని టీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో మేనేజర్ టి.స్వామి ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రకటన విడుదల చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మామూలు రోజుల్లోనే రద్దీ అధికంగా ఉంటుందని తెలిపారు.



సీఐటీయూ కృషి ఫలితంగా...

కార్మికులకు ఈఎస్ఐ అమలు ప్రక్రియ ప్రారంభం

- సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ఈఎస్ఐ బృందం
- (ఎస్ సికెఎస్-సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్‌సీకెఎస్) సీఐటీయూ చేసిన కృషి ఫలితంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించే కృషి ప్రారంభమైందని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు తెలిపారు. గురువారం హైదరాబాద్ ఈఎస్ఐఐ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం అధికారి టి.ప్రశాంత్, వరంగల్ బ్రాంచ్ మేనేజర్ జి.సాయిల బృందం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి సింగరేణి వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు కార్మికుల వివరాలను సేకరించారు. సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్ పర్సనల్ వరప్రసాద్, ఇతర పర్సనల్ అధికారులతో చర్చించారు. కొత్తగూడెం పర్యటనకు వచ్చిన ఈఎస్ఐఐ బృందాన్ని సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం (సిఐటియు) ప్రతినిధి బృందం కలిసి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐఐ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషిని ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సాధ్యమైనంత తొందరగా విచారణను పూర్తి చేసి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ మంజూరు చేసి ఈఎస్ఐ వైద్య సదుపాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతినిధి బృందంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి డి.వీరన్న, బ్రాంచ్ అధ్యక్షులు జి.శ్యాంకుమార్, తాజుద్దీన్, శ్రీను, పవన్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- పాలకవర్గం చివరి సమావేశంలో సర్పంచ్ రామయ్య

నవతెలంగాణ-ఇల్లందు



ఈ నెల 31తో ఐదు సంవత్సరాల గ్రామ పంచాయతీల పాలకవర్గ పాలన ముగియనుంది. ఈ సందర్భంగా గురువారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ పాలకవర్గం చివరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సువర్ణపాక రామయ్య, ఉపసర్పంచ్ తాటి రాంబాబు మాట్లాడారు. పంచాయతీని ఐదేళ్ల ఎంతో అభివృద్ధి చేస్తుకున్నామని అన్నారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పార్కులు, వైకుంఠధామం నిర్మించామని తెలిపారు. ప్రజలకు పారిశుద్ధ్యం మెరుగుపరచామని మంచినీరు అందించామని అన్నారు. ప్రభుత్వం కూడా పంచాయతీకి నిధులు మంజూరు చేసి సహకారాలు అందించిందని తెలిపారు. పాలకవర్గానికి సహకరించిన ప్రజలకు అధికారులకు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్లకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కార్యదర్శి మౌనిక, ఎంపీటీసీ తాటి యశోద, వార్డు మెంబర్లు మెంబర్లు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారుల వాహనాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-టేకులపల్లి

ఈ నెల 9న టేకులపల్లి మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను అడ్డుకొనుటకు ప్రయత్నించిన ఫారెస్ట్ అధికారుల వాహనాన్ని డ్యామేజ్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం... లాలు తండకు చెందిన నునావత్ హాతిరామ్ అనిశెట్టిపల్లి ఇల్లందు పట్టణానికి ఇసుక రవాణా చేస్తుండగా ఇల్లందు ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా అధికారుల ఇన్నోవా కార్‌ను ఢీ కొట్టి పారిపోయినట్లు తెలిపారు. అక్రమంగా రవాణా చేస్తూ ఫారెస్ట్ అధికారుల విధులకు ఆటంకం పరిచి కారును డామేజ్ చేసిన హతిరామును అరెస్ట్ చేసే ఇల్లందు సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్య తీసుకుంటామని ఎస్ఐ రమణ రెడ్డి ఇసుక ట్రాక్టర్ల యజమానులకు తెలిపారు.

ఏఎన్ఎంల అసభ్యకర పదజాలం

- బోరున విలపించిన ఈఎంటి

నవతెలంగాణ-అశ్వాపురం

మండల కేంద్రంలోని 108లో ఈఎంటిగా (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్)గా పనిచేస్తున్న స్రవంతిపై అశ్వాపురం పిహెచ్‌సి పరిధిలోని ఏఎన్ఎంలు అందరూ కలిసి మూకుమ్మడి అసభ్యకర పదజాలంతో దూషించారని గురువారం ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తనకు జరిగిన అన్యాయాన్ని విలేకరులకు తెలియజేస్తూ బోరున విలపించింది. అసలు ఏం జరిగిందంటే ఈఎంటిగా పనిచేస్తున్న మహిళ బుధవారం ఒకే విషయమై మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వెళ్ళింది. అక్కడ ఓ కుర్చీలో కూర్చొని కేసుకు సంబంధించిన ఓ ఫైల్‌ను పూర్తి చేస్తుండగా సివిల్ డ్రెస్‌లో ఏఎన్ఎం అక్కడికి వచ్చింది. పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది. దీంతో ఆ ఈఎంటి మేడం మీరు ఆశాన అని అడిగింది. దీంతో తీవ్ర కోపానికి గురైన ఏఎన్ఎం ఆమెను అసభ్యకర పదజాలంతో మాట్లాడటంతో పాటు గురువారం తోటి ఏఎన్ఎంలకు విషయాన్ని చెప్పి మరో మారు హాస్పిటల్‌కి వెళ్లిన స్రవంతి పై మాటల దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది.



రూప స్కూల్లో ఉత్సాహంగా సంక్రాంతి సంబురాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పట్టణంలోని రూప స్కూల్ ఆవరణలో ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబురాలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలుతో పాటు రంగులతో ముగ్గులు హరిదాస్ కీర్తనలు చెరుకు గడలుతో పాటు ప్రత్యేకంగా హరిదాసు వేషధారణలో సంక్రాంతి ప్రత్యేకతను తెలియజేసే విధంగా పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ ముని కేశవ్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రూప స్కూల్లో సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులకు విద్యతో పాటు మారుతున్న టెక్నాలజీ అందించడమే కాక మన సంస్కృతి సంప్రదాయాలను కూడా తెలియజేయాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల తల్లితండ్రులు ఉత్సాహంగా పాల్గొనగా సంప్రదాయ దుస్తులలో ఆటపాటలతో విద్యార్థులు కనువిందు చేశారు.

వైఎంసీ మెగా టోర్నీకి సర్వం సిద్ధం

- రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల కేంద్రంలో ప్రతి ఏడాది యూసఫ్ జ్ఞాపకార్థంతో నిర్వహిస్తున్న వైఎంసీ క్రికెట్ టోర్నమెంట్, 15 ఏళ్ళు పూర్తి చేసుకొని ఈ ఏడాది 16వ ఏడాది నిర్వహిస్తున్న క్రికెట్ టోర్న మెంట్‌లో బాగంగా వైఎంసి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ టోర్నమెంట్ ఈ నెల 12వ తేదీ ప్రారంభం కానుంది. ముందుగా టోర్నీ బ్రోచర్ బూర్గంపాడు ఎస్ఐ రాజ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి, అనంతరం టోర్నీ గ్రౌండ్‌లోని పిచ్ పై చిత్రంతో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ప్రకటన విడుదల చేశారు. ఈ టోర్నమెంట్‌కి ప్రతి ఏడాది మాదిరిగా అద్భుతమైన విన్నర్, రన్నర్ ట్రోఫీలు డేగల రాజు యాదవ్ ఇవ్వనున్నారు. మొదటి క్యాష్ ప్రైజ్ మనీ రూ.30 వేలను బూర్గంపాడు సొసైటీ డైరెక్టర్ బొల్లు రవి కుమార్, రెండవ క్యాష్ ప్రైజ్ మనీ రూ.15వేలను సారపాక గ్రామానికి చెందిన గౌరీ సివిల్ సప్లై కాంట్రాక్టర్ గుంటుపల్లి రామకృష్ణ అందజేయనున్నారు. ప్రతి మ్యాచ్‌కి మ్యాన్, ఆఫ్, ది మ్యాచ్ అవార్డులు బూర్గంపాడు సర్పంచ్ సిరిపురపు స్వప్న ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ముఖ్య సలహాదారులు ఎండి సోహెల్ పాషా, గొనెల సర్వేశ్వరరావు, గోనెల నాని భజన సతీష్, బొల్లు రవి కుమార్, ఆర్గనై జింగ్ కమిటీ సభ్యులు భజన ప్రసాద్, అబ్దుల్ సలీం, కన్నెబోయిన సారథి, మందా ప్రసాద్, బబ్బు రాయుడు, సత్తిపండు, నాగరాజు, కార్తిక్, కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు.

కల్పవృక్ష నారసింహస్వామిని దర్శించుకున్న భక్తులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాద్రి దివ్య క్షేత్రంలో కొలువై ఉన్న కోరిన కోర్కెలు తీర్చే కల్ప వృక్ష నారసింహసాల గ్రామ మూర్తికి ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో విశేష పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ ముడుపులు కట్టుకుంటే కోరిన కోర్కెలు నెరవేరతాయనే విశ్వాసంతో వివిధ ప్రాంతాల నుండి ఎంతోమంది భక్తులు రావడంతో కల్ప వృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమం ప్రతినిత్యం భక్తులతో కిటకిటలాడుతుంది. గురువారం అమావాస్యను పురస్కరించుకొని వందల మంది ముడుపులు కట్టుకట్టారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాక వివిధ ప్రాంతాల నుండి భక్తుల రాకతో సందడిగామారిందని ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ కృష్ణచైతన్య స్వామి అన్నారు. సుదూర ప్రాంతాలనుండి వచ్చే భక్తులకు ప్రతినిత్యం అన్నప్రసాదాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్పవక్ష నారసింహ ఆశ్రమ నిర్వాహకులు డా.కృష్ణ చైతన్య స్వామి, సంస్థ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాంజా దారాలను విక్రయిస్తే చర్యలు

- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని

నవతెలంగాణ-పినపాక

మాంజా ధారాల విక్రయం, వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించిందని ఈ బయ్యారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని తెలిపారు. చైనా మాంజా విక్రయాలు గుట్టుగా సాగుతున్నాయని సమాచారం రావడంతో వెంటనే అటవీశాఖ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం పినపాక మండల వ్యాప్తంగా పలు దుకాణాలను అటవీ శాఖ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. విక్రయిస్తున్న పతంగులు, దారాలు, మాంజాలను పరిశీలించారు.

అక్రమార్కులపై అటవీశాఖ ఉక్కు పాదం

- అక్రమంగా తరలిస్తున్న రూ.2లక్షల కలప పట్టివేత

నవతెలంగాణ-ఇల్లందు



అటవీ రేంజ్ పరిధిలో ఎల్లాపురం బీట్ అటవీ ప్రాంతం నుంచి ఇల్లందు ప్రాంతానికి అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్న టేకు కలపను ఇల్లందు ఎఫ్డిఓ వెంకన్న ఆధ్వర్యంలో గురువారం పట్టుకున్నారు. అక్రమ కలప తరలింపు పై విశ్వసనీయ సమాచారంతో ఇల్లందు ఎఫ్డిఓ వెంకన్న ఆధ్వర్యంలో మూడు బృందాలు ఇల్లందు గుండాల అటవీ రేంజ్ పరిసరాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన కొంత మంది వ్యక్తులు అటవీ ప్రాంతం నుంచి వాహనంలో సుమారు రెండు లక్షల విలువైన టేకు దుంగలను తీసుకొని ఇల్లందు ప్రాంతం వైపు వస్తుండగా ఎఫ్‌డీఓ వెంకన్న ఆధ్వర్యంలో ఇల్లందు శివారు సుదిమల్ల వద్ద వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు.

యువతను పెడదోవ పట్టిస్తున్న ఇసుక రవాణా

నవతెలంగాణ-టేకులపల్లి



లక్ష్మీదేవి పల్లి మండలంలోని అనిశెట్టి పల్లి సమీపంలో ఉన్న మొరేడువాగునుండి టేకులపల్లి మీదుగా ఇల్లందు పట్టణానికి నిత్యము జరుగుతున్న ఇసుక రవాణా వలన ట్రాక్టర్ల డ్రైవర్లగా మారి యువత పెడదోవ పడుతున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో నిద్ర ఆపుటకు గుట్కాలు, మద్యం యథేచ్ఛగా వాడకం, మత్తు పదార్థాలకు బానిసలుగా మారి అనారోగ్యం పాలవుతున్న యువకులు, గిరిజన మారుమూల గ్రామాలలో నిరుపేద కుటుంబాలలోని 18 ఏండ్లు గల యువతను ఇసుక ట్రాక్టర్‌లోనికి ఇసుకను ఎత్తే కూలీలుగా మారుతున్నారు. వారిని మత్తు పదార్థాలకు అలవాటు చేసి యువతను ఇసుక వ్యాపారస్తులు పెడదోవపట్టిస్తున్నారు. మండలం నుంచి ప్రతిరోజు సుమారు 60 వరకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక బయటకు రాత్రి సమయంలోనే రవాణా చేస్తుండడంతో, ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలు మత్తు పదార్థాలకు అలవాటు పడి అతివేగంగా వెళ్తున్నారు. సైడ్ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత రెండు సంవత్సరాల కిందట ఇసుక కోసం ట్రాక్టర్ అతివేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న నీటి కుంటలో పడి యువకుడు మృతి చెందాడు. అతని భార్య, పిల్లలు అనాథలయ్యారు. మండలంలో ఇసుక పనులకు పోయి మత్తు పానీయాలకు అలవాటు పడి కుటుంబ సభ్యుల మాట వినక అనారోగ్యానికి గురై కుటుంబాలలో విషాదం నింపుతున్నారు. దీనిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని వారిని అదుపు చేయకపోతే మున్ముందు కాలంలో అనేకమంది యువత చెడు అలవాట్లకు దగ్గరవుతారు. గిరిజన యువతే లక్ష్యంగా పనులు, మండలంలో ఇసుక రవాణా ట్రాక్టర్ల ద్వారా జరుగుతుంది. దీనికోసం గ్రామీణ ప్రాంతాలలో పదవ తరగతి లోపు చదువుకొని ఉన్న యువకులకు జల్సాలకు అలవాటు చేసి తద్వారా వారికి అవసరమైనప్పుడల్లా జల్సాలకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చి రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇసుక లోడులకు, ట్రాక్టర్ డ్రైవింగ్ తీసుకెళ్లి యువతను పెడదారి పట్టిస్తున్నారు. అధికారులను సైతం ఎదిరిస్తున్న ఇసుక రవాణా దారులు యదేచ్ఛగా రాత్రి సమయంలో అక్రమ ఇసుక రవాణాతో జేబులు నింపుకుంటున్నారు. మండలంలో పుష్కలమైన ఇసుక వనరులు ఉన్నాయి. శంభుని గూడెం, చంద్రు తండా, సంపత్ నగర్, మేళ్లమడుగు, గంగారం, బొమ్మనపల్లి ప్రాంతాలలో సహజంగానే ఇసుక తీసుకెళ్ళుటకు దారులు ఉన్నాయి. కానీ రాత్రి సమయంలో ఇసుకాసురులు తరలిస్తుంటే వారికి అడ్డువచ్చిన అధికారులను సైతం బెదిరించి వారిపై దాడికి యత్నం చేసిన సందర్భాలు ఉన్నాయి. దీనితో పలుమార్లు అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. రాత్రి సమయంలో అతివేగం, అక్రమ ఇసుక రవాణా సమయంలో వెళ్తున్నాయి. దీనికి తోడు అతివేగం, అజాగ్రత్తతో వేగంగా వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు రాత్రి సమయంలో బయటకు రావాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ట్రాక్టర్లు వేగంగా వెళుతూ అవి చేసే శబ్దానికి నిద్ర పట్టక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పరిసర ప్రాంతాల ప్రజలు అధికారులు పట్టించుకోవాలని ఉన్నత అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఇకనైనా మైనింగ్ రవాణా శాఖ పోలీస్ శాఖ యంత్రాంగం చర్యలు తీసుకొని యువత పెడదారి పట్టకుండా చూసు కోవాల్సిందిగా మండల ప్రజలు కోరుతున్నారు.



అనుదినం జనస్వరమే 'నవతెలంగాణ'

- క్యాలెండర్ ఆవిష్కరణలో మున్సిపల్ చైర్మెన్ డివి

నవతెలంగాణ-ఇల్లందు

సమస్యలను వెలికితీస్తూ ప్రజావాణిగా ప్రభుత్వం దృష్టికి తెస్తు అనుదినం జనస్వరంలా 'నవతెలంగాణ' వెలువడుతోందని సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బేటీ భార్గవి అన్నారు. చైర్మెన్ నివాసంలో గురువారం నవతెలంగాణ 2024 క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనేక శీర్షికలతో నవతెలంగాణ దినపత్రిక అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటోందన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువత, రాజకీయ నాయకులకు, మేధావులకు ఎంతగానో తోడ్పడుతోందన్నారు. సంపాదకీయాలు, మానవీయ కోణాలు, ముఖ్యమైన అంశాలపై కథనాలతో ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయన్నారు. దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖ న్యాయవాది కలవల సుధాకర్, నవతెలంగాణ సీనియర్ విలేకరి ఎస్.వేణుగోపాల్, యూత్ నేతలు మెరుగు కార్తీక్, వినోద్, సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ చేసిన కృషి ఫలితమే

- (ఎస్ సికెఎస్-సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు
- అధికారులకు ధన్యావాదాలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్-సీకెఎస్) సీఐటీయూ చేసిన కృషి ఫలితంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించే కృషి ప్రారంభమైంది. అనేక ఏండ్లుగా కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకుల పోరాట ఫలితంగా ఇఎస్ఐ ఏర్పాటుకు అడుగులు పడ్డాయని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు తెలిపారు. 2022 సెప్టెంబర్‌లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలతో చేసిన ఒప్పందంలో ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించేందుకు అంగీకరించింది. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం దీనికోసం సింగరేణి డైరెక్టర్ (పా)ను అనేకసార్లు కలిసి ఒత్తిడి తేవడం జరిగింది. ఫలితంగా సింగరేణి యాజమాన్యం 26 నవంబర్ 2022న ఈఎస్ఐఐ రీజినల్ డైరెక్టర్‌కు లేఖను రాసింది. ఈఎస్ఐ రీజినల్ అధికారులు సింగరేణిలో ఈఎస్ఐఐ అమలుకు అనుమతి కోరుతూ ఢిల్లీకి లేఖ రాశారు. 2023 జూన్ 13న సింగరేణి ఎన్నికల నిమిత్తం సెంట్రల్ లేబర్ అధికారులు నిర్వహించిన మీటింగ్ వద్ద ధర్నా నిర్వహించిన సందర్భంగా నాటి డైరెక్టర్ నేటి సి అండ్ ఎండి ఎన్.బలరాం నాయక్ జోక్యం చేసుకున్నారు. స్వయంగా ఈ ఎస్ఐ రీజినల్ డైరెక్టర్‌తో ఫోన్లో మాట్లాడటం జరిగింది. సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం (సిఐటియు) ఒకపక్క సింగరేణి అధికారులను, డైరెక్టర్‌లను కలుస్తూ వినపత్రాలు ఇస్తూనేఉంది. మరోపక్క ఈఎస్ఐ అధికారులను కలిసి ఒత్తిడి చేసింది. 26 సెప్టెంబర్ 2023, 3 నవంబర్ 2023, 14 నవంబర్ 2023, 19 డిసెంబర్ 2023న నాలుగు సార్లు హైదరాబాదు లోని ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో అధికారులను కలిశారు. వారితో చర్చించి, వారిపై ఒత్తిది తెచ్చింది. ఢిల్లీలో ఉన్న ఫైల్ పెండింగ్ విషయంలో చొరవ తీసుకుని ఈఎస్ఐఐ అధికారులతో సిఐటియు మాట్లాడింది. సిఐటియు జాతీయ కార్యదర్శి, ఈఎస్ఐ బోర్డు మెంబర్ ప్రశాంత్ నంది చౌదరి 14నవంబర్ 2023న ఈఎస్ఐ అధికారులకు లేఖ రాసి వారితో చర్చించారు. డిసెంబర్‌లోను వారితో మాట్లాడారు. ఫలితంగా ఈఎస్ఐ ఢిల్లీ కార్యాలయం నుండి అనుమతి లభించింది. అనుమతి వచ్చిన వెంటనే హైదరాబాదులోని రీజినల్ డైరెక్టర్ కార్యాలయం నుండి ఈ విసయంలో అధికారిని కేటాయించి పని ప్రారంభించారు.

అధికారులకు ధన్యవాదాలు

సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ఈ ఎస్ఐఐ సదుపాయం కల్పించడానికి అంగీకరించి దాని అమలు కోసం వ్యక్తిగతంగా ప్రత్యేక శ్రద్ధను పెట్టి కృషిచేసిన నాటి డైరెక్టర్ (పా) నేటి సిఎండి ఎం.బలరాం నాయక్‌కి దీని కోసం కృషి చేసిన జనరల్ మేనేజర్ పర్సనల్, ఇతర పర్సనల్ అధికారులందరికీ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సిఐటియు) ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తుంది. ఈఎస్ఐ అమలు చేసేందుకు కృషి చేసిన ఈఎస్ఐ బోర్డు మెంబర్ అండ్ సిఐటియు జాతీయ ప్రధాన జాతీయ కార్యదర్శి ప్రశాంత్ నంది చౌదరి, ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం హైదరాబాద్ అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. గురువారం ఐడీఓసి సమావేశపు హాలులో సిఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియపై పౌరసరఫరాల అధికారులు, సంస్థ మేనేజర్, మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు మిల్లర్లకు కేటాయించిన లక్ష్యం మేర సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. సిఎంఆర్ ప్రక్రియ పై పౌర సరఫరాల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఇంకనూ జాప్యానికి తావు లేకుండా మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. పెండింగ్ ఉన్న మిల్లర్ల నుండి త్వరితగతిన మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయుటకు ఇతర మిల్లులకు కేటాయింపు చేయాలని పౌర సరఫరాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, పౌర సరఫరాల అధికారి రుక్మిణి దేవి, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ బాబు, పౌర సరఫరాల శాఖ నాయబ్ తహసీల్దార్లు, మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు జుగల్ కిషోర్, కార్యదర్శి రాజేందర్, కోశాధికారి ఆనంద్, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు మున్సిపాలిటీకి మరో అరుదైన గౌరవం

- చైర్మెన్, పాలకవర్గానికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కోరం

నవతెలంగాణ-ఇల్లందు

స్వచ్ఛ సర్వేక్షన్ స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తమ మున్సిపాలిటీ జాబితాలో ఇల్లందు ఓడీఎఫ్ ప్లెస్‌ప్లెస్ మున్సిపాలిటీకి 11వ ర్యాంకు సాధించింది. ఇల్లందు పురపాలక సంఘానికి 11వ ర్యాంకు సాధించడం చాలా గర్వకారణమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును, పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇల్లందు పురపాలక సంఘం ఇంతటి ఘనత సాధించడం చాలా సంతోషదాయకమని కొనియాడారు. పాలకవర్గం పట్టణ ప్రజల కృషివల్లే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచగలుగుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి దేశ స్థాయిలో టాప్ ప్లేస్‌లో ఉండాలని ఆశ భావం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ అధికారులు పాలకవర్గం పట్టణ ప్రజలు సమిష్టి కృషివల్లే ఇదంతా సాధ్యమైందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత బాధ్యతగా పనిచేసే మునుముందు దేశ స్థాయిలో అవార్డు అందుకుంటామని తెలిపారు.

సింగరేణి కార్మికులకు కృతజ్ఞతలు

- కార్మికుల హక్కులను కాపాడుతాం

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిపించినందుకు కార్మికులకు ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 100శాతం ఎన్నికల మ్యానుఫ్యాక్చర్ అమలు చేస్తామని కార్మికుల హక్కుల కోసం పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు. గురువారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియాలోని పీకే ఓ సీ2, కేసీహెచ్‌పీ ఎంఎస్‌ఓలలో ఫిట్ మీటింగులు జరిగాయి. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ డిసెంబర్ 27న జరిగిన సింగరేణి గుర్తింపు ఎన్నికలలో ఏఐటీయూసీకి అత్యధిక మెజారిటీ ఇచ్చి గుర్తింపు హోదా ఇచ్చినందుకు కార్మిక వర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఎన్నికలలో రాజకీయ జోక్యం ఉండకూడదని పిలుపునిచ్చామని అదే ఎజెండాతో వచ్చిన సర్కారు సంఘం, మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రచారం నిర్వహించారని అన్నారు.

మణుగూరు ఏరియాలో నైతిక విజయం దే అని అన్నారు. గడచిన 12 సంవత్సరాలుగా సింగరేణిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త బొగ్గు బావిని కూడా ప్రారంభించలేదని అన్నారు. సీఅండ్ఎండీ కంపెనీ ఆదాయం అంతటిని ప్రభుత్వానికి కట్టబెట్టారని అన్నారు. సింగరేణిలో జరిగిన ఆర్థిక దోపిడిపై విచారణ జరిపి సంబంధితులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి సింగరేణిలో నూతన గనుల ప్రారంభించడానికి, సంస్థ, కార్మికుల సంక్షేమం కోసం సరియైన సూచనలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య, జనరల్ సెక్రటరీ కె.రాజ్ కుమార్, బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రామ నరసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కామ్రేడ్ జి.పుల్లారావు, ట్రెజరర్ ఆవుల నాగరాజు, ఆఫీస్ బేరర్స్ ఆదర్ల సురేందర్, అబ్దుల్ సుభాని, సురేందర్ రావు, ఫిట్స్ సెక్రటరీలు కోడి రెక్కల శ్రీనివాసరావు, గుంపెన శ్రీనివాసరావు, సాయి ప్రకాష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తున్న దానధర్మ ట్రస్ట్ సేవలు

- చైర్మెన్ గంట రాధా

నవతెలంగాణ-మణుగూరు



తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ తెలుగు రాష్ట్రాలలో దానధర్మ ట్రస్ట్ సేవలు విస్తరిస్తున్నాయని చైర్మెన్ గంట రాధా తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అశ్వారావుపేట, రాజమండ్రి, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలో సీతంపేట గ్రామంలో చలికాలంలో గజగజ వణుకుతున్న అనాథలు, పేదలకు విస్తృతంగా దుప్పట్లు పంపిణీ చేసామని రాధ తెలిపారు. ప్రజలకు సేవలు చేసేందుకు అవకాశం కల్పించిన పెద్దలకు, దాతలకు, మణుగూరు ప్రాంత ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేట మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులుగా ఎన్నికయిన జారె ఆదినారాయణని మర్యాదపూర్వకంగా వారి స్వగృహం గండుగులపల్లిలో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, సభ్యులు ఎమ్మెల్యే జారెని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం 2024 నూతన డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రతినిధులు చక్రపు సూర్యనారాయణ, హైదర్, లక్ష్మమ్మ, రామచంద్రరావు, కాకా వీరభద్రం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులు మాఫీ చేయించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-టేకులపల్లి

గత సంవత్సరం నవంబర్ 24న టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్ కొత్త పెట్రోల్ బంకు దగ్గర ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ బోడా హరి (25) స్థానికులు కొత్తగూడెం ఆసుపత్రికి తరలించి తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని కిమ్స్ హాస్పిటల్‌కి తరలించారు. కిమ్స్‌లో హరికి గొంతు ఆపరేషన్, మెదడులో రక్తం గడ్డ కట్టడంతో బ్రెయిన్ ఆపరేషన్ చేశారు. మొత్తము హాస్పిటల్‌లో, ఆపరేషన్ మెడికల్ బిల్, రూమ్ రెంట్ అంతా కలిపి రూ.6,20,000 కాగా రెక్క ఆడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబంలో వున్న హరి పరిస్థితిని తెలుసుకున్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కిమ్స్ హాస్పిటల్ యజమాన్యంతో ఫోన్లో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితిని వివరించి ఇప్పటివరకు అయిన ఖర్చు రూ.6, 20,000 వారు కట్టలేని స్థితిలో ఉన్నారు.

అని తెలిపి ఆ మొత్తాన్ని మాఫీ చేయించారు. ఇంతటి గొప్ప సహాయాన్ని తమ కుటుంబానికి చేసినందుకు హరి తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యం, చిలికి, భార్య లలిత, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు, రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, కోరం సురేందర్‌కు తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 14న ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా 14వ తారీకు జరిగే ముగ్గులు పోటీలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు సుధీర్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, సైదులు, ప్రవీణ్, బాబు, తాటి రాజు, గోగ్గల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL, JUNIOR CIVIL JUDGE AT KOTHAGUDEM
E.P.No. 3/2020

BETWEEN:
Duggempudi Narasimha Reddy .....*D.Hr.*,
AND
Barnala Kurmeswara Rao .....*J.Dr.*,

NOTICE

To,
Barnala Kurmeswara Rao, S/o. Paidaiah, age 68 years, occ: Retd. Teacher, R/o: H.No.1-1, Burgampadu Town and mandal, Bhadradri Kothagudem District.

That D.Hr., filed the above EP against the J.Dr. Inspite of notice sent to the J.Dr, the J.Dr., is evading to receive the notice on one or other pretext. Take note that the above case is posted on 29-01-2024. If the J.Dr., fails to appear before this Hon'ble Court either person or through the counsel on 29-01-2024 at 10.20 A.M, failing which matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT.//
N. RAMA KRISHNA RAO
P. NAGESWARA RAO
Advocates for D.Hr., Kothagudem

Kothagudem
Date: 11-01-2024

నవతెలంగాణ
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
9
శుక్రవారం | జనవరి 12, 2024 | www.navatelangana.com

మున్నూరుకాపు సంక్షేమ సంఘం

జూలూరుపాడు అధ్యక్షునిగా రామిశెట్టి రాంబాబు

నవతెలంగాణ-జూలూరుపాడు

మున్నూరు కాపు సంక్షేమ సంఘం జూలూరుపాడు మండల అధ్యక్షునిగా రామిశెట్టి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా మల్లెల నాగేశ్వరరావు, కోశాధికారిగా రామిశెట్టి నాగేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జూలూరుపాడు మండల కేంద్రంలోని ఏవిఆర్ ఫంక్షన్ హాల్ నందు జూలూరుపాడు మండల మున్నూరు కాపు సంక్షేమ సంఘ సమావేశం ఆ సంఘం గౌరవ అధ్యక్షులు ముత్తినేని రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంక్షేమ సంఘం జూలూరుపాడు మండల నూతన కమిటీని సమావేశానికి హాజరైన సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులతోపాటు గౌరవ అధ్యక్షులుగా ముత్తినేని రామయ్య, గౌరవ సలహాదారులుగా బాపట్ల మురళి, రోకటి సురేష్, ఉపాధ్యక్షులుగా గోపు రామకృష్ణ, తాటికొండ వెంకటరాం ప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఉసికల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా మద్దిశెట్టి వంశీ, మద్దిశెట్టి ప్రకాష్, రెడ్డిబోయిన గోవిందు, వడ్డే సత్యనారాయణ, పాతర్లపాటి వెంకటేశ్వర్లు, బండారు పుల్లారావు, ఆనగంటి ధనవయ్య, పెంటికల వీరబాబు, చౌడం నరసింహారావు, కుప్పాల శ్రీను, ముళ్ళపాటి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాపట్ల మురళి, నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు రామిశెట్టి రాంబాబులను మండల మున్నూరు కాపు సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ మండలంలో మున్నూరు కాపుల అభివృద్ధికి సంక్షేమానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

ఉద్యమకారులకు ఇండ్లు, స్థలాలివ్వాలి

నవతెలంగాణ-జూలూరుపాడు

తెలంగాణ సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న నాయకులకు పెన్షన్, ఇళ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని మండల కేంద్రమైన జూలూరుపాడు మండలం, తహశీల్దార్ శారదకి గురువారం తెలంగాణ ఉద్యమకారులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, ప్రజా పంథా పార్టీ డివిజన్ కార్యదర్శి యదలాపురం గోపాలరావు, కాంగ్రెస్ మండల నాయకులు దాసరి నాగయ్య ,ప్రజా పంథా పార్టీ మండల కార్యదర్శి భానోత్ ధర్మ, న్యూ డెమోక్రసీ (ఎంఎల్) పార్టీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం మాకు...బహుమతి మీకు

- పోస్టర్‌లు అంటించిన సీఐ శివప్రసాద్, ఎస్సై నాగుల్ మీరా ఖాన్

నవతెలంగాణ-పినపాక

మావోయిస్టుల సమాచారం అందించిన వారికి పోలీసు శాఖ నుంచి మంచి బహుమతి అందజేస్తామని ఏడూళ్ళ బయ్యారం సీఐ శివప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం ఏడూళ్ళ బయ్యారం పోలీసు స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో సమాచారం మాకు.. బహుమతి మీకు పోస్టర్ లను ఎస్సై నాగుల్ మీరా ఖాన్‌తో కలిసి పోస్టర్‌లను అంటించారు. ఈ సందర్భంగా సిఐ శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు వాల్ పోస్టర్స్ అంటించినట్లు తెలిపారు. మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని అమాయక గిరిజనులు అడ్డుపెట్టుకుని, వారిని ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేస్తూ, తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అభివృద్ధి నిరోధకులైన మావోయిస్టుల సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, వారికి తగిన బహుమానం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సంస్థ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం పరిధిలో ఐడీపీఎస్ ఆదివాసి గ్రామాలు చింతలపాడు, టేకులగూడెం గ్రామాలలో నాగార్జున్ హైదరాబాద్ వారి మిత్రుల సమిష్ట సహకారంతో ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను ఆధార్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆధార్ సంస్థ డైరెక్టర్ తోలెం రమేష్ మాట్లాడారు. గ్రామస్తులకు ఫస్ట్ ఎయిడ్ కిట్ సహకారం అందించిన హైదరాబాద్ నాగార్జున్ టీంకు ధన్యవాదాలు తెలిపారు. టేకులగూడెం గ్రామంలో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ కలం చంద్రకళ, చింతలపాడు గ్రామంలో సామాజిక కార్యకర్త మడివి జమునకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గొగ్గల ఆర్యే దొర, సారయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ములకలపల్లి

లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో ములకలపల్లి శిశుమందిర్‌లో గురువారం సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు, చిన్నారులు తమ అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కేదారేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి రేపాక ప్రసాదరావు, శిశుమందిర్ పాఠశాల హెచ్ఎం కుంజా జగన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.


పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-బూర్గంపాడు

పేకాటస్థావరంపై పోలీసులు దాడిచేసిన సంఘటన గురువారం సాయంత్రం మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సమీపంలో జరిగింది. బూర్గంపాడు ఎస్సై రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామశివారులో పేకా టస్థావరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4 వేల నగదు, నాలుగు ద్విచక్రవా హనాలను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్టు ఆయన తెలిపారు. దాడి సమయంలో పేకాట ఆడుతున్న వారిలో కొందరు పరారు కావడంతో వారిని పట్టుకుని కేసునమోదు చేస్తామని ఎస్సై తెలిపారు. ఈ దాడిలో అదనపు ఎస్సై నాగభిక్షం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోయామంటూ ఆటో డ్రైవర్ల ర్యాలీ

నవతెలంగాణ-అశ్వాపురం



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటించడంతో తాము తీవ్రంగా ఉపాధి కోల్పోయామంటూ మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బి ప్రధాన రోడ్డు నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించి తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం కావడంతో మహిళలు ఎవరు తమ ఆటోలలో ఎక్కకపోవడంతో కిరాయిలు కూడా వెళ్లడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ నాయకులు ఏర్పుల మల్లికార్జున్, భాగవత సతీష్, కొమ్ము రాంబాబు, మడిపల్లి రమేష్, సీతయ్య, పదిర చంద్రయ్య పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

నవతెలంగాణ : ఆనందోత్సవాలతో జరుపుకుని సంక్రాంతి పండుగ వేడుకలను ముందస్తుగా విద్యార్థులు పాఠశాలల్లో జరుపుకుని తెలుగు పండుగ సంప్రదాయాన్ని, సంస్కృతిని ప్రదర్శించారు. గురువారం పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. హరిత, ఉపాధ్యాయులు నర్సింహరావు, సలీమ్, కిషోర్, కేఆర్సి ప్రసాద్, రామిరెడ్డి, బాలస్వామిలు పాఠశాల ఆవరణలో భోగిమంటలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో, నృత్యాలు చేసి అలరించారు. సాయంత్రం విద్యార్థినులు రంగవల్లులు అద్దిన తీరు చూపరులను ఆకట్టుకుంది.

న్యూవిజన్‌లో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-ఖమ్మం



సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే సందర్భంగా నిర్వహించుకునే మకరసంక్రాంతి పండుగను ముందస్తు వేడుకగా ఈ గురువారం నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎండి. అబాద్ అలీ తెలిపారు. గంగిరెద్దు ఆటలతో, భోగిమంటల శోభతో భోగిపండ్ల శుభాశిస్సులతో ప్రాంగణమంతా నిండైన సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగవల్లి పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కొందరి చిన్నారులు హరిదాసు వేషదారణలో అలరించారు. భారతీయ పండుగలో ఆధ్యాత్మిక భావంతో పాటు శాస్త్రీయ ధృక్పదాన్ని కూడా కలిగి ఉంటాయని మన పంగుగల ప్రాసిస్త్యం గురించి విద్యార్థుల్లో పూర్తి అవగాహన కలిగించటానికి ఈ సంబరాలని నిర్వహించామని ప్రిన్సిపాల్ అబాద్ అలీ తెలపారు. తదుపరి చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అలరించారు. ఈ కార్యక్రమంలో న్యూవిజన్ విద్యా సంస్థల అకడమిక్ డైరక్టర్ సిహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ ఎండీ. అబాద్ అలీ, సి హెచ్. మాధవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఇరవెండి భూ బాధితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

• ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో భూ బాధితుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం భూ బాధితులు, ఐటీసీ అధికారులకు మధ్య జరుగుతున్న పైపులైను పనుల నిలిపివేతకు సంబం ధించి ఆరా తీసిన ఆయన గ్రామంలో భూ బాధితులను కలుసుకున్నారు. ఈ మేరకు ఇరవెండికి చెందిన పైపులైను నిర్మాణానికి భూములను ఇచ్చిన భూ బాధితులు తమకు పరిహారం చెల్లించడంలేదని, ఉద్యోగాలు ఇస్తానని ఇవ్వడం లేదని పైపులైను పనులను అడ్డుకున్న విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే పాయం ఐటీసీ అధికారులు, బాధిత రైతుల మధ్య ఈ అంశాన్ని చర్చించి సమస్యపరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. భూ బాధితులకు రావాల్సిన నష్టపరిహారం ఇప్పించడంతో పాటు ఐటీసీలో ఉద్యోగాల విషయమై మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని, ఇందుకు ఐటీసీ అధికారులు కూడా బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటే శ్వరరెడ్డి, ఇంగువ రమేష్, కైపు శ్రీనివాసరెడ్డి, బాదం రమేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, మోహనరెడ్డి, భజన సతీష్, ప్రసాద్, శెనగ కిషోర్, ఐఎన్టీయూసీ అనుబంధ సంఘ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లలో రిసెప్షనిస్టు పాత్ర కీలకం

• సీపీ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం



పోలీసు స్టేషన్లలో రిసెప్షనిస్టుల పాత్ర చాలా కీలకమైనదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ స్టేషన్లలోని రిసెప్షన్ సెంటర్ పోలీస్ సిబ్బంది పాత్రపై నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరిని మర్యాద పూర్వకంగా పలకరించి సత్వర న్యాయం చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఎక్కడ విమర్శలకు తావు లేకుండా పారదర్శక పనితీరుతో ప్రజల ప్రశంసలు పొందలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగానే రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభించుకున్నామని, వివిధ పనుల కోసం స్టేషన్‌కు వచ్చేవారు స్టేషన్‌లో ఎస్ఐ లేకుంటే ఆయన వచ్చేంత వరకు స్టేషన్ బయట వేచి ఉండకుండా, ఇబ్బందులు పడకుండా వచ్చిన పని పూర్తి అయ్యేంతవరకు రిసెప్షన్ సెంటర్‌లో వేచి ఉండేలా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్‌లో సిబ్బంది 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులను మొదట ఏ పనిమీద స్టేషన్‌కు వచ్చారో ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసుకొని, సంబంధిత పోలీస్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు స్థితిగతులను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేసుకోవాలని సూచించారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

గత ఏడాది గుండెపోటుతో మరణించిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సైయద్ హసన్ ఆలీ కుటుంబ సభ్యులకు ఎనిమిది లక్షల రూపాయలు భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును గురువారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైన పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ అక్తరూనీసాబేగం పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై జిల్లా అధికారులకు ఫిర్యాదు

•చర్యలు తీసుకోవాల్సిందే అంటూ పట్టుబడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-వేంసూరు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో జెండాలు పట్టుకుని ప్రచారాలు నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారులు తూతూ మంత్రం విచారణలు చేసి చేతులు దులుపుకుంటే ఊరుకునేది లేదని గ్రామస్తులు పట్టుబడుతున్నారు. రాజకీయాలకతీతంగా విధులు నిర్వహించాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్లు బహిరంగంగా ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడం వలన గ్రామాలలో ఉపాధి హామీ పనులు నిర్వహించే క్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎన్నికల సమయంలో సహకరించని కూలీలపై ప్రభావం పడుతుందని, అటువంటి విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకున్నట్లయితే గ్రామాలలో స్వేచ్ఛగా కూలీలు పనులకు హాజరయ్యే అవకాశాలు ఉంటాయని గ్రామస్తులు కోరుతున్నారు. ఎన్నికల ప్రచారంలోని కాకుండా ప్రచార రథాలలో పాల్గొన్న రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. విచారణలో తూతూ మంత్రంగా నిర్వహించి మెమోలతో సరిపెట్టుకుంటే కుదరదని, ఆయా గ్రామాల ప్రజలు పట్టుబడుతున్నారు. ఏపీవో కోటేశ్వరరావు వివరణ కోరగా మర్లపాడు పల్లెవాడ ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదులు వచ్చాయని ఏపీవో కోటేశ్వరరావు తెలిపారు. ఏపీడి విచారణ చేపట్టారని పూర్తి స్థాయిలో ఆధారాలతో విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారులు కోరడంతో ఆలస్యమైందని తెలిపారు.

టీపీజేఎంఏ జిల్లా అధ్యక్షునిగా చల్లా శేషగిరి

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలోని జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘాల ఎన్నికలు గురువారం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఎక్సలెంట్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ చల్లా శేషగిరి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణవేణి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జి.జగదీష్, కోశాధికారిగా ఎస్. వీరభద్రం, రాష్ట్ర ఇసి మెంబర్లుగా ఎం. వీరారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఎం.కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర టిపిజెఎంఏ ప్రధాన కార్యదర్శి జి. తిరుపతిరెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు. అదేవిధంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎం. వీరారెడ్డి ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు.



మిర్చి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

నవతెలంగాణ-రఘునాథపాలెం

గత డిసెంబర్ నెలలో వచ్చిన అకాల వర్షం కారణంగా తెగుళ్ళ ఆశించి మచ్చలు రావడం దిగుబడి తగ్గి,నాణ్యతలో లోపం వలన రేటు తగ్గింది. దీని వలన రైతుల ఆందోళన చెందడం జరుగుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు, తుమ్మల నాగేశ్వరరావు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, తెగుళ్ళ కారణంగా ఎంతవరకు నష్టం జరిగిందో అంచనా వేసి నాణ్యతలను పరిశీలించడానికి నిపుణుల బృందాన్ని ఖమ్మం జిల్లాకు గురువారం పంపించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజున రఘునాథపాలెం మండలంలోని రాంక్య తండా, ఈర్లపూడి తదితర గ్రామాలలో విస్తృతంగా పర్యటించి రైతులు సాగు చేస్తున్న మిర్చి పంటలను పరిశీలించారు. ఏ చీడపీడలు ఆశించాయి, ఎందుకు వాటి ఉధృతి ఉన్నదని కోణంలో, వారు వాడిన పురుగుమందుల వివరాలు, నమోదు చేసుకొని, రైతులు ఎటువంటి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్త, టి సురేష్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, రవి, శైలజ, రాష్ట్ర ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్, వేణుగోపాల్, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఎన్ మోహన్ రెడ్డి, ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి, విజయనిర్మల, ఖమ్మం ఉద్యాన శాఖ ప్రాజెక్టు డైరెక్టర్, బి,వి రమణ, మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్, శ్రీనివాస్, సహాయ వ్యవసాయ సంచాలకులు, సరిత, జిల్లా మార్కెటింగ్ అధికారి, అబ్దుల్ అలీమ్, రఘునాథపాలెం ఉద్యాన శాఖ అధికారి, మీనాక్షి, మండల వ్యవసాయ అధికారులు, మార్కెటింగ్ అధికారులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం ఉన్నా... అజ్ఞానం వైపు

• తల్లిదండ్రులను క్షోభకు గురిచేస్తూ

• పెడదోవన యువత పయనిస్తోంది

• విలేకర్లతో ఎస్‌హెచ్‌వో మోహన్‌బాబు

నవతెలంగాణ-సత్తుపల్లి



పాత జనరేషన్‌తో పోల్చితే ఇప్పటి జనరేషన్ యువతలో విజ్ఞానం మరింతగా పెరిగిందని, విజ్ఞానం పెరిగినా కొందరి యువత అజ్ఞానం వైపు ఆకర్షితమవుతోందని సత్తుపల్లి సేషన్ హౌస్ ఆఫీసర్ జిల్లెల్లమూడి మోహన్‌బాబు అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అనేక రుగ్మతలతో సమాజం ఇబ్బందులు పడుతోందన్నారు. చెడు వ్యసనాలకు యువత కట్టు బానిసలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు, ఆశయాలను వమ్ముచేస్తూ సమాజ కంటకులుగా మారి తీవ్ర క్షోభకు గురిచేస్తున్నారన్నారు. అభివృద్ధి వైపు పయనిస్తున్న తెలంగాణలో ప్రజలు, యువత అపారమైన విజ్ఞానం కలిగి ఉన్నారన్నారు. పెంచుకున్న విజ్ఞానాన్ని ఉపాధి మార్గాల కోసం ఉపయోగించాలే కాని ఆరోగ్యాలను దెబ్బదీసే నిషేధిత పదార్థాలను సమాజానికి అందించి వినాశానికి దారితీస్తున్నారన్నారు. మత్తు పదార్థాలను విక్రయించడమే గాక వాటికి బానిసగా మారి వ్యక్తిగత, కుటుంబ, సమాజ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారని సీఐ మోహన్‌బాబు అన్నారు. మంచి చేయడానికి చాలా కాలం పడుతుందని, అదే చెడు చేయడానికి క్షణకాలం చాలన్నారు. నిజం గడప దాటకముందే చెడు ఊరంతా తిరిగి వస్తుందనే సామెతలా చెడు వ్యసనాలు ఇట్టే ఆకర్షితమవుతాయన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల అప్పటి వరకు ఆనందంగానే ఉండొచ్చుగాని దాని దుష్పరిణామాలు ఆరోగ్యాలను చిన్నాభిన్నం చేస్తాయన్నారు. మేధాశక్తి దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. వ్యక్తి గతంగా కుటుంబ, సమాజం నష్టపోయే విధంగా ఉండకూడదన్నారు. యువత తమకున్న మేధా సంపత్తితో వివిధ రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. విజ్ఞానం మనల్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందన్నారు. చెడుమార్గం పతనానికి దారితీస్తుందన్నారు. బాల్యం నుంచే పిల్లలు మంచిమార్గంలో నడిచేలా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు.

కోడిపందేలు, జూదంపై ఉక్కుపాదం మోపుతాం

సంక్రాంతి పర్వదినం వస్తున్న నేపథ్యంలో సంప్రదాయ మంటూ కొందరు జూదాలను నిర్వహిస్తూ సొమ్ముచేసుకుంటున్నారన్నారు. కోడిపందేలు, పేకాట, ఇతరత్రా జూదాలు నిర్వహిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో మోహన్‌బాబు హెచ్చరించారు. ఇప్పటికే గత వారం రోజులుగా 30 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. కోడి పందేలు నిర్వహించే వారితో పాటు వాటిని వీక్షించడానికి, ఆడటానికి వెళ్లేవారిపై సైతం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీ ప్రాంతాల్లో జరిగే ఈ రకమైన జూదాలు, కోడిపందేలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్‌హెచ్‌వో మోహన్‌బాబు స్పష్టం చేశారు.

ఎస్ఈడీ స్క్రీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లి బంజర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించేందుకు ఎస్ఈడీ డిజిటల్ స్క్రీన్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, పాఠ్యాం శాలు అర్థవంతంగా బోధించేందుకు అధునాతన పద్ధతిలో ఎస్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టిసారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం ఉపస ర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కైపు లక్ష్మినారాయణరెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, బాదం రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సీఐ వసంత్‌కుమార్

నవతెలంగాణ-మధిర

నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ పురస్కరించుకొని వైరా రోడ్‌లోని ఆత్కూర్ వద్ద యారగర్ల గోపాలరావు ట్రస్ట్ మెమోరియల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను మధిర సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జై.వసంత కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడలు ఆడటం వల్ల క్రీడాకారులకు మానసిక ఒత్తిడి దూరమవుతుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇలాంటి క్రీడలను ప్రోత్సహిస్తున్న యారగర్ల గోపాలరావు మెమోరియల్ ట్రస్ట్ వారిని, కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టిపిటిఎఫ్) నూతన సంవత్సర 2024 డైరీలను, క్యాలెండర్లను మండల కేంద్రమైన ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.ముత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసే విద్యావ్యవస్థను బలో పేతం చేయడం ద్వారానే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలని భర్తీ చేయాలన్నారు. పదోన్నతులు చేపట్టాలని, బదిలీ అయిన ఉపాధ్యా యులను బదిలీలో భాగంగా కోరుకున్న స్థానాలకు పంపించాలని కోరారు. భాషా పండితులను, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలని, సీపీఎస్ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, కేజీబీవీ, మోడల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. హనుమంతరావు, ఏ.భావ్సన్, సీతారాములు గురుమూర్తి, సురేష్, సూర్యనారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శీలం వెంకటరెడ్డికి పరామర్శ

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలో నీభరత్ విద్యాసంస్థల, అధినేత బీఆర్ఎస్ నాయకులు శీలం వెంకటరెడ్డి ఇటీవల కంటి ఆపరేషన్ జరగడంతో గురువారం ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్‌రాజు తన నివాసంనికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు యన్నంశెట్టి అప్పారావు, అరిగే శ్రీనివాసరావు, మేడికొండ కళ్యాణి కిరణ్, కరివేద సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు

నవతెలంగాణ-కల్లూరు

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థిని విద్యార్థులకు వ్యాచారచన డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ని విద్యార్థులకు నిర్వహించగా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. సందర్భంగా రామకృష్ణ సేవా సమితి నాయకులు కొమ్మూరు దుర్గయ్య, ఉప్పు నరసింహారావు, బండి వెంకట్రెడ్డి, వెంకట్, సాదిక్ అలీ తదితరులు మాట్లాడుతూ స్వామి వివేకానంద చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్లమెంటరీ పోటీలో గురుకుల విద్యార్థులకు ప్రథమ బహుమతి

నవతెలంగాణ-కల్లూరు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో రినామ్ సెన్స్ రాష్ట్రస్థాయి పోటీలో స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థినిలు ప్రథమ బహుమతి పొందారు. హైదరాబాదులో మహేంద్ర వీల్స్‌లో ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు పోటీలు నిర్వహించారు. హెూటల్లో 13 రీజనల్ జోనల్ నుండి విద్యార్థులు పాల్గొన్నారు. యూత్ మోడల్ పార్లమెంట్ సమావేశాలలో అధికార ప్రతిపక్ష సభ్యులు సమస్యలపై స్పందించిన తీరు ఆకట్టుకుంది. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన కల్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినిలు ధూర, నాగ శ్రావ్య, సుకన్య, మంజుల, సాయి నాగ దీక్షిత, శ్రావణి, ఉష శ్రీలు ప్రథమ బహుమతి 15 వేల నగదు పొందారు. అదేవిధంగా పదవ తరగతి చదువుతున్న డి. లక్ష్య వ్యక్తిత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో నుంచి పదివేల రూపాయలు బహుమతి పొందారు. పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థినిలు, ప్రోత్సహించిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ కే. శ్రీలత , ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

టీఎస్ఆర్టీసీ డిపోలో నేడు పందెం కోడి వేలం

- బస్సులో మర్చిపోయిన ప్రయాణికుడు
- తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో వేలం



నవతెలంగాణ -కరీంనగర్

బస్సులో ఓ ప్రయాణికుడు తన పందెం కోడిని వదిలి వెళ్లిపోయాడు. దాన్ని ఏం చేయాలో తోచక రెండ్రోజులుగా చూసిన ఆర్టీసీ సిబ్బంది కోడిని వేలం వేస్తున్నారు. ఈ విచిత్ర ఘటన కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగింది. కరీంనగర్ -2 డిపో పరిధిలోని బస్సులో మూడ్రోజుల కిందట ఓ వ్యక్తి వెంట తీసుకొచ్చిన పందెం కోడిని మరిచిపోయాడు. దాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో ఆర్టీసీ కరీంనగర్ -2 డిపో మేనేజర్ ఈ నెల 12న శుక్రవారం కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని ఇచ్చిన ప్రకటన నోటీసు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

రేడియాలజీలో ఉత్తమ పరిశోధనా పత్రం పోటీ

- డాక్టర్ బీరప్ప

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ, నిమ్స్ సంయుక్తాధ్వర్యంలో ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ స్థాయి ఉత్తమ పరిశోధనా పత్రం పోటీ 2024ను నిర్వహించనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. మార్చ్ 10న హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్‌లో జరగనున్న పోటీకి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ కాకర్ల సుబ్బారావు ఆశయాలను నిరంతర విద్యా కార్యక్రమంతో ముందుకు తీసుకు వెళుతున్నందుకు సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్‌ను అభినందించారు. ఆ కార్యక్రమాల్లో నిమ్స్ రేడియాలజీ విభాగం భాగస్వామ్యం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సువర్ణ అవకాశాన్ని రేడియోగ్రఫీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. ఏ వారీస్ కోరారు. కార్యక్రమంలో రేడియాలజీ హెడ్ డాక్టర్ అను కపూర్, మాజీ డీన్ డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ జ్యోత్స్న రాణి, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకడమిక్ డైరెక్టర్ దామోదర్ నాయుడు, సీఈవో శిరందాస్ శ్రీనివాస్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మహేష్ బసవేని తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలి

- నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రలు ఏర్పాటు చేయాలి
- ఎన్‌పీఆర్‌డీ క్యాలెండర్ ఆవిష్కరణలో పఠాన్ ఉమర్‌ఖాన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల అధినేత పఠాన్ ఉమర్ ఖాన్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని హెలెన్‌కెల్లర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఎన్‌పీఆర్‌డీ ముద్రించిన 2024 క్యాలెండర్‌ను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం కనీసం ఉన్నచట్టాలనైనా అమలు చేయాలని కోరారు. సమాజంలో వివక్షతకు, చిన్న చూపుకు వారు గురవుతున్నారనీ, అందువల్ల వారిలో మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. వికలాంగుల్లో అక్షరాస్యత పెంచేందుకు ప్రత్యేక విద్యాసంస్థలు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు. ఎన్‌పీఆర్‌డీ ముద్రించిన క్యాలెండర్ విజ్ఞాన దాయకంగా ఉందన్నారు. సమస్యలపై పోరాడుతూనే వికలాంగులను చైతన్యపరిచేందుకు ఆ సంస్థ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య, కార్యక్రమంలో హెలెన్ కెల్లర్ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అర్మ్మఘం, హెలెన్ కెల్లర్ రెహబిలిటేషన్ సెంటర్ డైరెక్టర్ ఎం శశిధర్ రెడ్డి, సిబ్బంది గౌస్, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె నాగలక్ష్మి, నాయకులు అమరావతి, చంద్రశేఖర్, అనిల్‌తో పాటు విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ స్పాట్ రెమ్యునరేషన్ చెల్లించాలి

- ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులకు తపస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతేడాది పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని తపస్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావును గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ మూల్యాంకనం రెమ్యూనరేషన్ చెల్లించకపోవడం దారుణమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామనీ, త్వరలోనే రెమ్యూనరేషన్‌ను విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈనెల 22న అయోధ్యలోని రామాలయంలో ప్రాణప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా రాష్ట్రంలో సెలవు ప్రకటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వారు వినతిపత్రం సమర్పించారు.

మెహబూబా ముఫ్తీకి తృటిలో తప్పిన ప్రమాదం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీకి తృటిలో ప్రమాదం తప్పింది. గురువారం మధ్యాహ్నం ఆమె ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అయితే ఆమె ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడినట్టు అధికారులు తెలిపారు. ముఫ్తీ ప్రయాణిస్తున్న కారు అనంత్‌నాగ్ జిల్లాలోని సంగమ్ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముఫ్తీకి ఎలాంటి గాయాలు కాలేదు. ఆమె వ్యక్తిగత సిబ్బందిలోని పోలీస్ అధికారికి గాయాలయ్యాయి. అగ్నిప్రమాద బాధితులను పరామర్శించేందుకు ఆమె ఖానాబాల్ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం నుంచి ఆమె సురక్షితంగా బయటపడ్డారని ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ఎక్స్‌లో పేర్కొన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. ఆమెకు ఎలాంటి గాయాలు కాకుండా బయటపడటం సంతోషంగా ఉందని ట్వీట్ చేశారు.

ప్రజలకు దగ్గరవ్వాలి, ఎక్కువ స్థానాలు గెలవాలి

పార్టీకి మీరే కండ్లు, చెవులు...

- లోక్‌సభ స్థానాల కో- ఆర్డినేటర్లకు పార్టీ చీఫ్ ఖర్గే దిశా నిర్దేశం
- తెలంగాణ, ఏపీతో సహా పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకో ఆర్డినేటర్లతో కీలక భేటీ
- సోనియా గాంధీ తెలంగాణ లో పోటీ చేయాలని అభ్యర్థించాం: భట్టి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ నియమించిన లోక్‌సభ స్థానాల కో-ఆర్డినేటర్లే అధిష్టానానికి కండ్లు, చెవులని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశ నిర్దేశం చేశారు. ప్రజలకు దగ్గరవడంతో పాటు, దక్షిణాది రాష్ట్రాల్లో మెజార్టీ సీట్లు గెలిచేలా పని చేయాలని సూచించారు. ఈ దిశలో ఎక్కువ స్థానాలు గెలిపించే బాధ్యత కో ఆర్డినేటర్లపైనే ఉందని గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఉత్సాహాన్ని లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించాలని సూచించారు. ఆ దిశలో కో ఆర్డినేటర్లు, క్షేత్రస్థాయిల్లో లీడర్లను కలుపుకొని గెలుపు దిశగా ముందుకుసాగాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికలకు సమయాత్తంలో భాగంగా... గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో తొలుత తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, లక్షదీప్ రాష్ట్రాలకు సంబంధించిన లోక్‌సభ నియోజకవర్గాల కాంగ్రెస్ కో-ఆర్డినేటర్లతో మల్లికార్జున ఖర్గే కీలక భేటి నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గోవా, అండమాన్ నికోబార్ దీవుల లోక్‌సభ నియోజకవర్గాల కాంగ్రెస్ కో-ఆర్డినేటర్లతో సమావేశమయ్యారు.

ఈ భేటీలో... తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ముఖ్య నేతలు జీవన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఏపీ నుంచి తులసి రెడ్డి, గుర్నాథ్ రెడ్డిలు పాల్గొన్నారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో వ్యూహాలు, ఎన్నికల నిర్వహణ, ప్రజలతో మమేకమవడం వంటి అంశాల్లో మార్గ నిర్దేశం చేశారు. ప్రత్యేకంగా క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులతో కలుపుకు పోయే అంశం, కో -ఆర్డినేటర్ల పనితీరు కు సంబంధించిన ప్రజెంటేషన్ ఇచ్చినట్టు తెలిసింది. మొత్తం పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 106 లోక్ సభ స్థానాలకు గాను మెజార్టీ స్థానాల్లో గెలవాలని సూచించారు. దక్షిణాధి రాష్ట్రాల నుంచి అనుకున్న రీతిలో సీట్లు రాబట్టగలిగితే... ఉత్తరాధి నుంచి ఇండియా కూటమితో బిజెపికి కళ్లెం వేయవచ్చని సూచించారు. అలాగే కో-ఆర్డినేటర్ల కోసం ఢిల్లీలో వార్ రూం ఏర్పాటు చేస్తున్నట్టు నేతలకు తెలిపారు. ఆయా నేతలకు కేటాయించిన స్థానాల్లో వారే కండ్లు, చెవులు గా పని చేసి ... పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచనలు చేశారు. గెలుపు గుర్రాలను ఎంపిక చేయడంతో పాటు, క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులు, ఇతర నేతలన్ని కలుపుకొని పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.

తెలంగాణ నుంచి సోనియా గాంధీ పోటీ చేయాలని అభ్యర్థించాం: భట్టి

తెలంగాణ నుంచి సోనియా గాంధీ పోటీ చేసేలా చూడాలని అధిష్టానాన్ని అభ్యర్థించినట్లు డిప్యూటీ సీఎం భట్టి వెల్లడించారు. పార్టీ గెలుపు కోసం చేపట్టాల్సిన ప్రోగ్రాంలపై ఖర్గే దిశానిర్దేశం చేసినట్టు తెలిపారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే... లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ను ఆదరిస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుపొందెలా ప్రణాళికలు, యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని పని చేస్తామన్నారు. మెజారిటీ స్థానాలు గెలిపించే బాధ్యత కో-ఆర్డినేటర్లపై ఉందని ఖర్గే దిశానిర్దేశారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. అసెంబ్లీ ఫలితాలు ఉత్సాహంతో లోక్ సభ ఎన్నికలకు వెళ్లాలని చెప్పారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాలు ఉంటాయని, అధిష్టానం సూచనల మేరకు లోక్‌సభ ఎన్నికలకు వెళ్తామన్నారు.

రెండు, మూడు స్థానాల కోసం బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ...: పొన్నం

రాష్ట్రంలోని 17 స్థానాలు గెలవడమే లక్ష్యంగా పనిచేస్తామని మంత్రి పొన్నం అన్నారు. అయితే రెండు మూడు స్థానాల కోసం బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య పోటీ ఉంటుందన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి మరిన్ని నిధులు వస్తాయని వివరించారు. 17 స్థానాల్లో గెలిపిస్తే ఆరు గ్యారెంటీలతోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

13 నుంచి 14 స్థానాల్లో గెలుపు మాదే: ఉత్తమ్

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ లో 13 నుంచి 14 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నల్గొండ పార్లమెంట్ స్థానంలో మూడు లక్షల మెజారిటీతో కాంగ్రెస్ ను గెలిపించుకుంటాని ధీమా వ్యక్తం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ అగ్రనాయకత్వం దిశానిర్దేశం చేసిందని చెప్పారు. లోక్ సభ ఎన్నికల్లో గెలిచేందుకు ఏఐసీసీ అగ్రనేతలు నిర్మాణాత్మక సూచనలను చేశారని మంత్రి సీతక్క అన్నారు. తమకు బాధ్యత కల్పించిన స్థానాలలో పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు శక్తి వంచన లేకుండా పోరాడుతామన్నారు. తొందరలోనే అభ్యర్థుల పేర్లను అధిష్టానం కి నివేధించి, ఫిబ్రవరి లోపు ఎంపి అభ్యర్థుల ఎంపిక పూర్తి చేస్తామని చెప్పారు. తనకు కేటాయించిన ఆదిలాబాద్ ఎంపీ స్థానంలో కొత్త నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకొని అధిష్టానానికి నివేదిక ఇస్తామని వెల్లడించారు. అభ్యర్థి ఎవరైనా అధిష్టానం నిర్ణయం మేరకు పనిచేస్తామన్నారు. ఒక్క ఎమ్మెల్యే ఉన్నా... మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

'చేతి'కి రానున్న ఖమ్మం డీసీసీబీ

- చైర్మెన్ నాగభూషయ్య పై అవిశ్వాసం!
- డీసీఓకు నోటీసు అందజేసిన 11 మంది సొసైటీ డైరెక్టర్లు
- చైర్మెన్ రేసులో తుళ్లూరి బ్రహ్మయ్య, సైదుబాబు, యలగొండస్వామి..?
- ఇంకా ఏడాది పదవీకాలం



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)ను 'హస్త'గతం చేసుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన పరిణామాల్లో డీసీసీబీ పీఠాన్ని దక్కించుకునేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రస్తుత చైర్మెన్‌గా ఉన్న కూరాకుల నాగభూషయ్యపై అవిశ్వాసానికి 11 మంది వి.వెంకటాయపాలెం సొసైటీ డైరెక్టర్లు నోటీస్ ఇచ్చారు. మొత్తం 13 మంది డైరెక్టర్లకుగాను 11 మంది అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేశారు. జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ (డీసీవో)కు గురువారం నోటీస్ అందజేయడంతో అవిశ్వాసం నెగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్తగా చైర్మెన్ పీఠాన్ని ఎవరు దక్కించుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రుల అనుచరులు పోటీ పడుతున్నారు.

2020 ఫిబ్రవరిలో ఖమ్మం డీసీసీబీ ఎన్నికలు జరిగాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఈ పాలకవర్గానికి గడువు ఉంది. ప్రస్తుతం డీసీసీబీ చైర్మెన్‌గా ఉన్న కూరాకుల నాగభూషయ్య రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పీఏసీఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సొసైటీలో నాగభూషయ్యతో కలిసి మొత్తం 13 మంది సభ్యులున్నారు. గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అండతో సొసైటీ చైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత డీసీసీబీ చైర్మెన్‌గా ఎన్నిక అయ్యారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో సీన్ రివర్స్ అయింది. 13 మంది డైరెక్టర్లకు.. 11 మంది నాగభూషయ్యకు వ్యతిరేకంగా అవిశ్వాసం నోటీస్‌పై సంతకాలు చేసి గురువారం ఖమ్మం జిల్లా సహకారశాఖ అధికారి విజయనిర్మలకు అందజేశారు. వి.వెంకటాయపాలెం సొసైటీ చైర్మెన్‌గా నాగభూషయ్యను అవిశ్వాసం ద్వారా తప్పిస్తే, డీసీసీబీ చైర్మెన్‌గా ఆయన అనర్హుడయ్యే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ ఈ వ్యూహం పన్నింది. రెండు వారాల్లో నాగభూషయ్యను బలనిరూపణకు ఆదేశిస్తూ డీసీవో ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది.

రేసులో ముగ్గురు..!

ఇప్పటికే డీసీసీబీ చైర్మెన్ రేసులో ఉన్న నాయకులు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న ప్రస్తుత డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు ఖమ్మం కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ భర్త సైదుబాబు, ముదిగొండ పీఏసీఎస్ చైర్మెన్ తుపాకుల యలగొండస్వామితో పాటు మరికొందరు రేసులో ఉన్నారు. మొత్తం ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ పరిధిలో 101 సంఘాలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 76, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21, ములుగు జిల్లాలో రెండు, మహబూబాబాద్ జిల్లాలో రెండు పీఏసీఎస్‌లు ఉన్నాయి. పీఏసీఎస్ చైర్మెన్‌లుగా ఉన్నవారే డీసీసీబీ డైరెక్టర్లుగా ఎన్నికవుతారు. మొత్తం 21 మంది డీసీసీబీ డైరెక్టర్లు కలిసి చైర్మెన్‌ను ఎన్నుకుంటారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలివ్వండి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి టీఎస్‌జీహెచ్‌ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న 22,500 మంది ఉద్యోగులకు నవంబర్, డిసెంబర్ రెండు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి గురువారం మెయిల్ ద్వారా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం వినతిపత్రం సమర్పించారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు నవంబర్, డిసెంబర్ రెండు నెలల వేతనాలు ఇంతవరకు అందకపోవడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంక్రాంతి పండుగ సమయంలో జీతాలు అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబ పోషణ, పిల్లల ఫీజులు, వృద్ధ తల్లిదండ్రుల ఆరోగ్య సమస్యలకు కావాల్సిన చికిత్సలకూ డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీన్ని తీవ్రమైన సమస్యగా పరిగణించి సంక్రాంతి పండుగ లోపల జీతాలివ్వాలని కోరారు.

నేడు విద్యార్థి సంఘాల చలో పార్లమెంట్

- మోడీ సర్కార్ విద్యా వ్యతిరేకత విధానాలపై 16 విద్యార్థి సంఘాల ఐక్య పోరు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

విద్యారంగంలో మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధ్వంసకర చర్యలకు వ్యతిరేకంగా నేడు (శుక్రవారం) ఎస్ఎఫ్ఐతో సహా 16 విద్యార్థి సంఘాలు చలో పార్లమెంట్ నిర్వహించనున్నాయి. జంతర్ మంతర్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థి నేతలు, కార్యకర్తలు దేశ రాజధానికి చేరుకున్నారు. మోడీ సర్కార్ విద్యా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని దేశంలోని అన్ని ప్రధాన విద్యార్థి సంస్థల ఉమ్మడి వేదిక 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' నిర్ణయించింది. "సేవ్ ఎడ్యుకేషన్, రిజెక్ట్ ఎన్ఈపీ, సేవ్ ఇండియా, రిజెక్ట్ బీజేపీ' అనే నినాదంతో దేశవ్యాప్తంగా విద్యార్థులను ఈ ఉద్యమం చైతన్యవంతం చేస్తుంది. ఉద్యమంలో భాగంగా రాజధాని ఢిల్లీలో విద్యార్థుల భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిస్వాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో దేశంలోని అన్ని ప్రధాన విద్యార్థి సంఘాల జాతీయ నాయకత్వం హాజరవుతుందన్నారు.

జిల్లాలు మారేనా...?

- చర్చనీయాంశంగా పునర్వ్యవస్థీకరణ
- స్పష్టత లేదంటున్న అధికారవర్గాలు
- లోక్‌సభ నియోజకవర్గాల వారీగా మార్చుతారని చర్చ
- 2026లో నియోజకవర్గాల పునర్విభజన..అప్పుడేంటనే ప్రశ్న
- రెండు, మూడేసి జిల్లాల్లో పలు నియోజకవర్గాలు
- ముందుగా వాటిని ఒకేచోట చేర్చాలనే యోచన?
- అందరి సూచనలతోనే ముందుకు పోయే అవకాశం
- ఈ అంశంపై భిన్నవాదనలు..కొందరి మోదం..కొందరి ఖేదం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

ఓ చానల్ బిగ్‌డిబెట్‌లో జిల్లాల పునర్వ్యస్థీకరణ చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. పునర్వ్యస్థీకరణ ఏ రకంగా ఉంటుందనేది అధికారులకే స్పష్టత లేదు. ప్రభుత్వ ఆలోచన మాత్రమే. అన్నిస్థాయిల్లో చర్చ జరిగిన తర్వాతనే విధానపరమైన నిర్ణయం తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. కొన్ని నియోజకవర్గాలు మూడేసి జిల్లాల్లో ఉన్నాయి. వాటిని ఒకేచోట చేర్చుతూ జిల్లాలను అలానే ఉంచుతారా? కుదించి జిల్లాలను ఏర్పాటు చేస్తారా? పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాలను మార్చుతారా? అన్నది ఊహానాగాలే.

నాడు జిల్లాల విభజన అసంబద్ధంగా జరిగిందని గతంలోనే వార్తలు వచ్చాయి. పది జిల్లాలను 33 జిల్లాలుగా విభజించడం వల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయని కొందరంటుండగా... మరికొందరు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాలు మూడేసి జిల్లాలో ఉండడంతో పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్న విషయాన్ని గతంలోనే ప్రభుత్వానికి అధికారులు నివేదించినట్టు తెలిసింది. నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందనే భావనతోనే ఎక్కువ జిల్లాలను ఏర్పాటు చేసి ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2009లో నియోజకవర్గాల పునర్విభజనకు అప్పటి ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. అదే తరహాలో ప్రస్తుతం ఉన్న జిల్లాలను హేతుబద్ధంగా విభజించాలని రేవంత్‌రెడ్డి సర్కారు భావిస్తుందా అన్న చర్చ నడుస్తోంది.

ఇందుకోసం సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ సిట్టింగ్ జడ్జి సారథ్యంలో జ్యూడీషియల్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ సూచనల మేరకు నిర్ణయం ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం జిల్లాల విభజన అంశాన్ని ప్రవేశపెట్టొచ్చని తెలుస్తోంది. అన్ని రాజకీయ పార్టీల వైఖరిని తెలుసుకున్న తర్వాతే దీనిపై సర్కారు ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాల మార్పులపై తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పది జిల్లాలు 33 ముక్కలు..

జిల్లాల విభజనకు ముందు ఉత్తర తెలంగాణలో నాలుగు జిల్లాలు ఉంటే వాటిని 16 జిల్లాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం విభజించింది. ఆదిలాబాద్ నాలుగు, కరీంనగర్ నాలుగు, వరంగల్ ఆరు, నిజామాబాద్ రెండు జిల్లాలుగా విడి పోయాయి. దక్షిణ తెలంగాణలో ఆరు జిల్లాలు ఉంటే ఒక్క హైదరాబాద్ మినహా మిగిలిన ఐదు జిల్లాలు 16 జిల్లాలుగా విడి పోయాయి. మెదక్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలను మూడు చొప్పున విభజించగా...అత్యధికంగా వరంగల్ ఆరు, మహబూబ్‌నగర్ ఐదు ముక్కలైంది. ఆయా జిల్లాల్లో ప్రతిపక్షాల్లో బలంగా ఉన్న నేతల ప్రాబల్యాన్ని దెబ్బతీ సేందుకే నాటి సీఎం కేసీఆర్ జిల్లాలను అడ్డగోలుగా విభజించారనే అభిప్రాయం ప్రస్తుత ప్రభుత్వవర్గాల్లో ఉంది. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జిల్లాల సంఖ్యను కుదిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు ఒకవేళ చేసినా తొలుత రెండు, మూడు జిల్లాల పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల వారీ మండలాలు ఒకే జిల్లా పరిధిలోకి వస్తాయనే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం.



లోక్‌సభ నియోజకవర్గాల వారీగా విభజిస్తే 17 జిల్లాలు..

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జిల్లాలను ఏర్పాటు చేస్తే 17 జిల్లాలు ఏర్పడే అవకాశం ఉంది. ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, భువనగిరి, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం లోక్‌సభా నియోజకవర్గాలను జిల్లాలుగా మారుస్తారనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి 17 జిల్లాలనే ఏర్పాటు చేస్తారని చర్చ జరిగింది. రాజకీయ డిమాండ్లు, ఆందోళనలతో బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలను పెంచుకుంటూ పోయింది. ఇంకా డిమాండ్లు ఉన్నాయి.

ఒక్కో నియోజకవర్గం రెండు, మూడేసి జిల్లాల్లో..

ప్రస్తుతం ఉన్న జిల్లాల్లో కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మండలాలు మూడు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు నియోజకవర్గంలోని మండలాలు టేకులపల్లి, ఇల్లెందు భద్రాద్రి జిల్లాలో ఉండగా కామేపల్లి ఖమ్మం జిల్లా పరిధిలో ఉంది. గార్ల, బయ్యారం మహబూబాబాద్ జిల్లా పరిధిలోకి వస్తున్నాయి. రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ కరీంనగర్, సిద్దిపేట జిల్లాలో ఉంది. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నియోజకవర్గం మంథని జగిత్యాల, భూపాలపల్లి జిల్లాలో ఉంది. జనగామ, భద్రాచలంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పదికి పైగా నియోజకవర్గాల్లో ఇలాంటి సమస్యలున్నాయి. ఒక్క నియోజకవర్గంలోని మండలాలు మూడు జిల్లాల్లో ఉండటం మూలంగా పాలనాపరమైన సమస్యలు ఏర్పడుతున్నాయనే అభిప్రాయం అధికారయంత్రాంగంలో ఉంది.

కుదిస్తే 'కొత్త'చిక్కులు ..

జిల్లాను కుదిస్తే ప్రభుత్వానికి కొత్త చిక్కులు తలెత్తే అవకాశం లేకపోలేదు. ప్రజల నుంచి వ్యతిరేకత రావచ్చు. జిల్లాల ఏర్పాటుతో జోన్ల విభజన జరిగింది కాబట్టి ఈ సమస్య ఉత్పన్నం కావచ్చు. ఉద్యోగాల పంపకాల్లో సమస్యలు తలెత్తవచ్చు.ఇప్పటికే సిబ్బంది స్థిరపడిపోయారు. మళ్లీ మార్పు అంటే ఉద్యోగుల నుంచి రియాక్షన్ ఎలా ఉంటుంది తెలియదు.జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన దృష్ట్యా జిల్లాలు కుదిస్తే నోటిఫికేషన్ల రాక ఆలస్యం కావచ్చు. ఉద్యోగుల బదిలీలు ఇప్పట్లో ఉండవు. ఇప్పటికే నిర్మించిన, నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్లు నిరుపయోగంగా మారుతాయి. పథకాల కేటాయింపుల్లో జాప్యం జరగవచ్చు. రాజకీయపార్టీల పరంగా ఎక్కువ మందికి పదవులు ఇచ్చే అవకాశం ఉండకపోవచ్చు. రియల్ ఎస్టేట్ బూమ్ ఎలా ఉంటుందో తెలియదు. ఇలా ప్రస్తుతం జిల్లా కేంద్రాలు శివారు గ్రామాలకు 50-80 కి.మీ దూరంలో ఉన్నాయి. కుదిస్తే జిల్లా కేంద్రం దూరమై జనానికి భారంగా మారవచ్చు. జిల్లాలను పునర్వ్యస్థీకరణ చేయాలను కుంటే అసెంబ్లీలో బిల్లు పెట్టాలి. కేంద్రానికి పంపాలి. రాష్ట్రపతి ఆమోదం జరగాలి. మొత్తం ఈ ప్రక్రియ పూర్తవడానికి రెండేండ్ల వరకు పట్టే అవకాశం ఉందని నిపుణులంటున్నారు. ఈలోగా రకరకాలుగా వచ్చే సమస్యలను ప్రభుత్వం ఏ రకంగా అధిగమిస్తుందనేది ఒక ప్రశ్న.

2026లో నియోజకవర్గాల పునర్విభజనతోనూ సమస్యే...

నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో మళ్లీ కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తారా? అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్ర పునర్విభజనకు ముందు కూడా లోక్‌సభ నియోజక వర్గాలు రెండు, మూడు జిల్లాల్లో విస్తరించి ఉన్న దాఖలాలు ఉన్నాయి. అప్పట్లో మహబూబాబాద్ నియోజకవర్గం ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఉంది.



ఆ అనుభవం నుండి పుట్టిందే ఉమెన్ ఆన్ వీల్స్

ఒకప్పుడు టూ వీలర్ చేర్చుకోవడానికి ఆమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. అలాంటి ఇబ్బంది మరే మహిళకు ఎదురు కాకూడద నుకుంది. అందుకే మహిళల కోసం ప్రత్యేకంగా టూ వీలర్ కోచింగ్ సెంటర్ ప్రారం భించింది. ఇప్పటి వరకు మూడు వేల ఐదు వందల మందికి డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చింది. తానూ ఓ పారిశ్రామిక వేత్తగా స్థిరపడింది ముంబయికి చెందిన అమృత మనే. ఆమె పరిచయం నేటి మానవిలో...

అమృత మానే తన స్వస్థలమైన ముంబయి లోని నిత్యం రద్దీగా వుండే వీధుల్లో, కార్ల హారన్ మోతల మధ్య తన గేర్ మోటార్ సైకిల్‌తో ముందుకు వెళ్లడానికి చాలా కష్ట పడుతోంది. నాన్ గేర్ బైక్‌ను నడిపే అను భవం వున్న ఆమె గేర్ మోటార్ సైకిల్ నడ పడం ఇదే మొదటిసారి. గేర్లపై ఆమెకు పెద్దగా అవగాహన లేదు. 'అందుకే అమ్మాయిలు డ్రైవింగ్ చేయకూడదు' అంటూ చుట్టూ ఉన్నవారు అరవడం మొదలుపెట్టినప్పుడు నేను మొదట భయపడ్డాను. కానీ ఒక అపరిచితుడు గేర్‌లను ఎలా మార్చాలో చెప్పిన తర్వాత, బైక్‌ను రీస్టార్ట్ చేయగలను, అది సాఫీగా సాగింది. ఇది నాకు సంతోషకరమైన అనుభవం. అప్పుడు నేను ఎంత స్వేచ్ఛగా భావించానో మాటల్లో చెప్పలేను' అంటూ ఆమె పంచుకున్నారు. అప్పటి నుంచి అమృత వెనుదిరిగి చూసుకోలేదు.

చాలా ముందుకు వచ్చింది

తన పొరుగువారికి టూ వీలర్ డ్రైవింగ్ నేర్పించడం నుండి డ్రైవింగ్ ఇన్‌స్టిట్యూట్‌ని స్థాపించడం వరకు చాలా ముందుకు వచ్చింది. 2018లో 'ఉమెన్ ఆన్ వీల్స్'ను ప్రారంభించింది. 'నేను డ్రైవింగ్‌లో సరైన పాఠాలు నేర్చుకోవాలనుకున్నప్పుడు శిక్షణా కేంద్రాలు లేవు. పైగా మహిళా శిక్షకులు ఉన్న కేంద్రాలు చాలా తక్కువ ఉన్నాయి' అని ఆమె గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం పూర్తిగా మహిళల కోసం, మహిళలతో నడుస్తున్న డ్రైవింగ్ స్కూల్ ముంబయిలో ఈమెది మాత్రమే. ఇప్పటి వరకు ఉమెన్ ఆన్ వీల్స్ 3,500 మంది మహిళలకు శిక్షణ ఇచ్చింది.

ప్రయాణాలు చేయాలనే కోరికతో...

అన్వేషణ పట్ల మక్కువతో సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాలని కోరుకునే అమృత మోటారు సైకిళ్లు, కార్ల పట్ల అత్యంత ప్రేమ పెంచుకుంది. 8వ తరగతిలో ఉన్నప్పుడు బంధువు ఆమెకు గేర్‌తో కూడిన మోటార్‌సైకిల్ నడపడంలో ప్రాథమికాంశాలు నేర్పించాడు. 'ఇది ఒక మంచి అనుభవం. మోటార్‌సైకిల్‌ను మరింత నైపుణ్యంగా నేర్చుకుని నడపాలని నాలో కొత్త కోరికను రేకెత్తించింది' అని ఆమె ఉత్సాహంగా చెప్పారు. ఇంతలో అమృత తండ్రి తన తల్లికి హోండా యాక్టివాను కొనుగోలు చేశాడు. ఆమె ఉద్యోగానికి వెళ్లడానికి వాహనం అవసరం. అమృతకు మోటారు సైకిల్ గురించి ప్రాథమిక విషయాలు తెలుసు కాబట్టి డ్రైవింగ్ చేయడం, యాక్టివా నడపడం సరదాగా భావించానని ఆమె చెప్పారు. ఆమె లక్ష్యం మోటార్‌సైకిల్ నడపడం.

మంచి అనుభవం

తెలిసిన వారు ఒకరు తన గేర్ మోటార్ సైకిల్‌ను ఇచ్చి నడపమంటే తనకు అది నడపడం రాదని వెనక్కు ఇచ్చేశారు. దీనికి ఆమె బాధపడలేదు. 'ఆ మోటార్‌సైకిల్‌ను ఎలా నడపాలో తెలియకుండా వీధుల్లోకి తీసుకెళ్లడం నా పొరపాటు. కానీ అది నిజంగా మంచి అనుభవంగా మారింది' అని పంచుకున్నారు. దాంతో 2018లో తన ఎంబీఏ తరగతులు ప్రారంభం కావడానికి మూడు నెలల ముందు అమృత డ్రైవింగ్ నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. త్వరలోనే ఒక ద్విచక్ర వాహన డ్రైవింగ్ స్కూల్‌ను స్థాపించాలనే ఆలోచన చేశారు. దానికి ఆమె మొదట అమృత డ్రైవింగ్ స్కూల్ అని పేరు పెట్టారు. కొంత కాలం తర్వాత ఉమెన్ ఆన్ వీల్స్‌గా రీబ్రాండ్ చేశారు. దీని కోసం ఆమె పెద్దగా ప్రచారం చేయలేదు. రెండు నెలల్లోనే చాలా మందికి దీని గురించి తెలిసిపోయింది.



విద్యార్థుల అనుభవాలు

మునుపటి శిక్షణా కేంద్రంలో అసౌకర్యానికి గురైన ఒక విద్యార్థిని అమృత గుర్తుచేసుకున్నారు. సెషన్‌లో ఒక మగ శిక్షకుడు ఆమెకు ద్విచక్ర వాహనం నడపడం నేర్పుతున్నప్పుడు ఆమెపైకి వంగి అసౌకర్యానికి గురి చేశాడు. ఇక్కడ నేర్పించేది అమృత కాబట్టి ఆమెకు అలాంటి ఇబ్బంది కలగలేదు. హాయిగా డ్రైవింగ్ నేర్చుకోగలిగింది. నవీ ముంబైకి చెందిన 22 ఏండ్ల మార్కెటింగ్ ప్రొఫెషనల్ ఉజ్మా కూడా ఓ అనుభవం ఉంది. ఒక స్నేహితుడితో కలిసి యాక్టివ్ రైడ్ చేయడం నేర్చుకుంటూ ఎదురుగా వస్తున్న ట్రక్కు వల్ల ఆమె అదుపు తప్పి పడిపోయింది. ఈ సంఘటన తర్వాత ఆమె రెండేండ్ల పాటు ద్విచక్ర వాహనం నడపడం మానేసింది. ఇంటి నుండి ఆఫీస్‌కు వెళ్లడానికి రోజుకు రూ. 150 ఖర్చు చేస్తుంది. డబ్బు ఆదా చేయాలనే ఆసక్తితో ఆమె మళ్లీ డ్రైవింగ్ నేర్చుకోవాలనుకుంది. 'మహిళా కోచ్‌లు ఉన్నందున నేను ఈ సెంటర్ (ఉమెన్ ఆన్ వీల్స్)లో చేరాను. శిక్షణ మొత్తం ఎంతో సౌకర్యవంతంగా భావించాను. అమృత కూడా నన్ను కొనసాగించడానికి, నా భయాన్ని పోగొట్టడానికి చాలా ప్రేరేపించింది' అని ఆమె పంచుకుంది. ఇలాంటి వారు ఎందరో అమృతను ప్రేరేపించారు.

కరోనా ఇచ్చిన కొత్త ఆలోచన

కోవిడ్-19 మహమ్మారి అన్ని కార్యకలాపాలను నిలిపి వేసింది. డిసెంబరు 2019లో ఆఫీస్‌ని సెటప్ చేసిన మూడు నెలల తర్వాత అమృత తన కార్యాలయాన్ని మూసివేయవలసి వచ్చింది. 'కరోనా వల్ల శిక్షణ పొందిన నా పాత ఉద్యోగులను కోల్పోతానేమో అనే ఆలోచన నన్ను భయపెట్టింది. అందుకే ఇలాంటి కష్టతరమైన పరిస్థితుల్లో కూడా నా పనిని కొనసాగించాలనుకున్నాను' అని ఆమె జతచేశారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ కొనుగోళ్ళు, హోం డెలివరీలు బాగా పెరిగాయి. ఇది అమృతకు ఓ కొత్త ఆలోచనను ఇచ్చాయి. దాంతో వావ్ డెలివరీలను ప్రారంభించారు. తన శిక్షకులతో పాటు ఏడాదికి అవసరమైన మందులు, ఆహారం మొదలైన వాటిని పంపిణీ చేయడం ప్రారంభించారు. తన అనుభవాన్ని వివరిస్తూ మహమ్మారి సమయంలో పని చేయడం మానసికంగా సవాలుగా ఉండేదని గుర్తు చేసుకున్నారు.

వివిధ సెషన్లు

ఒక నెలలో 10 మంది విద్యార్థుల నుండి ప్రారంభించి అమృత ఇప్పుడు ఒక నెలలో దాదాపు 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. నాన్-గేర్ బైక్‌లు, రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో సహా డ్రైవింగ్ గేర్, నాన్-గేర్ ద్విచక్ర వాహనాలపై ఈ కేంద్రం మహిళలకు శిక్షణ ఇస్తుంది. నాన్-గేర్ బైక్‌ల కోసం ఇది 10 రోజుల సెషన్‌ను అందిస్తుంది. ఇక్కడ మొదటి నాలుగు రోజుల్లో బ్యాలెన్సింగ్, స్పీడ్ కంట్రోల్, టర్న్‌లు తీసుకోవడం, డబుల్ డ్రైవింగ్ నేర్పుతుంది. ప్రతి సెషన్‌కు 40 నిమిషాల నిడివి ఉంటుంది. సోమవారం నుండి శనివారం వరకు నిర్వహించబడుతుంది. హోండా సిటీ 100 బైక్ కోసం ఎనిమిది రోజుల పాటు 40 నిమిషాల సెషన్‌లను నిర్వహిస్తుంది. అయితే రాయల్ ఎన్‌ఫీల్డ్‌కి పది రోజుల పాటు గంట సెషన్‌లు పడుతుంది. నాన్-గేర్ బైక్‌లకు రూ. 3,750, గేర్ బైక్‌లకు రూ. 5,000 వసూలు చేస్తారు. ఉమెన్ ఆన్ వీల్స్ గ్రూప్ సెషన్‌లను కూడా నిర్వహిస్తుంది. 'డ్రైవింగ్ నేర్చుకునేందుకు మా వద్దకు వచ్చే కొంతమంది విద్యార్థులు వారి కోర్సు తర్వాత కోచ్‌లుగా మారతారు' అని ఆమె వివరిస్తూ కంపెనీలో మొత్తం 15 మంది మహిళా శిక్షకులు ఉన్నారని, వారు నెలలో రూ. 15,000 లేదా అంతకంటే ఎక్కువ సంపాదిస్తారని చెప్పారు.



స్త్రీలను స్వతంత్రులను చేయడం

అమృత తన శిక్షణా సేవలను పేద విద్యార్థులకు అందజేస్తుంది. వారు తమ ఫీజులు చెల్లించవచ్చు లేదంటే శిక్షకురాలిగా చేరవచ్చు. ఉమెన్ ఆన్ వీల్స్ వారి జీతం నుండి రుసుమును తీసివేస్తుంది. ఆమె తండ్రి శిక్షణా కేంద్రంలో ఆరు నాన్-గేర్, మూడు-గేర్ మోటార్‌సైకిళ్లను కొనుగోలు చేయడానికి డబ్బు పెట్టుబడిగా ఇచ్చారు. ఇప్పటివరకు ఉమెన్ ఆన్ వీల్స్ కార్యకలాపాలు ముంబయికి మాత్రమే పరిమితమయ్యాయి. అయితే అమృత తన వ్యాపారాన్ని పాన్-ఇండియాకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 'స్త్రీలను స్వతంత్రులను చేయడం, మూస పద్ధతులను బద్దలు చేస్తూ మా సంస్థ ద్వారా వారికి ఉపాధి కల్పించడంలో సహాయపడటం నా లక్ష్యం" అని ఆమె ముగించారు.



పూల పాన్పు కాదు

2022లో పరిస్థితులు మెరుగుపడిన తర్వాత అమృత తన డ్రైవింగ్ స్కూల్ వ్యాపారానికి తిరిగి వచ్చేసింది. అయితే ఆమె ప్రయాణం పూల పాన్పు కాదు. మొదట్లో చాలా మంది నివాసితులు ప్రమాదాల గురించి భయపడి పోలీసులను ఆశ్రయించేవారు. అయినప్పటికీ ఆమె తన శిక్షణా సెషన్‌లను క్రమశిక్షణగా కొనసాగించారు. 'శిక్షణను నిలిపివేయమని పోలీసులు నన్ను ఎన్నో సార్లు ఆదేశించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నందున సహాయం కోరుతూ సందేశం రాశాను. స్థానిక కార్పొరేటర్లు, తెలిసిన వ్యక్తులు పై అధికారులతో మాట్లాడి నాకు సహాయం చేసారు' అని ఆమె గుర్తుచేసుకున్నారు. అయినా సవాళ్లు ఆగలేదు. ఓ మహిళా ఎన్నో అవమానాలు ఎదుర్కో వలసి వచ్చింది. వీటన్నింటినీ ఆమె ధైర్యంగా ఎదుర్కొంది.

మా తండాల అభివృద్ధిని అడ్డుకున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ వర్గీయులు సత్యవతి రాథోడ్‌పై విమర్శలు గుప్పించినట్టు తెలిసింది. డోర్నకల్ నియోజకవర్గంలోని కొన్ని తండాలను పంచాయతీలు కాకుండా ఆమె తొక్కి పట్టారంటూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతోపాటు క్షేత్రస్థాయిలోని వాస్తవాలను అధిష్టానానికి చెప్పే వీల్లేకుండా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావుతోపాటు సత్యవతి రాథోడ్ తమ నోర్లు నొక్కేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దశలో జోక్యం చేసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు ఇరువర్గాలను సముదాయించటంతో పరిస్థితి సద్దుమణిగింది. సమావేశానికి హాజరైన సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ... వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి తనకు మరోసారి టిక్కెట్ ఇవ్వాలని కోరారు. గత ఐదేండ్లుగా కార్యకర్తలు, నాయకులను కలుపుకుని ముందుకెళుతున్నానని ఆమె తెలిపారు. అందువల్ల తనకు ఇంకోసారి పోటీ చేసే అర్హత ఉందని భావిస్తున్నట్టు చెప్పారు. ఈ అంశాన్ని పరిశీలించాలంటూ కవిత...బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతామంటూ వారు



కలహాల కాపురంలో ఇమడలేకే..!

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు ఎక్కుపెట్టారు. 'బీజేపీ పట్ల నమ్మకంతో పార్టీలో చేరిన వారిని అంటరాని వారిగానే చూస్తున్నారు. ప్రజల్లో కనీస ప్రభావం లేని నాయకులకు పార్టీ పదవులు అంటగట్టి మాలాంటి వారిపై వారు పెత్తనం చెలాయించడం, వారే మా భవిష్యత్తును నిర్ణయించే స్థితిలో ఉండటం నిజంగా ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఎన్నికల్లో పోటీ చేయాలనే కోరిక లేనివారు...ప్రజల మధ్యకెళ్లి తీర్పుకోరే ధైర్యం లేనివాళ్లు మాలాంటి వారిని ప్రజాక్షేత్రం నుంచి దూరం చేయాలని ప్రయత్నిస్తుంటే పార్టీ నిస్సత్తువుగా మారటం బాధాకరం' అంటూ బాంబు పేల్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నేతలు వ్యవహరించిన తీరుపైనా విక్రమ్‌గౌడ్ విమర్శలు ఎక్కుపెట్టారు. టికెట్ ఆశించి భంగపడ్డవారితో మాట్లాడి వారికి నచ్చజెప్పాలనే ప్రయత్నం నేతల మధ్య కొరవడటం నాయకత్వ లేమి వల్లనే జరిగిదంటూ కిషన్‌రెడ్డిపై పరోక్ష విమర్శలు గుప్పించారు.

మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ మూడేండ్ల కింద కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన విషయం విదితమే. రాజాసింగ్‌పై సస్పెన్షన్ వేటు తర్వాత గోషామహల్‌లో అన్నీ తానై విక్రమ్‌గౌడ్ పార్టీని నడిపించిన సంగతీ తెలిసిందే. తీరా అభ్యర్థుల ప్రకటన సమయంలో విక్రమ్‌గౌడ్‌కు బీజేపీ మొండి చేయి చూపించింది. గోషామహల్ టికెట్ ఇవ్వకపోయినప్పటికీ అతనితో సంప్రదింపులు జరపాలనే సోయిని బీజేపీ నాయకత్వం మరిచింది. ఇదే విషయం పార్టీకి, ఆయనకు మధ్య దూరాన్ని మరింత పెంచింది. బీజేపీలో బండి సంజయ్, ఈటల రాజేందర్ గ్రూపుల మధ్య జరుగుతున్న ఆధిపత్యపోరును కిషన్‌రెడ్డి గ్రూపు చలిమంటేసి కాపుకుంటున్నదనే విమర్శ ఉంది. రాష్ట్ర, జిల్లా ముఖ్యనాయకులు ముఖ్యనేతలకు భజనపరులుగా మారిపోయారన్న విమర్శలను, పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూసి నిజమైన కార్యకర్తలు ఈసడించుకుంటున్నారు. బీజేపీ ఎస్సీ వర్గీకరణ, బీసీ సీఎం జపం ఎత్తుకున్నా అది ఎన్నికల స్టంటేననీ, పార్టీలో కిషన్‌రెడ్డి సామాజిక తరగతి ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆయన చుట్టూ ఉన్న కోటరీ కూడా ఆ సామాజిక వర్గం నేతలే ఎక్కువగా కనిపిస్తున్నారు.

నౌకాదళంలో అదానీ డ్రోన్లు

(మొదటిపేజీ తరువాయి)

రక్షణ రంగ నిపుణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దేశీయ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన మానవ రహిత దృష్టి-10 ఏరియల్ వెహికల్ (డ్రోన్)ను నౌకాదళ ప్రధానాధికారి ఆర్.హరికుమార్ హైదరాబాదులో ఆవిష్కరించారు. దీనిని అదానీ ఏరోస్పేస్ పార్కులో తయారు చేశారు. ఈ డ్రోన్ సుమారు 450 కిలోల బరువును మోస్తుంది. ఆకాశంలో 36 గంటల పాటు ప్రయాణించగలదు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుంటుంది. హిందూ మహా సముద్రంలోని వ్యూహాత్మక జలాలపై నిఘా వేసి ఉంచేందుకు ఈ డ్రోన్ ఉపకరిస్తుంది. దీనిని గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు తరలించి నౌకాదళానికి అప్పగిస్తారు. దీని తయారీలో ఉపయోగించిన పరికరాలలో 70% దేశీయంగా ఉత్పత్తి అయినవే. దృష్టి-10 డ్రోన్ ఇజ్రాయిల్ ఎల్బిట్ సిస్టమ్స్‌కు చెందిన హెర్మస్-900 యూఏవీ తరహాలో ఉంటుంది. ప్రస్తుతం మన నౌకాదళం వద్ద వ్యూహాత్మక డ్రోన్లతో పాటు 'సీ గార్డియన్' పేరుతో ఉన్న నాలుగు హెచ్‌ఏఎల్‌ఈ డ్రోన్లు కూడా ఉన్నాయి. నాలుగు దృష్టి-10 స్టార్‌లైనర్ల కోసం ఆర్డర్ ఇచ్చామని, వీటిలో రెండు నౌకా దళానికి, మరో రెండు సైనిక దళానికి ఉద్దేశించామని, అయితే 150 ఎంఏఎల్‌ఈ డ్రోనర్లను కొనుగోలు చేయాలని సైన్యం యోచిస్తోందని రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. అరేబియా సముద్రంలో ఇటీవలి కాలంలో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో భారత నౌకాదళం ఇప్పటికే యుద్ధ నౌకల సంఖ్యను పెంచింది. అరేబియా సముద్రంలో, గల్ఫ్ ఆఫ్ అడెన్‌లో పది యుద్ధ నౌకలను మోహరించింది.

31 నుంచి పార్లమెంట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాలను ప్రారంభిస్తూ పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. మధ్యంతర బడ్జెట్‌లో మహిళా రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇచ్చే నగదు సాయాన్ని రెట్టింపు చేస్తారని భావిస్తున్నారు. ఇక ఏప్రిల్, మేలో లోక్‌సభ ఎన్నికలు రానుండటంతో బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం ఏమైనా కీలక ప్రకటనలు చేస్తుందా అనే ఉత్కంఠ నెలకొంది.

రెండూ మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నందున పూర్తి బడ్జెట్‌గా కాకుండా మధ్యంతర బడ్జెట్‌గా ఉంటుంది. ప్రభుత్వం ఎన్నికల సంవత్సరంలో లేదా పూర్తి బడ్జెట్‌కు తగినంత సమయం లేనప్పుడు మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పిస్తుంది. ఎన్నికల తరువాత వచ్చే ప్రభుత్వం పూర్తి వార్షిక బడ్జెట్‌ను రూపొందించే బాధ్యతను తీసుకుంటుంది.

సమగ్ర ఆర్థిక సర్వేకు బదులుగా ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌కు ముందు 2024-25 సంవత్సరానికి సంబంధించి దేశ ఆర్థిక స్థితిపై సంక్షిప్త పత్రాన్ని సమర్పించాలని భావిస్తున్నారు.

గతేడాది, 2023-24 కోసం కేంద్ర బడ్జెట్‌ను 2023 ఫిబ్రవరి 1న సమర్పించారు. పార్లమెంటరీ సమావేశాల మొదటి భాగంలో, లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ బడ్జెట్‌పై సాధారణ చర్చ జరిగింది. లోక్‌సభలో నిర్ణీత సమయంగా కేటాయించిన 12 గంటల కంటే ఎక్కువ 14: 45 గంటల పాటు చర్చ జరిగింది. రాజ్యసభలో 2: 21 గంటల పాటు చర్చ కొనసాగింది. ఇది కేటాయించిన 12 గంటల కంటే చాలా తక్కువగా ఉంది. బడ్జెట్ చర్చలో మొత్తం 145 మంది లోక్‌సభ సభ్యులు, 12 మంది రాజ్యసభ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సెషన్‌లో మొత్తం ఎనిమిది బిల్లులు (లోక్‌సభలో ఎనిమిది) కూడా ప్రవేశపెట్టబడ్డాయి. ఆర్థిక బిల్లు-2023, జమ్మూ కాశ్మీర్ విభజన బిల్లు-2023, జమ్మూ కాశ్మీర్ విభజన (నెంబర్ 2) బిల్లు-2023, ది అప్రాప్రియేషన్ (నెంబర్ 2) బిల్లు-2023, డివిజన్ బిల్లు-2023, పోటీ (సవరణ) బిల్లు- 2023లను ఉభయ సభలు ఆమోదించాయి. ఇక బడ్జెట్ సమావేశాల అనంతరం ఏ క్షణమైనా లోక్‌సభ ఎన్నికలకు ఈసి షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

పరిశుభ్ర నగరాల్లో హైదరాబాద్‌కు 9వ స్థానం...

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోనే బెస్ట్ క్లీనెస్ట్ సిటీల్లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఏడోసారి సత్తా చాటింది. 2023 ఏడాదికి గాను స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో... గుజరాత్‌లోని సూరత్‌తో కలిసి ఇండోర్ అగ్రస్థానాన్ని పంచుకుంది. నవీ ముంబయి తన మూడో స్థానాన్ని పదిలపర్చుకుంది. ఇక టాప్ టెన్‌లో తెలుగు రాష్ట్రాలు చోటు దక్కించుకున్నాయి. నాలుగో స్థానంలో విశాఖపట్నం, ఆరో స్థానంలో విజయవాడ, ఎనిమిదో స్థానంలో తిరుపతి, తొమ్మిదో స్థానంలో హైదరాబాద్ నిలిచాయి. గురువారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్ యుఏ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ప్రదానోత్సవంలో చీఫ్ గెస్ట్‌గా హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను ప్రదానం చేశారు.

క్లీన్ సిటీస్, క్లీనెస్ట్ కంటోన్మెంట్, సఫాయిమిత్ర సురక్ష, గంగా టౌన్స్, బెస్ట్ పెర్ఫార్మింగ్ స్టేట్ కేటగిరీలలో టాప్ త్రిలో నిలిచిన సిటీలకు ఆమె అవార్డులను అందజేశారు. కాగా... నేషనల్ లెవల్‌లో 24, జోనల్ లెవల్‌లో 20, స్టేట్ లెవల్‌లో 54 ఇతర విభాగాల్లో కలిపి మొత్తం 110 అవార్డులను కేంద్రం ప్రదానం చేసింది. లక్ష లోపు జనాభా కలిగిన సిటీల కేటగిరీలో సస్వాద్, పటాన్, లోనావాలా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మధ్యప్రదేశ్‌లోని మోవ్ కంటోన్మెంట్ బోర్డు క్లీనెస్ట్ కంటోన్మెంట్ బోర్డుగా ఎంపికైంది. క్లీనెస్ట్ గంగా సిటీల్లో వారణాసి, ప్రయాగ్ రాజ్ మొదటి రెండు అవార్డులు గెలుచుకున్నాయి. ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ ప్రోగ్రాంలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023 డ్యాష్ బోర్డును రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావడం ముఖ్యమైన ముందడుగన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రాలు, అర్బన్ లోక్ బాడీస్(యూఎల్ బీ)ల పనితీరును ప్రశంసించారు. 2023 ఏడాదిగాను 'వేస్ట్ టు వెల్త్' థీమ్ ఆలోచించాల్సిన కీలకమైన అంశమని గుర్తు చేశారు. వ్యర్థాల నుండి సంపదను సృష్టించాలనే అంశాన్ని తాను నొక్కి చెప్పాలనుకుంటున్నానన్నారు. ఈ అంశం మొత్తం పరిశుభ్రతకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. 2030 నాటికి పర్యావరణ పరంగా జీరో వేస్ట్ ప్రోగ్రాంను హైలైట్ చేయడానికి జీ- 20 లీడర్స్ ఢిల్లీ డిక్లరేషన్ కట్టుబడి ఉందన్నారు.



జీహెచ్ఎంసీకి క్లీన్ సిటీ అవార్డు....

లక్ష జనాభా పైబడిన నగరాల్లో ఆల్ ఇండియా క్లీన్ సిటీ కేటగిరిలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఫైవ్ స్టార్ రేటింగ్‌లో 9వ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే సౌత్ జోన్‌లో మొత్తం నాలుగు అవార్డుల్లో తెలంగాణకు మూడు అవార్డులు వరించాయి. 15-25 వేల మధ్య జనాభా, రాష్ట్రం లోపల లక్షల లోపు జనాభా కలిగిన కేటగిరిలో గుండ్లపోచంపల్లి క్లీన్ సిటీగా నిలిచింది. 25-50 వేల మధ్య జనాభా కలిగిన సిటీల్లో నిజాంపేట్, 50 నుంచి లక్ష లోపు జనాభా కలిగిన సిటీల్లో సిద్దిపేట క్లీన్ సిటీ అవార్డులను పొందాయి. కాగా... జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు దక్కిన అవార్డును జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సోమ భారత్, సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ మంజులలు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరీదీప్ సింగ్ పూరి చేతుల మీదుగా అందుకున్నారు. జీహెచ్ఎంసీకి క్లీనెస్ట్ సిటీ అవార్డు దక్కడం పట్ల హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో రాష్ట్రం మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

వణికిన ఢిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

నష్టం జరిగినట్టు ఎలాంటి సమాచారం లేదు.

దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో గురువారం మధ్యాహ్నం భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.2 గా నమోదైంది. ఆఫ్ఘనిస్తాన్‌లో 220 కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మొలజీ తెలిపింది. అలాగే ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌కి ఈశాన్యంగా 241 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్టు వెల్లడించింది. దీంతో ఢిల్లీతో పాటు పంజాబ్, ఛండీగఢ్, ఘజియాబాద్‌లోనూ భూ ప్రకంపనలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. జమ్మూకాశ్మీర్, పాకిస్థాన్‌లోనూ భూమి కంపించినట్టు వెల్లడించారు.

భూకంపాలు ఎందుకు... ఎలా సంభవిస్తాయి?

దీన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలంటే.. ముందుగా భూమి నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి. భూమి టెక్టోనిక్ ప్లేట్లపై ఉంది. దాని కింద ద్రవ లావా , టెక్టోనిక్ ప్లేట్లు దానిపై తేలుతుంటాయి. చాలా సార్లు ఈ ప్లేట్లు ఒకదానికొకటి ఢీకొంటాయి. పదేపదే ఢీకొనడం వల్ల, కొన్నిసార్లు ప్లేట్ల మూలలు వంగి, ఎక్కువ ఒత్తిడి ఉన్నప్పుడు ఈ ప్లేట్లు విరిగిపోతాయి. అలాంటి పరిస్థితిలో దిగువ నుంచి వచ్చే శక్తి ఒక మార్గాన్ని కనుగొంటుంది. ఇది అలజడి సృష్టించినపుడు భూకంపం వస్తుందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కోసం డిజిటలైజేషన్ ఎజెండా అభివృద్ధిలో సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. తమ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా నెట్ వర్క్ ఉందనీ, రాష్ట్రాభివృద్ధిలో కలిసి పని చేస్తామని సీఎంకు తెలిపారు. గూగుల్ మ్యాప్స్, ఎర్త్ ప్లాట్‌ఫాంలను ఉపయోగించి సాధ్యమయ్యే రహదారి భద్రతపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బృందం భేటీ

అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బందం డాక్టర్ డొమినిక్ మావో నేతత్వంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసింది. ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల ప్రారంభించిన 'ప్రోగ్రాం ఫర్ సైంటిఫిక్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్' కార్యక్రమం గురించి సీఎంకు వారు వివరించారు. పేద విద్యార్థుల కోసం రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలను బలోపేతం చేయడానికి వీలుగా ఏడాదిపాటు విద్యా కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్, ఎంఎస్ షెఫాలీ ప్రకాష్, డాక్టర్ ఎండీ రైట్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు తెలంగాణల అనుకూలం

సీఎంతో భేటీలో మైక్రాన్ కంపెనీ సీఈవో సంజయ్ మెహెత్రా

ప్రపంచంలోనే అతి పెద్ద చిప్ తయారీ కంపెనీ మైక్రాన్ టెక్నాలజీ సీఈవో సంజయ్ మెహెత్రా గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం ఉందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మైక్రాన్ కంపెనీ ఆసక్తి చూపితే రాష్ట్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలను అందిస్తుందని సీఎం వారికి భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపన, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి కల్పకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని అన్నారు.



సంక్రాంతి బరిలోకి కిష్టయ్య దిగుతున్నాడు : నాగార్జున

'మన తెలుగువారికి సంక్రాంతి అంటే సినిమా పండగ. ఈ సంక్రాంతి నాలుగు సినిమాలు వస్తున్నాయి. పరిశ్రమలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకొని 'గుంటూరుకారం'తో వస్తున్న మహేష్ బాబుకి, హను-మాన్ సినిమాతో వస్తున్న తేజకి, మా వెంకీ 75వ చిత్రంగా సైంధవ్‌తో వస్తున్నారు.వీళ్ళందరికీ ఆల్ ది బెస్ట్. మేము 'నా సామిరంగ'తో వస్తున్నాం. మీకు మా సినిమా నచ్చుతుంది' అని నాగార్జున అన్నారు.

ఆయన లేటెస్ట్‌గా నటించిన చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకునిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో ఆషిక రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తోంది. అల్లరి నరేష్, రాజ్ తరుణ్, రుక్సర్ ధిల్లాన్, మిర్నా మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈనెల 14న గ్రాండ్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున మాట్లాడుతూ, 'మూడు నెలల్లో సినిమా ఎలా తీయొచ్చు అనేది ఒక పుస్తకం రాసిస్తాం. సినిమా విడుదల సందర్భంగా అక్కినేని అభిమానులకు ఒక మాట చెప్పాలి. ఈసారి పండక్కి కిష్టయ్య వస్తున్నాడు.. బాక్సాఫీసు కొడుతున్నాడు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు' అని తెలిపారు.

నవచిత్రం

గర్వంగా చెప్పుకుంటాను..



ప్రశాంత్ వర్మ

ప్రశాంత్ వర్మ, తేజ సజ్జ కాంబోలో రాబోతున్న సినిమా 'హను-మాన్'. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి నిర్మించగా, శ్రీమతి చైతన్య సమర్పిస్తున్నారు. సంక్రాంతి కానుకగా నేడు (శుక్రవారం) ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమా సూపర్ హీరో ఫిల్మ్ టెంప్లెట్‌లో ఉంటుంది. కొత్తదనం ఏమిటంటే.. ఇది మన తెలుగు సినిమా స్టయిల్ అఫ్ మేకింగ్‌లో ఉంటుంది. బ్యాట్ మ్యాన్ లాంటి సినిమాని రాజమౌళి చేస్తే ఎలా వుంటుందో అలా ఉంటుంది. ఈ సినిమాకి అన్నీ వైపుల నుంచి వస్తున్న అద్భుతమైన రెస్పాన్స్ చూస్తుంటే... ఇదంతా ఒక డ్రీమ్‌లా ఉంది. ప్రేక్షకులు చాలా గొప్ప ఆదరణ చూపుతున్నారు. ఈ సినిమా కచ్చితంగా అందర్నీ మెప్పిస్తుంది. నేను గర్వంగా చెప్పుకునేలా ఈ సినిమా ఉంటుంది' అని అన్నారు.

నాకే చాలా కొత్త సినిమా..



వెంకటేష్

వెంకటేష్ నటించిన తన 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల వస్తోంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 13న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో వెంకటేష్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'సైంధవ్ మీ లాండ్ మార్క్ 75వ సినిమా కదా.. ఒత్తిడి ఏమైనా ఉందా అని అందరూ అడుగుతున్నారు. నాకు ఆ ఒత్తిడి ఏమీ లేదు. 75 అనేది నెంబర్ మాత్రమే. అయితే ఒక కెరీర్‌లో 50, 75, 100 నెంబర్స్ సహజంగానే ఒక మైల్ స్టోన్‌లా అనుకోవచ్చు. నా వరకూ ఆ సమయానికి వచ్చింది నిజాయితీగా చేయాలని ప్రయత్నిస్తాను. ప్రతి సినిమా ప్రత్యేకమే. దర్శకుడు శైలేష్ కొలను కథ చెప్పినపుడు చాలా బ్యూటీఫుల్ డాటర్ సెంటిమెంట్ అనేది నాకు బాగా నచ్చింది. రెగ్యులర్‌గా కాకుండా కథకు అవసరమైయ్యే ఎమోషనల్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. యాక్షన్ చాలా నేచురల్‌గా ఉంది. చాలా ఫాస్ట్ పేస్డ్ మూవీ ఇది. ఇది నాకు ఒక డిఫరెంట్ బ్యాక్ డ్రాప్ మూవీ అవుతుందనిపించింది. సైంధవ్ వరల్డ్ బిల్డింగ్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. సైంధవ్ తర్వాత ఈ తరహాలో ఇంకొన్ని కథలు వచ్చే అవకాశం ఉంది' అని అన్నారు.





ఆటలు



క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

● అశ్విని, తనీశ జంట సైతం ● మలేషియా ఓపెన్ సూపర్ సిరీస్

భారత అగ్రశ్రేణి డబుల్స్ జోడీ సాత్విక్, చిరాగ్ జోరు కొనసాగుతోంది. సూపర్ సిరీస్ 1000 టోర్నీలో సాత్విక్, చిరాగ్‌లు అదరగొట్టారు. అలవోక విజయంతో మెన్స్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకున్నారు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, తనీశ క్రాస్టో జోడీ సంచలనం చేసింది. మెగా ఈవెంట్‌లో వరుసగా రెండో విజయంతో క్వార్టర్స్‌కు చేరుకుంది. కిదాంబి శ్రీకాంత్ పరాజయంతో మలేషియా ఓపెన్ సింగిల్స్ విభాగంలో టీమ్ ఇండియా పోరాటానికి తెరపడింది.

కౌలాలంపూర్ (మలేషియా)

2024 పారిస్ ఒలింపిక్స్ అర్హత తుది అంకంలోనూ భారత బ్యాడ్మింటన్ స్టార్ షట్లర్లు ఫామ్‌లోకి రావటం లేదు. పురుషుల, సింగిల్స్ విభాగాల్లో టీమ్ ఇండియా షట్లర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. ఇదే సమయంలో డబుల్స్ స్టార్స్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ అలవోకగా ప్రీ క్వార్టర్స్‌లో విజయం సాధించగా.. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, తనీశ క్రాస్టో జంట సైతం క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపింది. మెన్స్ సింగిల్స్ తొలి రౌండ్లో మెరుపు విజయంతో ఆశలు రేపిన తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ ప్రీ క్వార్టర్స్‌లో నిరాశపరిచాడు. పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రక్రియలో తుది త్రైమాసికం ఆరంభం కావటంతో.. ఒలింపిక్ బెర్త్‌లో భారత షట్లర్లలో అలజడి మొదలైంది.

ఎదురులేదు : పురుషుల డబుల్స్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించిన సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ.. మరో సూపర్ సిరీస్ 1000లో సత్తా చాటుతున్నారు. ఫ్రాన్స్ జంట లుకాస్, రోనన్‌లపై వరుస గేముల్లో గెలుపొందిన సాత్విక్, చిరాగ్‌లు 39 నిమిషాల్లోనే లాంఛనం ముగించారు. 21-11, 21-18తో ఎదురులేని విజయం నమోదు చేశారు. తొలి గేమ్‌లో సాత్విక్, చిరాగ్‌లకు ప్రత్యర్థుల నుంచి పోటీ లేదు. ఏకపక్షంగా పాయింట్లు సొంతం చేసుకున్నారు. 11-2తో విరామ సమయానికి తిరుగులేని ఆధిక్యం సాధించిన మనోళ్లు.. ద్వితీయార్థంలోనూ దుమ్మురేపారు.



వరుసగా తొమ్మిది పాయింట్లు సాధించి ఔరా అనిపించారు. 21-11తో తొలి గేమ్‌ను అలవోకగా కైవసం చేసుకున్నారు. రెండో గేమ్‌లో ఫ్రాన్స్ జోడీ ప్రతిఘటించింది. విరామ సమయానికి రెండో సీడ్ సాత్విక్, చిరాగ్‌లకు ఝలక్ ఇచ్చింది. 11-6తో లుకాస్, రోనన్‌లు ముందంజ వేశారు. ద్వితీయార్థంలో వరుసగా ఐదు పాయింట్లతో పుంజుకున్న సాత్విక్, చిరాగ్‌లు 16-16 వద్ద స్కోరు సమం చేశారు. ఒత్తిడిలో మెరుపు స్మాష్‌లు సంధించి.. రెండో గేమ్‌ను 21-18తో గెల్చుకుని క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకున్నారు. నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్ సమరంలో చైనా జోడీ హీ జి టింగ్, రెన్ జియాంగ్ యులు సాత్విక్, చిరాగ్‌లకు సవాల్ విసరనున్నారు.

మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, తనీశ క్రాస్టోలు క్వార్టర్స్‌కు చేరుకున్నారు. 21-19, 13-21, 21-15తో మూడు గేముల మ్యాచ్‌లో ఏడో సీడ్ జపాన్ జంటకు షాక్ ఇచ్చారు. మయూ, నగహర జోడీ ఫేవరేట్‌గా బరిలోకి దిగినా.. అశ్విని, క్రాస్టోలు ఖతర్నాక్ గేమ్ ఆడారు. 62 నిమిషాల పాటు సాగిన ప్రీ క్వార్టర్స్ పోరులో 21-19తో తొలి గేమ్‌ను గెల్చుకుని పైచేయి సాధించారు. 11-9తో విరామ సమయానికి ముందంజలో నిలిచిన భారత అమ్మాయిలు.. ద్వితీయార్థంలోనూ ఆధిక్యం నిలుపుకున్నారు. 16-16తో జపాన్ షట్లర్లు సమవుజ్జీగా నిలిచినా.. ఆఖర్లో వరుస పాయింట్లు సాధించారు. తొలి గేమ్ సొంతం చేసుకున్నారు.

జపాన్ అమ్మాయిలు దూకుడు పెంచిన రెండో గేమ్‌లో అశ్విని, క్రాస్టోలు వెనుకంజ వేశారు. కనీస పోటీ ఇవ్వలేకపోయారు. 13-21తో రెండో గేమ్ కోల్పోయారు. దీంతో మ్యాచ్ నిర్ణయాత్మక మూడో గేమ్‌కు వెళ్లింది. డిసైడర్‌లో అశ్విని, క్రాస్టో అదరగొట్టారు. 9-9 నుంచి వరుసగా ఐదు పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి వెళ్లారు. జపాన్ అమ్మాయిలు ద్వితీయార్థంలో కోలుకోలేకపోయారు. 21-15తో మూడో గేమ్‌తో పాటు సూపర్ సిరీస్ 1000 టోర్నీలో క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నారు. నేడు క్వార్టర్‌ఫైనల్లో కొరియా జోడీ రిన్, కియ్‌లతో అశ్విని, క్రాస్టోలు పోటీపడనున్నారు. ఇదిలా ఉండగా, పురుషుల సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ ఓటమి చెందాడు. తొలి రౌండ్లో మెరుపు విజయం సాధించినా.. హాంగ్‌కాంగ్ షట్లర్ లాంగ్ ఆంగస్ చేతిలో వరుస గేముల్లో నిరాశపరిచాడు. 13-21, 17-21తో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. హెచ్.ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ సైతం ఓటమి పాలవగా.. సింగిల్స్ విభాగంలో భారత పోరాటానికి తెరపడింది.

అలవోకగా బోణీ

● మొహాలి టీ20లో భారత్ గెలుపు ● ఛేదనలో మెరిసిన దూబె, జితేశ్, తిలక్

మొహాలి టీ20లో టీమ్ ఇండియా ఘన విజయం సాధించింది. అఫ్గనిస్థాన్‌తో తొలి టీ20 సిరీస్‌లో ఆతిథ్య భారత్ బంతితో, బ్యాట్‌తో మెప్పించింది. అక్షర్ పటేల్ (2/23), ముకేశ్ కుమార్ (2/33) రాణించటంతో తొలుత అఫ్గనిస్థాన్ 158/5 పరుగులే చేసింది. ఛేదనలో కుర్ర బ్యాటర్లు శివం దూబె (60), జితేశ్ శర్మ (31), తిలక్ వర్మ (26), గిల్ (23) మెరవటంతో టీమ్ ఇండియా అలవోక విజయం సాధించింది. టీ20 సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజ వేసింది.

నవతెలంగాణ-మొహాలి



అఫ్గనిస్థాన్‌తో తొలి టీ20లో టీమ్ ఇండియా ఘన విజయం సాధించింది. 159 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో ఆతిథ్య భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. యువ బ్యాటర్లు శివం దూబె (60 నాటౌట్, 40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీతో చెలరేగగా.. జితేశ్ శర్మ (31, 20 బంతుల్లో 5 ఫోర్లు), తిలక్ వర్మ (26, 22 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (23, 12 బంతుల్లో 5 ఫోర్లు) రాణించటంతో 17.3 ఓవర్లలో భారత్ లాంఛనం ముగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసింది. భారత్, అఫ్గనిస్థాన్ రెండో టీ20 ఆదివారం ఇండోర్‌లో జరుగనుంది.

సమిష్టిగా కొట్టారు : 159 పరుగుల ఛేదనలో టీమ్ ఇండియాకు ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. ఏడాది విరామం తర్వాత తొలి మ్యాచ్ ఆడుతున్న కెప్టెన్ రోహిత్ శర్మ (0) సమన్వయ లోపంతో రనౌట్‌గా నిష్క్రమించాడు. సున్నా పరుగులకే భారత్ తొలి వికెట్ కోల్పోయింది. తిలక్ వర్మ (26) తోడుగా గిల్ దూకుడు పెంచాడు. ఐదు ఫోర్లతో మెరిశాడు. గిల్ అవ్వటైనా.. తిలక్‌కు శివం దూబె తోడయ్యాడు. తిలక్ వర్మ రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ఆకట్టుకున్నాడు. శివం దూబె సైతం బౌండరీలతో చెలరేగాడు. జితేశ్ శర్మ (31) వేగంగా ఛేదన ముగించే క్రమంలో జితేశ్ వికెట్ కోల్పోయాడు. ఫినీషర్ రింకూ సింగ్ జతగా శివం దూబె జోరు కొనసాగించాడు. 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 38 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. రింకూ సింగ్ (16 నాటౌట్, 9 బంతుల్లో 2 ఫోర్లు) తనదైన ఇన్నింగ్స్‌తో మెరిశాడు. నవీన్ ఓవర్లో 6, 4తో దూబె లాంఛనం ముగించాడు.

స్పిన్ మ్యాజిక్ : టాస్ నెగ్గిన రోహిత్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. అఫ్గాన్ ఓపెనర్లు రెహ్మనుల్లా గుర్బాజ్ (23, 28 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), ఇబ్రహీం జద్రాన్ (25, 22 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో వికెట్ నష్టపోకుండా 33 పరుగులు చేసిన అఫ్గాన్‌ను స్పిన్నర్ అక్షర్ పటేల్ దెబ్బతీశాడు. అక్షర్ ఓవర్లో క్రీజు వదిలి ముందుకొచ్చిన గుర్బాజ్.. మళ్లీ క్రీజులోకి వెళ్లలేదు. రెహమత్ షా (3) వికెట్లను అక్షర్ పటేల్ గిరాటేశాడు. నం.3 బ్యాటర్ ఓమర్‌జాయ్ (29) నిలకడగా పరుగులు రాబట్టాడు. కానీ అతడిని ముకేశ్ కుమార్ సాగనంపాడు.మహ్మద్ నబి (42) , నజిబుల్లా జద్రాన్ (19 నాటౌట్) రాణించటంతో అఫ్గనిస్థాన్ 20 ఓవర్లలో 158 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

అఫ్గనిస్థాన్ ఇన్నింగ్స్ : 158/5 (మహ్మద్ నబి 42, అజ్మతుల్లా ఓమర్‌జాయ్ 29, అక్షర్ పటేల్ 2/23, ముకేశ్ 2/33)

భారత్ ఇన్నింగ్స్ : 159/4 (శివం దూబె 60 నాటౌట్, జితేశ్ శర్మ 31, తిలక్ వర్మ 26, ముజీబ్ 2/21).



టెస్టు మ్యాచ్‌కు ముమ్మర ఏర్పాటు

హైదరాబాద్: జనవరి 25 నుంచి జరుగనున్న భారత్, ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్‌కు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పిచ్, అవుట్‌ఫీల్డ్, స్టాండ్స్, రూఫ్‌టాప్, కొత్త సీటింగ్, డ్రెస్సింగ్‌రూమ్స్ ఆధునీకరణ, శానిటేషన్ పనుల పురోగతిని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావుతో కలిసి ఇతర ఆఫీస్ బేరర్లు పరిశీలించారు. 'టెస్టు నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు ఉండేందుకు వీల్లేదు. పిచ్, అవుట్‌ఫీల్డ్ అత్యుత్తమ ప్రమాణాలతో ఉండాలి. మ్యాచ్‌కు వచ్చే అభిమానులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని' మైదాన సిబ్బంది, హెచ్‌సీఏ యంత్రాంగాన్ని జగన్‌మోహన్ రావు ఆదేశించారు.

ఇక మేఘాలయతో పోరు

భారీ విజయంపై హైదరాబాద్ గురి



షిల్లాంగ్ (మేఘాలయ) : రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌కు పడిపోయిన హైదరాబాద్.. ఎలైట్ డివిజన్‌లో అడుగుపెట్టేందుకు అన్ని అస్త్రాలు ప్రయోగిస్తుంది. రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో నాగాలాండ్‌ను చిత్తు చేసిన హైదరాబాద్ నేడు మేఘాలయను ఢీకొట్టనుంది. రెండో రౌండ్ మ్యాచ్‌లో బలమైన హైదరాబాద్‌కు మేఘాలయ ఏ మేరకు పోటీ ఇవ్వగలదో చూడాలి. హైదరాబాద్ బ్యాటర్ రాహుల్ సింగ్ డబుల్ సెంచరీతో సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు. కెప్టెన్ తిలక్ వర్మ జాతీయ జట్టు బాధ్యతల్లో ఉండగా.. రాహుల్ సింగ్ సారథ్యం అందుకోనున్నాడు. టాప్ ఆర్డర్‌లో తన్మయ్ అగర్వాల్ సైతం ఫామ్‌లో ఉండటంతో హైదరాబాద్ మరో భారీ విజయంపై కన్నేసింది. మేఘాలయపై సైతం బోనస్ పాయింట్‌తో నెగ్గాలనే పట్టుదలతో హైదరాబాద్ కనిపిస్తోంది. హైదరాబాద్, మేఘాలయ రంజీ పోరు ఉదయం 8.30 గంటలకు ఆరంభం.

కెప్టెన్సీ వదిలేసిన విహారి

ఆంధ్ర కొత్త కెప్టెన్ రికీ భుయ్



ముంబయి : రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో ఆకట్టుకున్నా, కీలక ముంబయితో పోరు ముంగిట ఆంధ్ర డ్రెస్సింగ్‌రూమ్‌లో అనిశ్చితి అలజడి రేపింది. స్టార్ బ్యాటర్ హనుమ విహారి ఆఖరు నిమిషంలో కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. రెండో రౌండ్ మ్యాచ్ కోసం ఆంధ్ర జట్టు ముంబయికి చేరుకుంది. మ్యాచ్ ముంగిట చివరి ప్రాక్టీస్ సెషన్లో ఆంధ్ర సెలక్టర్లు కెప్టెన్సీ మార్పు నిర్ణయాన్ని ఆమోదించారు. వ్యక్తిగత కారణాలతో విహారి కెప్టెన్సీ వదిలేసినట్టు తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన రికీ భుయ్ ఆంధ్ర జట్టుకు సారథిగా ఎంపికయ్యాడు.

'విహారి బ్యాటింగ్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టాలని అనుకుంటున్నాడు. అందుకే కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. మేమంతా పదేండ్లుగా ఆంధ్ర జట్టుతో ఉన్నాం. కెప్టెన్ ఎవరనేది పెద్ద విషయం కాదు' రికీ భుయ్ అన్నాడు. ఆంధ్ర, ముంబయి రంజీ మ్యాచ్ నేడు ఉదయం 9.30 గంటలకు ఆరంభం కానుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886